

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 326

శుక్రవారం 16-2-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL











# పెళ్లికి ప్రత్యేకం

**పెళ్లి వేడుకల్లో ప్రత్యేకత గురించి ఎంతగా పరితపిస్తారో అందరికీ తెలిసిందే! లెహంగా అయినా శారీ అయినా రంగులు, డిజైన్లు, మెటీరియల్ మీద అందరి దృష్టి ఉంటుంది. సౌకర్యంగా ఉంటూనే గ్రాండ్‌గా వెలిగిపోయేలా ఈ వెడ్డింగ్ సీజన్ డ్రెస్సుల మీద అందరి దృష్టిని మరింత ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది.**

### మహారాణి కళ

గులాబి పింక్, పీచ్, గ్రీన్ కలర్ డ్రెస్సులు సంప్రదాయ ఎంపికలో వైవిధ్యాన్ని చూపుతాయి. స్టైలిష్‌గానూ కనిపిస్తాయి.

ఎంబ్రాయిడరీ, జరీ వర్క్, స్టోన్స్ సీక్వెన్స్‌తో ఉన్న ఎరుపు రంగు లెహంగా మహారాణి కళ ఉట్టిపడేలా చేస్తూ మళ్లీ వెలుగు చూస్తోంది.

### పేస్టల్ లెహంగా

పెళ్లి కూతురు స్నేహితురాళ్లు, దగ్గరి బంధువులు అమ్మాయిలు ధరించే మినిమలిస్టిక్ బ్లాక్, మింట్ గ్రీన్, పౌడర్ బ్లూ, లావెండర్, సాఫ్ట్ పింక్ కలర్స్ రొమాంటిక్ దారులకు స్వాగతం పలుకుతున్నాయి.

### ఫిష్ టెయిల్ లెహంగా

ఆధునికత, సంప్రదాయతల కలబోతగా పెళ్లికూతురును అందంగా చూపుతుంది ఫిష్‌టెయిల్ లెహంగా. స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటుంది.

### ఫ్లోరల్స్

ప్లెయిన్ లేదా పిమ్మరీ లేదా ఫ్లోరల్ లెహంగా ఉంటే చాలు ప్రత్యేకమైన రోజు మీదే అవుతుంది. ఎకోఫ్రెండ్లీ ఫ్యాబ్రిక్‌తో, ఆర్గానిక్ డైస్‌తో సంప్రదాయ కలనేత టెక్నిక్స్‌తో రూపుదిద్దుకున్న లెహంగా లేదా శారీ ఎప్పుడూ ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది.

### పర్సనల్ టచ్

పాతదే అయినా మళ్లీ కొత్తగా కనువిందు చేస్తోంది పర్సనల్ టచ్ ఉండే లెహంగా.

వధూవరుల పేర్లు, వారి పరిచయం వివరాలు.. అందమైన ఎంబ్రాయిడరీ లేదా ఫ్యాబ్రిక్ పెయింట్‌తో చేసిన డిజైన్ మళ్లీ ఆకట్టుకుంటుంది.

### ఐవరీ కలర్

క్రీమ్ లేదా ఐవరీ కలర్ లెహంగా లేదా శారీస్ ఈ వెడ్డింగ్ సీజన్‌ని మరింతగా ఆకట్టుకోనున్నాయి. వీటి మీద గోల్డెన్ ఫ్లవర్స్ అదనపు ఆకర్షణ కానున్నాయి. వీటికి కాంట్రాస్ట్ స్టోన్ జ్యువెలరీ ధరిస్తే రాయల్ లుక్ సొంతం కావడమే ఈ ఎంపికకు అసలు కారణం.

### ధోతీ లెహంగా

ఇండోవెస్ట్రన్ ఫ్యూజన్ లుక్‌తో ధోతీ లెహంగా ఈ యేడాది ట్రెండ్‌లో ఉంది. డ్రేప్డ్ స్కర్ట్ షేప్, క్రాప్‌టాప్ లేదా ప్రత్యేకమైన బ్లౌజ్ ఈ వెడ్డింగ్ సీజన్‌ని బ్రైట్‌గా మార్చనుంది.

### ఆలివ్ ఆయిల్

లైట్ ఆలివ్, లైట్ బ్లూ షేడ్స్ ఆర్గంజా మెటీరియల్ లెహంగా లేదా శారీస్ సరైన ఎంపిక అవుతుంది. సౌకర్యంగానూ, స్పెషల్‌గానూ కనిపించే ఈ కలర్ కాంబినేషన్‌లో ఫ్లోరల్ ప్రింట్స్ లేదా ప్లెయిన్ డ్రెస్‌ను ఎంచుకోవచ్చు. సిల్క్, జరీ, వెల్వెట్, ఆర్గంజా లెహంగాలు చాలా ఫ్యాషనబుల్‌గా ఉంటాయి. లైట్ వెయిట్‌గా ఉండటంతో సులువుగా క్యారీ చేయచ్చు.





## కిచెన్‌టిప్స్



కాఫీలో కొద్దిగా బోర్నవిటా కలుపుకుంటే కాఫీకి మంచి రుచి వస్తుంది.

కూరల్లో కారం కాస్త ఎక్కువైతే అందులో కొంచెం నిమ్మరసం లేదా రెండు టీస్పూన్ల నెయ్యి కలిపితే కారం తగ్గుతుంది.





ఇడ్లీ చట్నీలో పల్లీలతోపాటు నాలుగైదు బాదం పప్పులు, జీడిపప్పు పలుకులు వేస్తే పోషకాలు అందటంతో పాటు, రుచిగా ఉంటుంది.

బొంబాయి రవ్వ హల్వా మరింత రుచిగా ఉండాలంటే టేబుల్ స్పూన్ శెనగ పిండిని కలుపుకోవాలి.



మిగిలిపోయిన అన్నంలో కొంచెం మసాలా దినుసులు, బ్రెడ్ వేసి అన్నాన్ని మెత్తగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంతో కరకరలాడే పకోడీలు తయారు చేసుకుని తినవచ్చు.



# ఐస్‌క్రీమ్ ఇక మన ఫ్రిజ్‌లోనే!

వంటిల్లు

**క్యాలెండర్ కాగితాలు వెనక్కి పోతున్నాయి. శీతాకాలం సెలవు తీసుకుంటోంది. వేసవికి స్వాగతం పలుకుతోంది కాలం. ఐస్‌క్రీమ్ యాడ్‌ల కాలం మొదలైంది. పిల్లలకు గుర్తు రాకపోయినా సరే... గుర్తు చేయడానికి ఓ ఇడియట్ బాక్స్ ఉంది. ఇడియట్ బాక్సే కాదు మనింట్లో ఫ్రిజ్ కూడా ఉంది. పిల్లలను పార్లర్‌కు పరుగు పెట్టనివ్వకండి. ఇంట్లోనే హెల్దీగా ఇలా ట్రై చేయండి.**



### వెనీలా ఐస్ క్రీమ్

**కావలసినవి:** కండెన్స్‌డ్ మిల్క్ – 400 గ్రా; చిక్కటి మీగడ – 200 గ్రా; వెనీలా ఎక్స్‌ట్రాక్ట్ – 2 టీ స్పూన్‌లు.

**తయారీ:**
● ఐస్‌క్రీమ్ తయారు చేయడానికి ముందు రోజు రాత్రి మీగడను ఫ్రీజర్‌లో పెట్టాలి. అలాగే ఒక ఖాళీ పాత్రను కూడా ఫ్రిజ్‌లో పెట్టి చల్లబర చాలి. కనీసం పది లేదా పన్నెండు గంటలసేపు ఉంచాలి. ● ఫ్రిజ్‌లో నుంచి తీసిన తరవాత మీగడను ఫ్రిజ్‌లో చల్లబరిచిన పాత్రలో వేసి ఏడు లేదా ఎనిమిది నిమిషాల సేపు చిలకాలి. చిలికేటప్పుడు మొదట మెల్లగా చిలుకుతూ క్రమంగా వేగం పెంచాలి. ఆ తరవాత అందులో కండెన్స్‌డ్ మిల్క్ వేసి మెల్లగా చిలకాలి. ● ఈ మిశ్రమాన్ని ఒక ట్రేలో పోసి సమంగా సర్ది అల్యూమినియం ఫాయిల్ పేపర్ అమర్చి అంచులకు క్లిప్ పెట్టాలి. పేపర్ ఐస్ క్రీమ్ మిశ్రమంలోకి జారిపోకుండా ఈ ఏర్పాటు. ఈ ట్రేని పన్నెండు గంటల సేపు ఫ్రీజర్‌లో ఉంచాలి. ఫ్రీజర్‌లో నుంచి బయటకు తీసిన తర్వాత ఐదారు నిమిషాల సేపు కదిలించకూడదు. ఆ తర్వాత ట్రే మీద కవర్ చేసిన అల్యూమినియం ఫాయిల్‌ని తొలగించి ఐస్‌క్రీమ్‌ని పెద్ద స్పూన్‌తో తీసి కప్పుల్లో వేసి సర్వ్ చేయాలి. ఈ ఐస్ క్రీమ్ కోసం స్టవ్ వెలిగించే పనే లేదు. కావలసిన వస్తువులన్నీ రెడీమేడ్‌గా దొరికేవే కాబట్టి పిల్లలు కూడా పెద్దవాళ్ల సహాయం లేకుండా సొంతంగా చేసుకోవచ్చు.

### చాకొలేట్ చిప్ ఐస్ క్రీమ్

**కావలసినవి:** మీగడ – 2 కప్పులు; పాలు – 3 టేబుల్ స్పూన్‌లు; కోకో పౌడర్ – 3 టేబుల్ స్పూన్‌లు; కండెన్స్‌డ్ మిల్క్ – అర కప్పు; చాకొలెట్ చిప్స్ – కప్పు; బ్రౌన్ షుగర్ – కప్పులో మూడవ వంతు (బ్లీచ్ చేయని చక్కెర, అది లేకపోతే మామూలు చక్కెర తీసుకోవచ్చు)

**తయారీ:** ● మీగడను పన్నెండు గంటల సేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. ● వెడల్పుగా ఉన్న పాత్రలో పాలు పోసి చిన్న మంట మీద వేడి చేయాలి. పాలు మరగాల్సిన అవసరం లేదు, వేడయితే చాలు (పాశ్చరైజేషన్ జరగని పాలయితే మరిగించి వేడి తగ్గే వరకు పక్కన ఉంచి గోరువెచ్చగా ఉన్నప్పుడు వాడాలి). అందులో కోకో పౌడర్ వేసి బీటర్‌తో కలపాలి. ఆ తర్వాత కండెన్స్‌డ్ మిల్క్ వేసి మొత్తం కలిసే వరకు బీటర్‌తో చిలకాలి. ఇప్పుడు చక్కెర వేసి చిన్న మంట మీద వేడి చేస్తూ కరిగే వరకు చిలకాలి. చక్కెర కరిగిన తర్వాత దించేసి చల్లారే వరకు మిశ్రమాన్ని పక్కన ఉంచాలి. ● ఫ్రిజ్‌లో ఉన్న మీగడను బయటకు తీసి సమంగా కలిసే వరకు చిలకాలి. ఆ తర్వాత ముందుగా తయారు చేసుకుని పక్కన ఉంచిన కోకో మిశ్రమాన్ని మీగడలో వేసి చిలికినట్లు కాకుండా నిదానంగా కలపాలి. ఇప్పుడు చాకొలెట్ చిప్స్ వేసి ఒకసారి కలిపి (చాకొలెట్ చిప్స్ అన్నీ ఐస్ క్రీమ్‌లో ఒకచోట చేరకుండా అక్కడొకటి అక్కడొకటి వచ్చేటట్లు కలిపితే చాలు) మిశ్రమం మొత్తాన్ని ఒక ట్రేలో పోసి అల్యూమినియం ఫాయిల్‌తో కవర్ చేసి ఫ్రీజర్‌లో పెట్టాలి. పది గంటల తర్వాత ట్రేని బయటకు తీసి ఐదారు నిమిషాల తర్వాత అల్యూమినియం ఫాయిల్ తొలగించి ఐస్‌క్రీమ్‌ని కప్పుల్లో వేసి సర్వ్ చేయాలి.

### ఆరెంజ్ ఐస్ క్రీమ్

**కావలసినవి:** చల్లటి పాలు – అర లీటరు (ఫుల్ క్రీమ్ టిన్‌డ్ మిల్క్); చక్కెర – 100 గ్రాములు; కార్న్‌ఫ్లోర్ – టేబుల్ స్పూన్; ట్యాంగ్ పౌడర్ – 3 టేబుల్ స్పూన్‌లు (ఆరెంజ్ ఫ్లేవర్); మీగడ – వంద గ్రాములు; ఆరెంజ్ ఎసెన్స్ – నాలుగు చుక్కలు.

**తయారీ:** ● అర కప్పు పాలలో కార్న్‌ఫ్లోర్ వేసి ఉండలు లేకుండా బీటర్ లేదా ఫోర్క్‌తో బాగా కలపాలి. ● మరొక పాత్రలో మిగిలిన పాలను పోసి చక్కెర వేసి అడుగు పట్టకుండా గరిటతో కలుపుతూ ఐదు నిమిషాల సేపు మరిగించాలి. ఇప్పుడు కార్న్‌ఫ్లోర్ కలిపిన పాలను వేసి కలుపుతూ మీడియం మంట మీద మరో ఐదు నిమిషాల సేపు మరిగించి దించేయాలి. ● పాలు చల్లారిన తర్వాత అందులో ట్యాంగ్ పౌడర్, క్రీమ్ వేసి బీటర్‌తో బాగా చిలకాలి. మృదువుగా తయారైన మిశ్రమాన్ని ఒక పాత్రలో పోసి అల్యూమినియం ఫాయిల్‌తో కవర్ చేసి ఫ్రీజర్‌లో పెట్టాలి. ● ఆరు గంటల తర్వాత తీసి మిక్సీ జార్‌లో వేసి బ్లెండ్ చేసి తిరిగి అదే పాత్రలో పోసి మళ్లీ అల్యూమినియం ఫాయిల్‌తో కవర్ చేసి ఫ్రీజర్‌లో పెట్టాలి. పది గంటల సేపు ఉంచితే ఐస్‌క్రీమ్ గట్టిగా సెట్ అయి ఉంటుంది. ఇప్పుడు కప్పులో వేసి సర్వ్ చేయాలి.

## కొత్త ఆలోచన

# టెడ్డీబేర్ క్లినిక్స్

**డాక్టర్: నీ టెడ్డీబేర్‌కు ఏమైంది?**
**చిన్నారి: కాలు నొప్పి**
**డాక్టర్: ఎక్కడ?**
**చిన్నారి: ఇక్కడ**
**డాక్టర్: ఏం కాదు... తగ్గిపోతుంది...**

**ఇలాంటి క్లినిక్‌లు ఇప్పుడు మంగళూరులోని స్కూళ్లలో నిర్వహిస్తున్నారు డాక్టర్లు. యు.కె.జి. నుంచి 2వ తరగతిలోపు పిల్లల్లో హాస్పిటల్ భయం పోవడానికి వారి ఆరోగ్య సమస్యలు బయటకు చెప్పడానికి ఈ క్లినిక్‌లు ఉపయోగపడుతున్నాయి. పేషెంట్లుగా సొంత టెడ్డీబేర్‌లను తెమ్మనడంతో పిల్లలు వాటిని తీసుకుని ధైర్యంగా వస్తున్నారు. దేశంలోని అన్ని పల్లెల్లో 'బొమ్మల ఆస్పత్రి' పేరుతో ఇలాంటి క్లినిక్‌లు నిర్వహించాల్సిన అవసరం ఉంది.**




మూడేళ్ల లోపు చంటిపిల్లలను హాస్పిటల్‌లో చూపించడం తల్లులకు కష్టం కాదు. కాని ఐదారేళ్లు వచ్చాక పిల్లలకు హాస్పిటల్ అంటే భయం వస్తుంది. డాక్టర్‌ని చూడటం, వ్యాక్సిన్ కోసం సూది వేయించుకోవడం, జ్వరాలకు సిరప్‌లు తాగాల్సి రావడం వారికి హాస్పిటల్ అంటే భయం వేసేలా చేస్తుంది. 5 ఏళ్ల నుంచి 8 ఏళ్ల లోపు పిల్లలు ఈ భయంతో ఏదైనా ఇబ్బంది ఉన్నా తల్లిదండ్రులకు చెప్పకపోవచ్చు– హాస్పిటల్‌కు వెళ్లాల్సి వస్తుందని. అంతేకాదు హాస్పిటల్‌కు తీసుకెళితే డాక్టర్‌కి చూపించి బయటకు వచ్చేంత వరకూ ఏడుస్తూనే మారాం చేస్తూనే ఉంటారు కొందరు పిల్లలు. దీని వల్ల తల్లిదండ్రులకే కాదు... క్లినిక్‌కు వచ్చిన ఇతర పిల్లలు, పెద్దలు కూడా ఇబ్బంది పడతారు. అందుకే వీరికి క్లినిక్‌లంటే భయం పోగొట్టాలి. దానికి ఏం చేయాలి?





### టెడ్డీ బేర్ క్లినిక్స్

యూకేలో ఇటీవల కాలంలో 'టెడ్డీ బేర్ క్లినిక్స్' నిర్వహిస్తున్నారు. 5 నుంచి 8 ఏళ్ల లోపు పిల్లలు తమ సొంత టెడ్డీ బేర్‌లను పేషెంట్లకు మల్లే తెచ్చి డాక్టర్‌లకు చూపించడం కాన్సెప్ట్. ఇందు కోసం నిజమైన డాక్టర్లు నిర్దేశిత స్కూల్‌కు టీమ్‌గా వస్తారు.. లేదా ఏదైనా చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో దీనిని నిర్వహిస్తారు. క్లినిక్స్ అంటే భయం పోగొట్టడమే ముఖ్యోద్దేశం. క్లినిక్స్‌లో ఎంత చక్కగా టెడ్డీ బేర్‌లకు వైద్యం జరుగుతుందో చూశాక తమకు కూడా అంతే ఈజీగా వైద్యం చేస్తారు అనే భావన పిల్లల్లో కలుగుతుంది.

### మంగుళూరులో ట్రెండ్

గత సంవత్సరం జూలై నుంచి మంగుళూరులోని చాలా స్కూళ్లల్లో విడతల వారీగా టెడ్డీబేర్ క్లినిక్స్ నడుస్తున్నాయి. ఇందుకు స్కూళ్ల యాజమాన్యాలు సహకరిస్తున్నాయి. ప్రయివేట్ ఆస్పత్రులు తమ ప్రచారం కోసమే కావచ్చు... లేదా పిల్లల పట్ల బాధ్యతతోనే కావచ్చు... చాలా ప్రొఫెషనల్‌గా ఈ క్లినిక్స్‌ను నిర్వహిస్తున్నారు. క్లినిక్ స్కూల్‌లో నడిపే రోజున పిల్లలు తమ సొంత టెడ్డీ బేర్‌ను కాని లేదా మరేదైనా ఆటబొమ్మను (మనిషి, పెట్) తీసుకురావాలి. తమ పేషెంట్ పేరును అచ్చు హాస్పిటల్‌లో ఎలా రిజిస్టర్ చేయిస్తారో అలా చేయించాలి. ఆ తర్వాత ఓ.పీ.కి వెళ్లాలి. ఓ.పీ.లో డాక్టర్లు టెడ్డీబేర్‌కు ఏం ఇబ్బంది ఉందో అడుగుతారు. వైద్యం చేయాలంటే పొడవు, ఎత్తు చూడాలని చెప్పి చూస్తారు, పిల్లలు సాధారణంగా తమకున్న ఇబ్బందులే టెడ్డీ బేర్‌కు ఉన్నట్టుగా చెబుతారు. టెడ్డీబేర్‌ను చూస్తున్నట్టుగా పిల్లల్ని కూడా వారి మూడ్‌ను బట్టి డాక్టర్లు చూస్తారు. పిల్లల హెల్త్ అసెస్‌మెంట్‌ను స్కూల్ సాయంతో పేరెంట్స్‌కు పంపుతారు.

### కంటి, పంటి పరీక్ష

చిన్న పిల్లల్లో కంటి, పంటి పరీక్షలు ముఖ్యమైనవి. టెడ్డీబేర్ క్లినిక్స్ పేరుతో పిల్లలను ఉత్సాహపరిచి వారికి కంటి, పంటి పరీక్షలు కూడా డాక్టర్లు నిర్వహిస్తున్నారు. సాధారణ చెకప్‌ల ద్వారా వారిలో తగిన పోషక విలువలు ఉన్నాయా, వారు బలహీనంగా ఉన్నారా అనేవి కూడా చూస్తారు. ఏమైనా డాక్టర్ల పరిశీలన ఆ వయసు పిల్లలకు ప్రతి మూడు నెలలకు అవసరం. మంగుళూరు స్కూళ్లలో ఇదే జరుగుతూ ఉంది.

మిగతా రాష్ట్రాల్లో కూడా పల్లెల్లో చిన్నారులకు ఈ 'బొమ్మల ఆస్పత్రు'లు నడపడం చాలా బాగుంటుంది. పల్లె పిల్లలు డాక్టర్లకు చూపించుకునే వీలుండదు చాలాసార్లు. తల్లిదండ్రులు తీసుకెళ్లరు. ఆస్పత్రులంటే భయపడేవారు కూడా ఎక్కువ మందే ఉంటారు. అందుకోసమే బొమ్మల ఆస్పత్రుల ఐడియాను ప్రభుత్వాలు అందిపుచ్చుకుంటే చిన్నపిల్లల ఆరోగ్యస్థాయి, వారి సాధారణ అనారోగ్య సమస్యలు అంచనాకొస్తాయి.


'బీడుబడిన తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 326

శుక్రవారం 16-2-2024




**శతకాలతో శుభారంభం**

రోహిత్, జడేజా సెంచరీలు.. రాణించిన సర్ఫరాజ్.. భారత్ 326/5 -11లో



**నేషనల్ కాన్ఫరెన్స్ యూ టర్న్**

సొంతంగా పోటీ చేస్తామన్న ఫరూక్.. అలాంటిదేమీ లేదన్న ఒమర్ -6లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



## న్యూస్‌రీల్

### మహిళలకు ప్రతి కేటగిరీలో 33.3 శాతం రిజర్వేషన్లు



ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో మహిళలకు హారిజాంటల్ (సమాంతర) పద్ధతిలో 33 1/3 శాతం (33.333%) రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందుకనుగుణంగా రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

- వివరాలు 12లో

### ట్రంప్ కంటే బైడెన్ నయం



తెంపరితనం, దూకుడుకు మారుపేరైన డొనాల్డ్ ట్రంప్‌తో పోలిస్తే జో బైడెన్‌ను మరోసారి అమెరికా అధ్యక్షుడిగా చూడాలనుకుంటున్నానని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆశాభావం వ్యక్తంచేశారు. రష్యా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే ట్రంప్ కంటే బైడెన్ గెలిస్తేనే మంచిదని అనుకుంటున్నానన్నారు.

- వివరాలు 6లో

### అమెరికాలో మరో భారతీయుడి హత్య



అమెరికాలో భారతీయుల వరుస మరణాలు అక్కడి భారతీయుల్లో గుబులు రేపుతున్నాయి. తాజాగా, అలబామా రాష్ట్రంలో రహదారి వెంట హోటల్‌ను నడుపుకుంటున్న 76 ఏళ్ల ప్రవీణ్ రావూజీభాయ్ పటేల్‌ను అద్దె గది కోసం వచ్చి న ఒక కస్టమర్ కాల్చి చంపారు. వాగ్వాదానికి, కాల్పుల ఘటనకు అసలు కారణాలను పోలీసులు వెల్లడించలేదు.

- వివరాలు 6లో

### భారత్, ఖతార్ బంధం సుదృఢం

- ఖతార్ ఎమీర్ షేక్ తమీమ్ అల్ థానీతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు

6 లో



## ఇవాళ్టి కార్టూన్



ఎన్నికల బాండ్లపై గురువారం తీర్పును వెలువరిస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్. చిత్రంలో రాజ్యాంగ ధర్మాసనంలోని ఇతర న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా



# ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధం

- సమాచార హక్కును హరిస్తోంది
- భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం
- రాజ్యాంగ ధర్మాసనం స్పష్టీకరణ
- దాన్ని రద్దు చేస్తూ ఏకగ్రీవ నిర్ణయం
- బాండ్ల లావాదేవీల వెల్లడికి ఆదేశం
- ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పెట్టాలని స్పష్టీకరణ

**బాండ్ల పథకం లోపభూయిష్టం.. సుప్రీం సంచలన తీర్పు**

**మోదీ సర్కారుకు భారీ ఎదురుదెబ్బ!**

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ లోక్‌సభ ఎన్నికల వేళ సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, సమాచార హక్కుకు విఘాతం కలిగిస్తోందంటూ కుండబద్దలు కొట్టింది. 2018లో నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీఏ సర్కారు ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. పారదర్శకత, నల్లధనం కట్టడి కోసమే పథకం తెచ్చామన్న కేంద్ర ప్రభుత్వ వాదనను తోసిపుచ్చింది. ఈ పథకం కింద ఇప్పటిదాకా కొనుగోలు చేసిన బాండ్ల మొత్తం, కొనుగోలుదారులు, స్వీకర్తల పేర్లు తదితరాల వివరాలన్నింటినీ వెల్లడించాల్సిందేనని ఆదేశించింది. సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం ఏకగ్రీవంగా తీర్పు వెలువరించింది. ''ఓటేసేందుకు పౌరులకు ఉన్న స్వేచ్ఛపై ఎలాంటి అవాంఛిత ఒత్తిళ్లూ ఉండరాదు. ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది చాలా ముఖ్యమైన విషయం. అంతేగాక ఎన్నికల ప్రక్రియలో విశ్వసనీయత ప్రభుత్వాల ప్రజాస్వామిక స్ఫూర్తికి అత్యంత కీలకం. అందుకే రాజ్యాంగం కూడా స్వేచ్ఛాయుత ఎన్నికల ప్రక్రియకు ఎంతో ప్రాధాన్యమిచ్చింది. కార్పొరేట్ల నుంచి పార్టీలకందే ఆర్థిక విరాళాలకు రెండు కారణాలుంటాయి. తద్వారా తమ మద్దతును వ్యక్తీకరించడం. లేదా సదరు విరాళాలు క్విడ్ ప్రొ కో తరహావి

మిగతా 5వ పేజీలో ▶



**ఏమిటీ ఎలక్టోరల్ బాండ్లు!** 6 లో

# నీటిపారుదలపై శ్వేతపత్రం!

## నేడు శాసనసభలో ప్రభుత్వం విడుదల చేసే అవకాశం

- కులగణన తీర్మానం ప్రవేశపెట్టనున్న మంత్రి పొన్నం ప్రభాకర్
- ద్రవ్య వినిమయ బిల్లుకు శాసనసభ ఆమోదం
- 2024-25కు రూ.2,75,891 కోట్ల బడ్జెట్‌కు, 4 నెలల కాలానికి రూ.78,911.23 కోట్ల బిల్లుకు ఓకే

- బడ్జెట్‌పై చర్చకు ఆర్థికమంత్రి భట్టి సమాధానం
- రాష్ట్రంలో అవసరమైతే 5 లక్షల ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధం
- ఆరు గ్యారంటీల దరఖాస్తులకు అనుగుణంగా నిధుల కేటాయింపు
- బడ్జెట్‌కు ఆమోదం తర్వాత మండలి నిరవధిక వాయిదా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం శాసనసభలో నీటిపారుదల రంగంపై శ్వేతపత్రం విడుదల చేసే అవకాశమున్నట్టు సమాచారం. నీటిపారుదలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని ప్రభుత్వం కొద్దికాలంగా చెబుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఈ మేరకు ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారమే దీనిని విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. గత పదేళ్లలో సాగు నీళ్లివ్వడానికి కాకుండా కేవలం కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడం కోసమే ప్రాజెక్టులు చేపట్టారని ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ అంశాలతో పాటు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, కేఆర్ఎంబీకి కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతను శ్వేతపత్రంలో పొందుపరుస్తున్నట్టు తెలిసింది. దీనిపై స్వల్పకాలిక చర్చను పెట్టాలని కూడా ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. మరోవైపు కులగణన తీర్మానాన్ని కూడా ప్రభుత్వం శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టనుంది. వాస్తవానికి ఈ తీర్మానాన్ని గురువారమే సభలో ప్రవేశపెట్టాలని సర్కారు భావించింది. అయితే బడ్జెట్, ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సుదీర్ఘంగా



మిగతా 2వ పేజీలో ▶

**2032-33 నాటికి కట్టాల్సింది.. రూ.2.5 లక్షల కోట్లు**

2022 మార్చి 31 నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్ నివేదికలో వెల్లడి 2 లో

**రీ-ఇంజనీరింగ్‌తో 122% పెరిగిన వ్యయం!**

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ నివేదికలో వెల్లడి

వివరాలు 2లో



# ఉధృతమైన రైతన్నల ఉద్యమం

- మూడో రోజుకు చేరిన ఢిల్లీ చలో రైతు ఉద్యమం
- నేడు గ్రామీణ భారత్‌బంద్ పాటించనున్న రైతులు, కార్మికులు

పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలంటూ ఉద్యమబాట పట్టిన కర్షకలోకం దేశ రాజధాని దిశగ వడివడిగా అడుగులేస్తోంది. శంభు, టిక్రి సరిహద్దుల వద్ద పోలీసులు ఏర్పాటుచేసిన బారికేడ్లు, ఇనుపకంచెలు, సిమెంట్ దిమ్మెలను దాటేందుకు రైతులు విఫలయత్నం చేస్తున్నారు. నేటి గ్రామీణ భారత్‌బంద్ పిలుపు నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా నోయిడాలో కర్ఫ్యూ విధించారు.

వివరాలు 6లో

## శాసనసభలో సెల్‌ఫోన్లు వాడొద్దు

- సభ జరుగుతున్నప్పుడు మీడియా పాయింట్ వద్ద మాట్లాడొద్దు
- అసెంబ్లీ స్పీకర్ కీలక నిర్ణయం

2 లో

# ఉరితాళ్లు కట్టుకుని వేలాడినా.. ప్రజలు సానుభూతి చూపరు

పేదల కోసం పని చేస్తుంటే.. మామా అల్లుళ్లు తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నారు: సీఎం రేవంత్‌రెడ్డి

- గత ప్రభుత్వ దోపిడీని చూపేందుకే మేడిగడ్డ వెళ్లాం
- హరీశ్‌రావు సీఎం కావాలంటే.. మరో ఔరంగజేబు అవతారం ఎత్తాల్సిందే
- 70 రోజుల్లోనే దాదాపు 25వేల ఉద్యోగ నియామకాలు చేపట్టాం
- గురుకుల ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేసిన ముఖ్యమంత్రి



అభ్యర్థికి నియామక పత్రం అందజేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల పాటు ప్రజలను గోసపెట్టిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ఉరితాళ్లు కట్టుకుని వేలాడినా.. ప్రజలు సానుభూతి చూపరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న అసెంబ్లీకి రావడానికి కేసీఆర్‌కు చేత కాలేదు కానీ, కట్టె పట్టుకొని సానుభూతి కోసం నల్లగొండకు వెళ్లారని విమర్శించారు. గురువారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గురుకుల ఉపాధ్యాయ నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా 3వ పేజీలో ▶

# 2032-33 నాటికి కట్టాల్సింది.. రూ.2.5 లక్షల కోట్లు

## రుణాల అసలు, వడ్డీల చెల్లింపులతో ఖజానాపై తీవ్ర ఆర్థిక భారం

## 2022 మార్చి 31 నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్ నివేదికలో వెల్లడి

- ఎఫ్ఆర్‌బీఎం మాత్రమే కాదు.. ఆర్థిక సంఘం నిబంధనలూ ఉల్లంఘించారు
- జీఎస్‌డీపీతో పోలిస్తే అప్పుల నిష్పత్తి 37.77 శాతానికి పెరిగింది
- రెవెన్యూ రాబడి పెరిగినా మిగులు సాధించలేకపోయారన్న కాగ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంపై అప్పుల భారం తీవ్రంగా ఉందని, రానున్న పదేళ్లలో రుణాల తిరిగి చెల్లింపు ఇబ్బందిగా మారే అవకాశం ఉందని 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)'నివేదికలో పేర్కొంది. మార్కెట్ రుణాల మీద వడ్డీ, అసలు కలిపి.. 2032-33 నాటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2,52,048 కోట్లను చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. 2022 మార్చి 31తో ముగిసిన (2021-22) ఆర్థిక సంవత్సరం నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, నిర్వహణ తీరుపై కాగ్ రూపొందించిన ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీ ముందుపెట్టింది. బడ్జెట్‌లో పేర్కొనకుండా తీసుకున్న రుణాల్లో (ఆఫ్ బడ్జెట్) కాళేశ్వరానికే ఎక్కువగా ఉన్నాయని కాగ్ పేర్కొంది. 'కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్)'కింద రూ.66,854 కోట్లు తీసుకున్నారని.. ఈ రుణాల అసలు, వడ్డీ కలిపి 14 ఏళ్లలో రూ.1,45,545 కోట్లు చెల్లించాలని పేర్కొంది. దీనితో సమీప భవిష్యత్తులో అభివృద్ధి ప్రణాళికల విషయంలో రాష్ట్ర సామర్థ్యం పరిమితం అవుతుందని వ్యాఖ్యానించింది.

**కాగ్ నివేదికలోని అంశాలివీ..**

- రెవెన్యూ రాబడులు 26 శాతం పెరిగినా మిగులును సాధించడంలో రాష్ట్రం వరుసగా మూడో ఏడాది కూడా విఫలమైంది. బడ్జెట్ నుంచి చెల్లిస్తున్న ఆఫ్ బడ్జెట్ రుణాలు, ఇతర చెల్లింపులను కలిపితే.. జీఎస్‌డీపీలో అప్పుల నిష్పత్తి 37.77 శాతంగా ఉంది. ఇది ఎఫ్ఆర్‌బీఎం చట్టం నిర్దేశించిన దానికంటే 12.77 శాతం, 15వ ఆర్థిక సంఘం నిర్దేశించిన దానికంటే 8.47 శాతం ఎక్కువ.
- 2021-22లో రెవెన్యూ వ్యయం 11 శాతం పెరిగింది. ఇందులో జీతాలు, వడ్డీ చెల్లింపులే ఎక్కువ భాగం ఉన్నాయి. విద్య, ఆరోగ్యం మీద ఖర్చు విషయంలో రాష్ట్రం వెనుకంజలో ఉంది. మొత్తం వ్యయంలో 8శాతం విద్య, 4శాతం ఆరోగ్యంపై ఖర్చు చేశారు.
- అంతకుముందు ఏడాదితో పోలిస్తే మూలధన వ్యయం 81శాతం పెరిగింది. 2021-22లో రూ.28,874 కోట్లు మూలధన వ్యయం కింద ఖర్చుపెట్టారు. అయితే 2022 నాటికి పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల మీద రూ.1,09,612 కోట్లు మూలధనం ఖర్చయింది.
- బడ్జెట్ వ్యయం కింద రూ.2,30,872 కోట్లకు ప్రభుత్వం అసెంబ్లీ అనుమతి తీసుకుంది. తర్వాత అనుబంధంగా రూ.24,144 కోట్ల మేర అంచనాలకు ఆమోదం తెలిపింది. అయితే రెవెన్యూ ఖర్చు రూ.2,63,092 కోట్లుకాగా.. నికర అధిక వ్యయం రూ.8,076 కోట్లు. వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులను పరిగణనలోకి తీసుకోకపోతే అయిన ఖర్చు రూ.1,95,818 కోట్లే. అంటే బడ్జెట్ అంచనాల్లో వాస్తవఖర్చు 77శాతమే.
- 2014-15 నుంచి 2020-21 వరకు కలిపి బడ్జెట్లకు అదనంగా చేసిన రూ.2,14,062 కోట్ల ఖర్చుకు అసెంబ్లీ ఆమోదం పొందాల్సి ఉంది. ఇది ప్రజావనరుల నిర్వహణలో క్రమశిక్షణ రాహిత్యమే.
- దళితబంధు కోసం రూ.1,000 కోట్లు కేటాయించారు. కానీ వినియోగ పద్దులో రూ.4,442 కోట్లు ఖర్చు చూపెట్టారు. వాస్తవంగా ఖర్చయినది రూ.2,101 కోట్లు మాత్రమే.

## అనర్హులకు 'ఆసరా'తో రూ.1,175 కోట్లు నష్టం

అర్హతలేని 2.02 లక్షల మందికి లబ్ధి కలిగిందన్న కాగ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ కేటగిరీల కింద అనర్హులకు ఆసరా పింఛన్లు అందుతున్నాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక పేర్కొంది. పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ కొందరు లబ్ధిదారులను అనర్హులుగా గుర్తించినా కూడా వారిని జాబితా నుంచి తొలగించారని తెలిపింది. దీనితో 2021 మార్చి 31తో ముగిసిన (2020-21) ఆర్థిక సంవత్సరంలో 2.02 లక్షల మంది అనర్హులకు రూ.1,175 కోట్ల మేర అక్రమ చెల్లింపులు జరిగినట్టు తేల్చింది. కుటుంబ ఆదాయానికి సంబంధించిన సిస్టమ్‌లో అంతర్గతంగా కచ్చితమైన నియంత్రణలు లేవని.. దీనితో నిర్దేశిత పరిమితి కంటే ఎక్కువ ఆదాయమున్నవారికీ లబ్ధి కలిగిందని తెలిపింది. సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్) డేటాలోని వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని 16శాతం కుటుంబాలకు ఆసరా పింఛన్లకు అర్హత లేదని స్పష్టమవుతోందని, అయినా పింఛన్ దరఖాస్తుల పరిశీలన, మంజూరు, గుర్తింపు ప్రక్రియలను సమర్థవంతంగా చేయలేదని తప్పుపట్టింది. 2018 ఏప్రిల్ నుంచి 2021 మార్చి మధ్య సగటున నెలకు 2.30 లక్షల (6 శాతం) మంది లబ్ధిదారులకు పింఛన్ల చెల్లింపు జరగలేదని పేర్కొంది.

## ఇసుక విధానంలో లోపాలతో ఖజానాకు గండి

ఇసుక వెలికితీతలో టీఎస్‌ఎండీసీ తీరును తప్పుపట్టిన కాగ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇసుక విధానంలోని లోపాలతో, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎండీసీ) తీరుతో ఖజానాకు నష్టం వాటిల్లిందని 'కాగ్' పేర్కొంది. టీఎస్‌ఎండీసీతో ఒప్పందం కుదుర్చుకున్న గిరిజన సంఘాలు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలను సబ్ లీజ్‌కు అప్పగించడంతో.. థర్డ్ పార్టీకి రూ.11.61 కోట్లు అనుచిత లబ్ధి జరిగిందని పేర్కొంది. దుమ్ముగూడెం వద్ద ఇసుక కాంట్రాక్టర్లకు చెల్లించే ధర నిర్ణయంలో ఆలస్యంతో రూ.172.64 కోట్ల మేర ప్రభుత్వం ఆదాయం కోల్పోయిందని పేర్కొంది. అధిక లోడింగ్, వాహనాల కదలికలను గుర్తించే సీసీ కెమెరాలు, జీపీఎస్ పరికరాలను అరకొరగా ఏర్పాటు చేయడం సరికాదని తెలిపింది. ఇసుక రేవులు, నిల్వ కేంద్రాల కార్యకలాపాలపై టీఎస్‌ఎండీసీ పర్యవేక్షణ లోపభూయిష్టమని పేర్కొంది. అనుమతులు లేకుండా చేపట్టిన తవ్వకాలతో 2022 మార్చి నాటికి రూ.108.96 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండిపడిందని కాగ్ తెలిపింది. 2016-21 మధ్య రూ.171.32 కోట్లు రహదారి చార్జీలు వసూలైతే.. అందులో ప్రభుత్వం రూ.162.27 కోట్లను ఇతర ప్రయోజనాలకు మళ్లించిందని పేర్కొంది.

# రీ-ఇంజనీరింగ్‌తో 122% పెరిగిన వ్యయం!

- కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ నివేదికలో వెల్లడి
- టెండర్ల తర్వాత ధరల సర్దుబాటుతో అంచనాలు పెరిగాయి
- ప్రాజెక్టు నిర్వహణకు ఏటా రూ.10,647 కోట్లు ఖర్చు అని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఏపీలో రూ.38,500 కోట్ల అంచనాతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టగా.. తెలంగాణ వచ్చాక రీ-ఇంజనీరింగ్ ద్వారా కాళేశ్వరం, ప్రాణహిత అనే రెండు ప్రాజెక్టులుగా విభజించడంతో అంచనా వ్యయం రూ.85,651.81 కోట్లకు చేరిందని కాగ్ నివేదికలో పేర్కొంది. అంటే ప్రాజెక్టు వ్యయం 122శాతం పెరిగిందని.. కానీ లక్షిత ఆయకట్టు 52.22శాతమే పెరిగిందని వివరించింది. ఆ తర్వాత కూడా ప్రాజెక్టు పనుల్లో మార్పులు, చేర్పులు చేయడంతో అంచనా వ్యయం రూ.1,47,427.41 కోట్లకు చేరినా.. ప్రయోజనాలేమీ పెరగలేదని పేర్కొంది. కాళేశ్వరంపై 2021-22 ఆర్థిక ఏడాది చివరినాటికి కాగ్ నిర్వహించిన ఆడిట్ నివేదికను ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. నివేదికలోని ముఖ్యాంశాలివీ..

**పంపింగ్ పెంచడంతో అదనపు వ్యయం**

కాళేశ్వరం డీపీఆర్‌ను 2018 జూన్‌లో కేంద్ర జలసంఘం ఆమోదించడానికి ముందే రూ.25,049.99 కోట్ల విలువైన 17 పనులను నీటిపారుదల శాఖ కాంట్రాక్టర్లకు అప్పగించింది. తొలుత గోదావరి నుంచి రోజుకు 2టీఎంసీలను ఎత్తిపోయాలని ప్రతిపాదించారు. తర్వాత అవసరం లేకున్నా పంపింగ్ సామర్థ్యాన్ని 3 టీఎంసీలకు పెంచడంతో రూ.28,151 కోట్ల అదనపు వ్యయం అవుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టుతో కలిగే ప్రయోజనాలను ఎక్కువ చేసి చూపారు. ఇతర ప్రాజెక్టుల కింద ఒక టీఎంసీ నీళ్లు 10వేల ఎకరాలకే సరిపోతాయని చూపగా.. కాళేశ్వరం కింద 17,668 ఎకరాలకు అందించవచ్చని లెక్కించారు. తాజా అంచనా రూ.1.47 లక్షల కోట్లలెక్కన చూస్తే.. ప్రాజెక్టు ప్రయోజన-వ్యయ నిష్పత్తి 0.52గా తేలుతోంది. అంటే వెచ్చించే ప్రతి రూపాయికి 52 పైసలే ప్రయోజనం అందుతుంది. ప్రాజెక్టుకు ఏటా విద్యుత్ చార్జీలు, నిర్వహణ కలిపి రూ.10,647.26 కోట్ల ఖర్చు అవుతుంది. ఒక్కో ఎకరాకు సాగునీరు అందించడానికి ఏటా రూ.46,364 లెక్కన వ్యయం అవుతుంది.

**చెల్లింపుల వాయిదాతో మరింత భారం**

కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలను తిరిగి చెల్లించడానికి వచ్చే 14ఏళ్లలో మొత్తం రూ.1,41,544.59 కోట్లు అవసరం కానున్నాయి. కొన్ని రుణాల తిరిగి చెల్లింపు ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం వాయిదా కోరింది. దీనితో రూ.8,182.44 కోట్ల మేర అదనపు వడ్డీ భారం పడింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని 21 ఒప్పందాల పరిధిలో పంపులు, మోటార్లు, అనుబంధ పరికరాల కొనుగోళ్ల కోసం వాస్తవ ధరల కంటే అధికంగా వ్యయాన్ని అంచనా వేశారు. వీటిలోని నాలుగు పనుల్లో కాంట్రాక్టర్లకు రూ.2,684.73 కోట్ల మేర అనుచిత లబ్ధి కలిగే అవకాశాన్ని తోసిపుచ్చలేం. ఐదు ఒప్పందాల్లో టెండర్లు పూర్తయ్యాక ధరల సర్దుబాటుతో అధిక చెల్లింపులు జరిగాయి.

**నీరిచ్చింది 40,888 ఎకరాలకే..**

ప్రాజెక్టు కింద 18.26లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును ప్రతిపాదించారు. ఇందులో 14.83లక్షల ఎకరాల మేర మాత్రమే కాల్వల వ్యవస్థను అభివృద్ధి పనులను చేపట్టారు. 2022 మార్చి చివరినాటికి వాస్తవంగా నీళ్లిచ్చింది 40,888 ఎకరాలకే. ఇక మల్లన్నసాగర్ జలాశయం ప్రాంతంలోని భూగర్భంలో నిటారుగా పగుళ్లు ఉన్నాయని, భూకంపాలకు అవకాశం ఉందని నేషనల్ జియోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనంలో తేలింది.


# రెండు నెలలకే రాద్ధాంతమా?

ప్రతిపక్షాలపై మంత్రి పొంగులేటి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండునెలలు మాత్రమే అయ్యిందని, ఇంత తక్కువ సమయంలో అద్భుతాలు చేయాలంటూ ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేయడం సరికాదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌పై గురువారం శాసనమండలిలో జరిగిన చర్చలో మంత్రి పాల్గొన్నారు. రెండు నెలల్లోనే వీలైనంత ఎక్కువగా పనిచేశామని, పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని పొంగులేటి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర విజిలెన్స్ విభాగం రెండుసార్లు నివేదిక ఇచ్చిందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల కంటే 2 నెలలకు ముందే మేడిగడ్డ బ్రిడ్జి పిల్లర్లు కుంగిపోయాయని, ఆ సమయంలో వృధాగా పోతున్న నీళ్లను ఏ మేరకు ఎత్తిపోశారో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పష్టం చేయా లన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహమా?: కవిత



సాక్షి, హైదరాబాద్: సచివాలయం ముందున్న స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు గత ప్రభుత్వం మార్క్ చేసిందని, ఇప్పుడు ఆ స్థానంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్ర హాన్ని నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై నిరసన తెలుపుతున్నట్టు కె.కవిత చెప్పారు. దీనిపై మంత్రి కోమటిరెడ్డి స్పందిస్తూ దేశంలో ఎన్నో రకాల సంస్కరణలు చేపట్టిన వ్యక్తి రాజీవ్‌గాంధీ అని, ఆయన విగ్రహం ఏర్పాటుపై నిరసనలు తెలపడం సరికాదని అన్నారు.

# నీటిపారుదలపై శ్వేతపత్రం!

▶ మొదటి పేజీ తరువాయి

సాగడంతో వీలు కాలేదు. దీంతో శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు.

**ఏకగ్రీవ ఆమోదం: స్పీకర్**

రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక ఏడాదికి ప్రవేశపెట్టిన రూ.2,75,891 కోట్ల బడ్జెట్‌ను, ద్రవ్య వినిమయ బిల్లును శాసనసభ గురువారం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఈ నెల 10న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా దానిపై బుధ, గురువారాల్లో చర్చ జరిగింది. చర్చకు ఆర్థికమంత్రి సమాధానమిచ్చిన తర్వాత వచ్చే 4 నెలల కాలానికి అత్యవసర ఖర్చుల నిమి త్తం ప్రవేశపెట్టిన రూ.78,911.23 కోట్ల ద్రవ్య వినిమయ బిల్లును సభ ఆమోదించింది. అనంతరం 2023-24 ఏడాది అనుబంధ పద్దు కింద ప్రవేశపెట్టిన రూ.46,400.9 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. ఈ మేరకు బిల్లును ఆమోదించినట్లు స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు. మరోవైపు బడ్జెట్‌కు ఆమోదం తర్వాత మండలి వాయిదా పడింది.

**పేద ప్రైవేటు ఉద్యోగుల కోసం ప్రణాళిక: భట్టి**

'ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు 4,16,500 ఇళ్లు అవసరమవుతాయి. అవసరమైతే డిమాండ్‌కు అనుగుణంగా 5 లక్షల ఇళ్లు నిర్మించేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దళితులకు బాబాసాహెబ్ అభయహస్తం కింద ఒక్కో కుటుంబానికి రూ.12 లక్షల మేరకు ఆర్థిక స్వావలంబన కల్పించే పథకానికి సంబంధించి విధి విధానాలు రూపొందిస్తున్నాం. గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.17,700 కోట్లు పెట్టినా రూపాయి విడుదల చేయలేదు. ఈ బడ్జెట్‌లో రూ. 1,000 కోట్లు పెట్టాం. అప్పులు తిరిగి చెల్లించడానికే రూ.64 వేల కోట్లకు పైగా కావాలని, అందుకే రూ.68 వేల కోట్ల కొత్త అప్పులను బడ్జెట్‌లో ప్రతిపాదించాం.

**త్వరలో బీసీ సబ్‌ప్లాన్ విధివిధానాలు**

బీసీ సబ్‌ప్లాన్‌కి సంబంధించిన విధివిధానాలు కూడా సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం. 6 గ్యారంటీలకు వచ్చిన దరఖాస్తులకు అనుగుణంగా నిధుల కేటాయింపు జరుపుతాం. అర్హులైన దరఖాస్తుదారులందరికీ ఆరు గ్యారెంటీలను తప్పనిసరిగా అమలు చేస్తాం. ధరణిపై నియమించిన కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా కార్యాచరణ ప్రారంభిస్తాం. రీయింబర్స్‌మెంట్ ఫీజులు 2018 నుంచి పెండింగ్‌లో ఉండడం బాధాకరం. ఆర్థిక వెసులుబాటుకు అనుగుణంగా వాటిని చెల్లిస్తాం. ఎస్‌హెచ్‌జీలకు మళ్లీ వడ్డీ లేని రుణాలు ఇస్తాం. రెసిడెన్షియల్ పాఠశాలలకు సొంత భవనాలు ఏర్పాటు చేస్తాం. కేంద్రం, రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం ఉండాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుంది..' అని భట్టి సమాధానంలో చెప్పారు.

### కుట్రలు చేసేవారిని వదిలిపెట్టం

'మా ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కుట్రలు చేసే వారెవరినీ వదిలిపెట్టం. కొందరు విద్యుత్ అధికారులు మా ప్రభుత్వాన్ని ఉద్దేశపూర్వకంగా బద్నాం చేసేందుకు రైతులను ఇబ్బంది పెట్టారు. మా దృష్టికి వచ్చిన వెంటనే స్థానిక ఎస్ఈపై బదిలీ వేటు వేశాం. గత ప్రభుత్వంలో పనిచేసిన డిస్కంల డైరెక్టర్లందరినీ తొలగించి నిబంధనల ప్రకారం కొత్త వారిని నియమించడానికి నోటిఫికేషన్ జారీ చేశాం..' అని భట్టి తెలిపారు. పశుగ్రాసాన్ని కోసే యంత్రాలకు ఉచిత విద్యుత్ వాడే రైతులను విద్యుత్ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ సభ్యుడు వేముల ప్రశాంత్ రెడ్డి ప్రస్తావించగా భట్టి బదులిచ్చారు.

# ఇది వాస్తవిక బడ్జెట్

- ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం
- అందుకే బడ్జెట్ కుదించాల్సి వచ్చింది
- ఉద్యోగాల జాతర కొనసాగుతుంది
- అసెంబ్లీలో ఆర్థికమంత్రి భట్టి



సాక్షి, హైదరాబాద్: సామాజిక సమానత్వం తెచ్చే రీతిలోనే బడ్జెట్ రూపకల్పన చేశామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. గురువారం శాసనసభలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై జరిగిన చర్చకు మంత్రి బదులిస్తూ..అడ్డగోలుగా హామీలిచ్చిన ప్రభుత్వాలు, వాటి అమలుకు ఆదాయం ఎలా సమకూరుతుందో తెలియని స్థితిలో బడ్జెట్ ప్రవేశపెట్టాయని దుయ్యబట్టారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినా, మంజూరులేని పరిస్థితిలో అనేక వర్గాలు ఫలితం పొందలేకపోయారని తెలిపారు. ఇలాంటి పొరపాటుకు తావులేకుండా వాస్తవిక బడ్జెట్ రూపొందించామని చెప్పారు. అందుకే బడ్జెట్‌ను కుదించాల్సి వచ్చిందని వివరించారు. ప్రవేశపెట్టిన రూ.2,75,891 బడ్జెట్... ఆదాయం, ఖర్చుకు మధ్య మహా అయితే 6% కన్నా తక్కువ ఉండబోదని తెలిపారు. గత పదేళ్ల కాలంలో మొత్తం బడ్జెట్ కేటాయింపులు రూ.14,87,834 కోట్లు అయితే, ఖర్చు చేసింది మాత్రం రూ.12,25,312 కోట్లు అని తెలిపారు. ఆదాయమే లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టడం వల్ల ఈ పదేళ్లలో రూ. 2,65,212 కోట్లు కేటాయింపుల్లో ఖర్చు చేయలేదన్నారు. కేంద్రనిధులు తెచ్చేందుకు బీజేపీ సభ్యులు కూడా సహకరించాలని కోరారు. ఆర్థికలోటు అధిగమించేందుకు అప్పులు చేయక తప్పదన్నారు. ఇచ్చిన ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలు చేస్తామన్నారు. నిరుద్యోగుల కష్టాలు తొలగించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేశామని, నిరుద్యోగుల కలలు నిజం చేస్తూ ఉద్యోగాల జాతర కొనసాగుతుందని చెప్పారు.

| బడ్జెట్ కేటాయింపులు | ఖర్చు చేయని నిధుల వివరాలు ఇలా |
|---|---|
| 2014-15 | రూ.38,332 కోట్లు |
| 2015-16 | రూ.17,870 కోట్లు |
| 2016-17 | రూ.8,681 కోట్లు |
| 2017-18 | రూ.29,435 కోట్లు |
| 2018-19 | రూ.39,126 కోట్లు |
| 2019-20 | రూ.3,635 కోట్లు |
| 2020-21 | రూ. 25,367 కోట్లు |
| 2021-22 | రూ.47,728 కోట్లు |

2022-23లో రూ. 52,336 కోట్లు కేటాయింపులు, ఖర్చుకు మధ్య తేడా ఉండటాన్ని భట్టి సభలో ప్రస్తావించారు. 2023-24లో కూడా రూ.74 వేల కోట్లు ఖర్చుకు, కేటాయింపులకు తేడా ఉందని తాను గతంలో చెప్పినట్టు గుర్తు చేశారు.

# శాసనసభలో సెల్‌ఫోన్లు వాడొద్దు

- సభ జరుగుతున్నప్పుడు మీడియా పాయింట్ వద్ద మాట్లాడొద్దు
- అసెంబ్లీ స్పీకర్ కీలక నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: శాసనస సభ స్పీకర్ రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇక నుంచి సభలో సభ్యులెవరూ సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్‌ను వినియోగించకూడదని రూలింగ్ ఇచ్చారు. వాటిని ఉపయోగించి వీడియోలు ప్రదర్శించకూడదని ఆదేశించారు. 'కృష్ణా నది మీద నిర్మించిన ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతను కేఆర్ఎంబీకి అప్పగించే అంశం'మీద సభలో ఇటీవల జరిగిన చర్చ సందర్భంగా అధికార-ప్రధాన ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగిన విషయం తెలిసిందే. కేఆర్ఎంబీకి తాము ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యత అప్పగించటం లేదని ప్రభుత్వం స్పష్టం చేసిన సమయంలో, ఆ నిర్ణయానికి భిన్నమైన అభిప్రాయాన్ని వెల్లడించిన అప్పటి నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ (ప్రస్తుతం మాజీ) మురళీధర్‌రావు పేర్కొన్నట్టుగా ఉన్న వీడియోను ఫోన్ ద్వారా ప్రదర్శించారు. ఇది ప్రభుత్వాన్ని కొంత ఇరుకున పెట్టింది. ఈ నేపథ్యంలో సభలో ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ వినియోగంపై గురువారం స్పీకర్ నిర్ణయం వెల్లడించటం విశేషం. స్పీకర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా సభలో వాటిని వినియోగించవద్దని స్పష్టం చేశారు.

**అక్కడ మాట్లాడొద్దు**

ఇక సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన మీదట బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం వారు మీడియాతో మాట్లాడేందుకు సభ ఆవరణలోని మీడియా పాయింట్ వద్దకు వస్తుండగా భద్రత సిబ్బంది అడ్డుకున్నారు. సభ జరుగుతున్న తరుణంలో మీడియా పాయింట్ వద్ద మీడియా సమావేశానికి అనుమతి లేదంటూ వారు పేర్కొనడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ బీఆర్ఎస్ సభ్యులు నేలమీద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం సభ ప్రారంభం అవుతూనే స్పీకర్ ప్రసాద్ కుమార్ కీలక ప్రకటన చేశారు. సభ జరుగుతున్న తరుణంలో సభా ప్రాంగణంలో మీడియా పాయింట్ వద్ద విలేకరుల సమావేశానికి అనుమతి లేదని, టీ, లంచ్ విరామ సమయాల్లో, సభ వాయిదా పడ్డ తర్వాత యధావిధిగా మీడియా పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడవచ్చని పేర్కొన్నారు.

# కేసీఆర్‌ను వ్యతిరేకించి బయటకు వస్తే మద్దతు

హరీశ్‌ను ఉద్దేశించి మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కావాలన్న ఆలోచనలో మాజీమంత్రి హరీశ్‌రావు ఉన్నట్టున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాజాగా హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు కేసీఆర్, కేటీఆర్‌కు వెన్నుపోటు పొడిచేలా ఉన్నాయని చెప్పారు. తనను సీఎం చేస్తే మేడిగడ్డను పూర్తిచేసి చూపుతానన్న హరీశ్‌రావు వ్యాఖ్యల నేపథ్యంలో వెంకటరెడ్డి పైవిధంగా స్పందించారు. ఆయన గురువారం అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో మాట్లాడుతూ.. కేసీఆర్‌ను వ్యతిరేకించి హరీశ్ బయటికొస్తే మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. ఇరవైమంది ఎమ్మెల్యేలతో ఆయన బీఆర్ఎస్ పార్టీ నేత కావాలని సూచించారు. బీఆర్ఎస్‌లోనే ఉంటే హరీశ్‌రావు ఫ్లోర్‌లీడర్ కూడా కాలేరని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ కవిత, హరీశ్, కేటీఆర్ పేర్ల మీద మూడుగా విడిపోతుందని జోస్యం చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ కర్ర పట్టుకుని తిరుగుతున్నారని, అలాంటపుడు ఆయన పులి ఎట్లా అవుతారని ప్రశ్నించారు. 60 కేజీల బరువున్న కేసీఆర్ పులి అయితే.. 86కిలోల బరువున్న తానేం కావాలో చెప్పాలన్నారు. రాబోయే 20 ఏళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

# ఇది ప్రతిపక్షం కాదు.. ఫ్రస్టేషన్ పక్షం

**వీళ్లను దేవుడు కూడా కాపాడలేడు**

- బీఆర్ఎస్‌పై విరుచుకుపడ్డ మంత్రి కోమటి రెడ్డి
- సీఎంగా రేవంత్ ఓకే... కానీ తన వాళ్లతోనే సమస్యన్న కడియం
- మోసం చేయడం బీఆర్ఎస్‌కే అలవాటన్న కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'వీళ్లది ప్రతిపక్షం కాదు... ఫ్రస్టేషన్ పక్షం'అంటూ మంత్రి కోమటి రెడ్డి, 'మా వల్ల ఏ ప్రమాదం లేదు... మీ వాళ్లతోనే జాగ్రత్త' అంటూ సీఎంనుద్దేశించి బీఆర్ఎస్ సభ్యుడు కడియం శ్రీహరి పరస్పర విమర్శనాస్త్రాలతో శాసన సభ గురువారం వేడెక్కింది. బడ్జెట్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానం చెప్పిన అనంతరం అనుబంధ సందేహాలను కడియం శ్రీహరి లేవనెత్తేందుకు స్పీకర్ అనుమతించారు. ఈ దశలో బీఆర్ అంబేడ్కర్ దళిత బంధు పేరుతో ఎస్సీ, ఎస్టీలకు ఒక్కొక్కరికీ రూ.12 లక్షలు ఇస్తామన్నారని, బడ్జెట్‌లో ఇందుకు సంబంధించిన కేటాయింపులు లేవని విమర్శించారు. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి జోక్యం చేసుకుని 'ఎన్నికల మేనిఫెస్టోలో హామీలిచ్చి, మోసం చేయడం బీఆర్ఎస్‌కే అలవాటు. వీళ్ళు ప్రతిపక్షం కాదు... ఫ్రస్టేషన్ పక్షం. అధికారం పోయిందనే అసహనంతో ఉన్నారు. హరీశ్‌రావు నేనే సీఎం అయితే అంటున్నాడు. వీళ్ళకు ఏదో సమస్య వచ్చింది. వీళ్ళను దేవుడు కూడా కాపాడలేడు.''అని వ్యాఖ్యానించారు.

**హోంగార్డు చనిపోతే పట్టించుకోలే: కోమటిరెడ్డి**

''ఇటీవల జరిగిన నల్లగొండ సభకు వీళ్ల ఎమ్మెల్యే కారణంగా ఓ హోంగార్డు చనిపోయాడు. అతనికి ఇద్దరు చిన్న పిల్లలున్నారు. కనీసం వీళ్ళు ఆ కుటుంబాన్ని పరామర్శించలేదు. 2001లో కేసీఆర్ పార్టీ పెట్టినప్పుడు రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి దళితుడేనని, తన మాట అమలు కాకపోతే తల తీసుకుంటానన్నాడు దీన్ని అమలు చేశారా? మా పార్టీ నుంచి దళితుడు కాంగ్రెస్ ప్రతిపక్ష నేతయితే ఓర్వలేదు. మా ఎమ్మెల్యేలను కొనేశారు.'అని కోమటిరెడ్డి ఆరోపించారు. ఇందుకు కడియం అంతే ఘాటుగా బదులిచ్చారు. 'అసహనంతో ఉన్నది మీరే. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, తాను పూర్వాశ్రమంలో ఒకే స్కూల్‌లో చదువుకున్నాం. నేను సీనియర్ స్టూడెంట్‌ను. ఆయన జూనియర్. రేవంత్ సీఎంగా ఉండాలని నా మనసులో ఉంది. కానీ రేవంత్ మీ వాళ్ళతో జాగ్రత్తగా ఉండాలి. మా గురించి మీరు వర్రీ కాకండి ... మీ వాళ్ళను జర జాగ్రత్తగా చూసుకోండి'అని మాట్లాడటంతో సభలో ఇరు పక్షాల మధ్య వాగ్వాదానికి దారి తీసింది.

**2 లక్షల ఉద్యోగాలెప్పుడిస్తారు?: కడియం**

బహిరంగ మార్కెట్లో రుణాలు రూ.59,625 కోట్లు వస్తుందని అంచనా వేశారని, పన్నుల రూపంలో అదనంగా రూ. 20 వేల కోట్లు వస్తుందని చెప్పారని, అయినా ఆర్థిక లోటు రూ.53 వేల కోట్లు రావడానికి కారణమేంటో చెప్పాలని కడియం శ్రీహరి నిలదీశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేస్తారని ప్రశ్నించారు. ఇంత వరకూ ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీల్లో యువ వికాసం వదిలేసి, ఐదు హామీలకు బడ్జెట్‌లో రూ. 53,193 కోట్లు కేటాయించారని, ఏ హామీకి ఎంత ఖర్చు చేస్తారో చెప్పాలన్నారు. నియోజకవర్గానికి 3500 ఇళ్ళ చొప్పున, 4.16 లక్షల ఇళ్ళు అవసరమని, ఇంటికి రూ.5 లక్షలు లెక్కన. ఎస్సీ, ఎస్టీ అయితే మరో రూ. లక్ష ఇస్తామన్నారని, ఇవన్నీ కలిపితే, రూ.23 వేల కోట్ల పైన అవుతుందన్నారు. కానీ బడ్జెట్‌లో కేటాయింపు మాత్రం రూ. 7,750 కోట్లు మాత్రమేనని, ఈ పథకాన్ని ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ఎస్సీల రిజర్వేషన్ 18 శాతం పెంచుతామని ఇచ్చిన హామీపై స్పష్టత ఇవ్వాలన్నారు.

**ఉద్యోగాల భర్తీ కొనసాగుతుంది: పొన్నం**

ఈ దశలో మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకుని గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఉద్యోగ నియామకాలు జరగలేదని ఆరోపించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను నియమించామని, ఉద్యోగాల భర్తీ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## క్లుప్తంగా...

### మాది భేషజాలకు పోని ప్రభుత్వం

మంచి పథకాలను కొనసాగిస్తాం.. మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసమే పనిచేస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పునరుద్ఘాటించారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలను, కార్యక్రమాలను నిలిపివేయాలనే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి భేషజాలకు పోదని స్పష్టం చేశారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం మండలిలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఉపయోగకరమైన పథకాలను రద్దు చేయమనీ, వాటిలో పొరపాట్లు ఉంటే సరిచేసి అమలు చేస్తామని, మంచి పథకాలను కొనసాగిస్తామని వెల్లడించారు.

**మైక్ కట్ చేయడం లేదు.. హ్యాపీ: నర్సిరెడ్డి**

ఈ ఐదేళ్లుగా జరిగిన సమావేశాల్లో ప్రస్తుతం జరుగుతున్న చర్చనే ఆసక్తికరంగా సాగుతోందని టీచర్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గతంలో ఎన్ని ప్రశ్నలు లేవనెత్తినా వాటికి సమాధానం లభించలేదని, ప్రస్తుతం మైక్ కట్ చేయకుండా మాట్లాడుతున్నానని, ఆమేరకు అవకాశం దొరికిందని వ్యాఖ్యానించారు. గతంలో మన ఊరు- మన బడి కార్యక్రమం కింద పాఠశాలల ఎంపిక చేపట్టి వాటి అభివృద్ధి పనులను మధ్యలోనే ఆపేశారన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ సెగ్మెంట్‌కు రూ.10 కోట్లు చొప్పున మంజూరు చేసిన నిధుల నుంచి 20 శాతం విద్యకు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని నర్సిరెడ్డి కోరారు.

### కేంద్ర వాటాలో దక్షిణాదికి అన్యాయం

ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల వాటాలో దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతోందని శాసనసభలో ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఆవేదన వ్యక్తం చేశారు. మంచి పనితీరు కనపరుస్తున్న రాష్ట్రాలకు నిధుల కేటాయింపులు తగ్గించి, పనిచేయని రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం శాసనసభలో ద్రవ్య వినియమ బిల్లు చర్చ సందర్భంగా మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర వాటాలో కేవలం 16 శాతమే వస్తుంటే.. కేవలం ఉత్తరప్రదేశ్‌కు 14.6 శాతం, బిహార్‌కు 10.1 శాతం మేర నిధులు కేటాయిస్తున్నారని, ఇది మరీ అన్యాయమన్నారు. దీనిపై అఖిలపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లాలని అక్బరుద్దీన్ డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దక్షిణాదిపై వివక్ష మరీ ఎక్కువైందని వ్యాఖ్యానించారు. ఈ వివక్షపై శాసనసభలో ప్రత్యేక చర్చ చేయాలని, మిగిలిన రాష్ట్రాలను కలుపుకొని కేంద్రం వద్దకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత బడ్జెట్‌లో దాదాపు రూ.68 వేల కోట్ల అప్పులు చూపిస్తున్నారని, ఇది బడ్జెట్‌లో 25%గా ఉందని పేర్కొన్నారు.

### పొత్తు కోసం బీఆర్ఎస్ అడుగుతోంది


లాబీల్లో బీజేపీ నేత, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: బీజేపీతో పొత్తు గురించి బీఆర్ఎస్ వాళ్లు అడుగుతున్నారని, ఈ విషయంపై చర్చ జరుగుతోందని బీజేపీ నేత, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ దిశగా బీఆర్ఎస్ నాయకులు పావులు కదుపుతున్నట్టు ప్రచారం జరుగుతోందన్నారు. గురువారం అసెంబ్లీ లాబీల్లో మీడియాతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీజేపీది దేవుడి పార్టీ అని ఆయన ఆశీస్సులుంటే తనకు ఎంపీ టికెట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తనకు ఆదిలాబాద్ ఎంపీ టికెట్ ఇవ్వాలని అడుగుతున్నానని, అది ఇచ్చినా ఇవ్వకపోయినా బీజేపీలోనే ఉంటానని స్పష్టం చేశారు.

### గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూనే కొత్త అప్పులా?

దివాలా తీసి ఉంటే.. కొత్త అప్పులు ఎలా ఇచ్చారు: ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అప్పుల మయం చేసిందని ఆరోపిస్తూనే, తాజాగా అప్పులు ఎలా తెస్తున్నారని బీఆర్ఎస్ సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, ఒకవేళ తమ ప్రభుత్వం అప్పులతో దివాళా తీయించి ఉంటే కొత్తగా రూ. 60 వేల కోట్లు రుణంగా వచ్చేవి కావని అన్నారు. పరపతి ఉంటేనే, రీపేమెంట్ చేస్తేనే అప్పులు పుడతాయని అన్నారు. చేసిన అప్పులు తీర్చడానికి అప్పులు చేస్తామంటున్న ప్రభుత్వ పెద్దలు, పాత బాకీలు ఎంత కడతారో చెప్పాలని ప్రశ్నించారు. ద్రవ్య వినిమయ బిల్లుల్లో పెట్టిన బడ్జెట్‌కు, వాస్తవానికి కూ డా తేడా ఉందని, రైతు రుణమాఫీకి రూ. 40 వేల కోట్లు, నిరుద్యోగ భృతికి ఏటా రూ. 14 వేల కోట్లు అవసరమని, వాటిని ఎలా సమకూరుస్తారని ప్రశ్నించారు.



సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో జానారెడ్డి, రాములు నాయక్, కోమటిరెడ్డి, బలరాం నాయక్ తదితరులు

## అన్ని తండాల్లో పాఠశాలలు నిర్మిస్తాం

### గ్రామ పంచాయతీలుగా మారిన తండాలకు బీటీ రోడ్లు: సీఎం రేవంత్‌రెడ్డి

బంజారాహిల్స్ (హైదరాబాద్): రాష్ట్రంలోని అన్ని తండాల్లో పాఠశాలలు నిర్మిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీలుగా మారిన అన్ని తండాలకు బీటీ రోడ్లు వేసే బాధ్యత కూడా తమదేనన్నారు. ఆ తండాలకు పంచాయతీ భవనాలను నిర్మిస్తామన్నారు. గురువారమిక్కడి బంజారాభవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ నిర్వహించిన శ్రీ సంత్ సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాల్లో రేవంత్ మాట్లాడారు. విద్యుత్, మంచినీరు... ఇలా ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, అన్ని నియోజకవర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బంజారా సోదరులతో ఈ సమావేశం నిర్వహిస్తుంటే కాంగ్రెస్ కుటుంబ సభ్యులను కలిసినంత ఆనందంగా ఉందని చెప్పారు. 1976లో బంజారాలను ఎస్టీ జాబితాలో ఇందిరాగాంధీ చేర్చారని, ఆ తర్వాత దామాషా ప్రకారం నిధులు కేటాయించిన ఘనత సోనియాగాంధీదేనన్నారు. మీ ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, సేవాలాల్ జయంతిని ప్రభుత్వం ఆప్షనల్ హాలిడేగా ఇచ్చిందని చెప్పారు. జయంతి ఉత్సవాల నిర్వహణకు రూ.కోటి కాదు.. మరో కోటి జత చేసి రూ.2 కోట్లు విడుదల చేస్తున్నామని, తక్షణమే దీనికి సంబంధించిన జీఓను విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, మాజీ మంత్రి కె.జానారెడ్డి, బలరాంనాయక్, రాములునాయక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి, బంజారా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి ఇందిరా శోభన్

### రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో చేరిక



సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్‌టీపీ, ఆప్‌లో క్రియాశీలకంగా పనిచేసిన సీనియర్ నాయకురాలు ఇందిరా శోభన్ తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. గురువారం గాంధీభవన్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్ సమక్షంలో ఇందిరా శోభన్ కాంగ్రెస్‌లో చేరారు. ఆమెకు దీపాదాస్, విష్ణునాథ్‌లు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇందిరా శోభన్ మీడియాతో మాట్లాడుతూ...పార్టీ ఆదేశాల మేరకు తనకు ఏ బాధ్యతలు అప్పగించినా సమర్థవంతంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజలకు సేవ చేసుకునే అవకాశం వచ్చిందని నిరంతరం ప్రజా సేవలోనే ఉంటానని చెప్పారు.

## బండ్లగూడ మేయర్ అవిశ్వాసంపై హైకోర్టు స్టే

సాక్షి, హైదరాబాద్: బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాసాన్ని నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలో 22 మంది కార్పొరేటర్లు ఉండగా, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీకి చెందిన 16 మంది కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ జనవరి 12న కలెక్టర్‌కు పత్రాన్ని అందజేశారు. దీంతో ఈనెల 16న అవిశ్వాస తీర్మాన సమావేశం పెట్టాలని నిర్ణయించారు. కలెక్టర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మహేందర్‌గౌడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపిస్తూ.. చట్టప్రకారం అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేసిన 30 రోజుల్లో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. కానీ జనవరి 12న కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని సమర్పించగా, కలెక్టర్ ఈ నెల 16న సమావేశం ఏర్పాటు చేయడం చెల్లదని స్పష్టం చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అవిశ్వాస ప్రక్రియపై స్టే విధించారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను వాయిదా వేశారు.

## నందికొండ మున్సిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

### మరో మున్సిపాలిటీ కోల్పోయిన బీఆర్‌ఎస్

నాగార్జునసాగర్: నల్లగొండ జిల్లా నందికొండ (నాగార్జునసాగర్) మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. ఈ మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లలో 9 మంది బీఆర్‌ఎస్, ముగ్గురు కాంగ్రెస్ పార్టీకి చెందినవారు ఉన్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక కౌన్సిలర్ మృతిచెందారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం నిర్వహించిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ హాజరుకాలేదు. సమావేశానికి వచ్చిన తొమ్మిది మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్ కర్ణ అనూషా శరత్‌రెడ్డి, వైస్ చైర్మన్ మందా రఘువీర్‌కుమార్‌పై పెట్టిన అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తారు. దీంతో వారు పదవులు కోల్పోయారు.

## మీరు కూడా ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటమా?: ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రజాస్వామ్యం గురించి బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ధ్వజమెత్తారు. ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలు చూస్తుంటే ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి హయాం గుర్తుకు వస్తోందని వ్యాఖ్యానించారు. గురువారం అసెంబ్లీ ఆవరణలో రాజగోపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'నల్లగొండ జిల్లాలో బీఆర్‌ఎస్ సభ ప్రభావం లోక్‌సభ ఎన్నికల్లో పడదు. ఆ జిల్లాలో ఉన్న బీఆర్‌ఎస్ నేతలు సచ్చిన పాములు'అని వ్యాఖ్యానించారు. 'కేసీఆర్ ఆ బంధు, ఈ బంధు ఇచ్చి చివరికి బొందలో పడ్డాడు. బీఆర్‌ఎస్ పార్టీ పేరు మార్చుకోవాలి. ఆ పార్టీ అధ్యక్షుడిగా హరీశ్ రావుని చేయాలి. కేసీఆర్‌కు రాజకీయ వారసుడు హరీశ్ రావు మాత్రమే, కేటీఆర్ వల్ల కాదు. ఇప్పుడు బీఆర్‌ఎస్ కొన ఊపిరితో ఉంది.. ఆ పార్టీలో హరీశ్ రావు ఉంటేనే పార్టీ బతుకుతుంది.'అని రాజగోపాల్‌రెడ్డి చెప్పుకొచ్చారు. 'బీఆర్‌ఎస్, బీజేపీ కలిస్తే రెండూ ఖతం అవుతాయి. ఈ రెండూ కలసి పోటీ చేసినా మెదక్‌లో గెలిచే పరిస్థితి లేదు.. ఈసారి కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో లోక్‌సభ సీట్లు 12 నుంచి 14 సీట్ల వరకు వస్తాయి'అని పేర్కొన్నారు.

# ఆ ముగ్గురి ఎన్నిక లాంఛనమే!

- రాజ్యసభకు కాంగ్రెస్ నుంచి రేణుకా చౌదరి, అనిల్‌కుమార్ యాదవ్, బీఆర్‌ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర నామినేషన్లు
- మూడు సీట్లకు మూడు పత్రాలే దాఖలుతో ఇక ఎన్నిక ఏకగ్రీవమే..





నామినేషన్ పత్రాలను అందజేస్తున్న అనిల్ యాదవ్, రేణుకా చౌదరి. చిత్రంలో సీఎం రేవంత్, దీపాదాస్ మున్షీ, కోమటిరెడ్డి తదితరులు



బీఆర్‌ఎస్ అభ్యర్థి వద్దిరాజు

సాక్షి, హైదరాబాద్: రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలో భాగంగా రాష్ట్రం నుంచి మూడు స్థానాలకు గాను మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం నామినేషన్ల గడువు పూర్తయ్యే సమయానికి కాంగ్రెస్ పార్టీ నుంచి రెండు, బీఆర్‌ఎస్ నుంచి ఒక నామినేషన్ దాఖలు కావడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ నేత రేణుకా చౌదరి, యువనేత అనిల్‌కుమార్ యాదవ్ చెరి మూడేసి సెట్ల చొప్పున, బీఆర్‌ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర రెండుసెట్ల నామినేషన్‌పత్రాలను సమర్పించారు. కాంగ్రెస్ అభ్యర్థులు మూడే సి సెట్ల నామినేషన్లలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు (ఒక్కో దాంట్లో పదేసి మంది చొప్పున మొత్తం 60 మంది సభ్యులు)సంతకాలు చేసినట్లు పార్టీ వర్గాల సమాచారం. గురువారం రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డికి రేణుకా చౌదరి తమ నామినేషన్ పత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో సమర్పించారు. అనిల్‌కుమార్ యాదవ్ తమ పత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు డి.శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో అందజేశారు. వద్దిరాజు రవిచంద్ర తమ పత్రాలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు గంగుల కమలాకర్, నాగేందర్, జగదీశ్‌రెడ్డి సమక్షంలో రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.

### రేణుక, అనిల్‌కు బీఫామ్స్ అందజేసిన సీఎం

అంతకుముందు సీఎం చాంబర్‌లో అభ్యర్థులు రేణుకాచౌదరి, అనిల్‌కుమార్‌కు రేవంత్‌రెడ్డి బీఫామ్స్ అందజేసినపుడు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆదిశ్రీనివాస్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఈర్లపల్లి శంకర్, తదితరులున్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థులను సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభినందించారు. గురువారం ఉదయం తెలంగాణ భవన్‌లో జరిగిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న వద్దిరాజు తెలంగాణ తల్లి విగ్రహానికి దండలు వేసి అసెంబ్లీకి చేరుకున్నారు. తొలుత అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కులోని తెలంగాణ అమరుల స్తూపానికి నివాళులర్పించారు.

### ఎన్నిక ఏకగ్రీవమే!

వచ్చే ఏప్రిల్ 2న బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్ పదవీ కాలం ముగియనుండడంతో రాష్ట్రం నుంచి మూడు రాజ్యసభ స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ మూడు సీట్లకు గాను నామినేషన్ల గడువు ముగిసే సమయానికి మూడు నామినేషన్లే దాఖలు కావడంతో... కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల బలాబలాల ఆధారంగా ఈ నెల 27న ఎన్నిక నిర్వహించాల్సిన అవసరం లేకుండానే వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 16న పత్రాల నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఈనెల 20న నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరి రోజు. ఈ గడువు ముగియగానే ఈ ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టుగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించనుంది.

## 17న కేసీఆర్ జన్మదిన వేడుకలు

### పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో ప్రత్యేక కార్యక్రమాలు



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను ఈ నెల 17న పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. వేడుకలకు సంబంధించిన వివరాలను మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. శనివారం జరిగే ఈ వేడుకలకు పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేయాలని ఆయన పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. వికలాంగులకు వీల్‌చైర్ల పంపిణీ, రోగులకు ఆసుపత్రుల్లో పండ్ల పంపిణీ, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా పార్టీ ముఖ్య నేతల సమక్షంలో 70 కిలోల భారీ కేక్‌ను కట్ చేయడంతో పాటు అన్నదానం చేస్తున్నట్లు తలసాని వెల్లడించారు.

**ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా..**

కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా వేయి మంది ఆటో డ్రైవర్లకు రూ.లక్ష ప్రమాద బీమా చేయించనున్నట్లు పార్టీ తెలిపింది. అలాగే ఈ సందర్భంగా 'తానే ఒక చరిత్ర' పేరుతో 30 నిమిషాల డాక్యుమెంటరీని తెలంగాణ భవన్లో ప్రదర్శిస్తారు.

## తెలంగాణ భవన్‌లో సేవాలాల్ జయంతి వేడుకలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ భవన్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి మాజీ సీఎం కేసీఆర్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం అక్కడ జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీమంత్రులు సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నేత రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 'గవర్నర్ కోటా'పై ముగిసిన వాదనలు

### తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటా ఎమ్మెల్సీ వివాదంలో దాఖలైన పిటిషన్లపై వాద, ప్రతివాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీఆర్‌ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను సిఫార్సు చేస్తూ గత ప్రభుత్వం గవర్నర్‌కు వివరాలు పంపింది. ప్రభుత్వ సిఫార్సును తిరస్కరిస్తూ 2023, సెప్టెంబర్ 19న గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేయగా...ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. సత్యనారాయణ తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రతివాదనల అనంతరం తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. రాతపూర్వక వాదనలు ఉంటే సాయంత్రం వరకు అందజేయాలని వాద, ప్రతివాద న్యాయవాదులను ఆదేశించింది.

## అమిత్ షాతో ఎమ్మెల్యే కాటేపల్లి భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణా రెడ్డి.. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కలిశారు. గురువారం ఢిల్లీ వచ్చిన ఆయన.. హోం మంత్రితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై చర్చించినట్లు తెలిసింది. అనంతరం రాష్ట్ర పార్టీ బాధ్యుడు తరుణ్ చుగ్, కేంద్రమంత్రి, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురోషోత్తం రూపాలతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌లపై విజయం సాధించినందుకు ఆయనను కేంద్ర పెద్దలు మరోసారి అభినందించారు.

# హస్తం గూటికి జెడ్పీ సారథులు

- అసెంబ్లీ ఎన్నికలకు ముందే మేడ్చల్ జెడ్పీ చైర్మన్ చేరిక
- నేడు కాంగ్రెస్ కండువా కప్పుకోనున్న వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి
- ఈనెల 20 తర్వాత రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి కూడా?



పట్నం సునీతారెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా, తాండూరు: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నేతలు ఆ పార్టీ అధిష్టానానికి షాక్‌లిస్తున్నారు. ఓ వైపు లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండగా, మరో వైపు గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పేందుకు ముహూర్తాలు చూసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి కారు దిగి హస్తం గూటికి చేరుకోగా, తాజాగా వికారాబాద్ జెడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి శుక్రవారం గాంధీభవన్ వేదికగా హస్తం గూటిలో చేరనున్నారు. ముందుగా బీఆర్‌ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేసిన అనంతరం బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి కార్యకర్తలతో భారీ ర్యాలీగా గాంధీభవన్‌కు వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపా దాస్‌మున్షీ, మంత్రుల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. ఆమెతో పాటు కుమారుడు రినీష్‌రెడ్డి కూడా పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది. వీరిరువురినీ పార్టీలో చేర్పించేందుకు ఏర్పాట్లు చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి.. తాను మాత్రం త్వరలో చెవేళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పార్టీ కండువా వేసుకోనున్నట్టు చెబుతున్నారు.

**సునీత దారిలోనే అనిత..**

మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌ను కలిశారు. అధికారికంగా పార్టీ కండువా కప్పుకోకపోయినా.. పార్టీ మార్పుపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. కృష్ణారెడ్డి కోడలు, రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి కూడా త్వరలో కారు దిగేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఎప్పుడు పార్టీలో చేరనున్నారనే అంశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఈ నెల 20న జెడ్పీ సర్వసభ్య సమావేశం ముగిసిన తర్వాత ఆమె కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది. కాగా, అనితారెడ్డి మరోసారి జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ సారి మహేశ్వరం నుంచి కాకుండా కందుకూరు నుంచి పోటీ చేస్తారనే ప్రచారం సాగుతోంది. ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత జెడ్పీ పీఠాన్ని మళ్లీ ఆమెకే కట్టబెట్టేందుకు సీఎం రేవంత్ హామీ ఇచ్చినట్లు తెలిసింది.

## 18న కోస్గికి సీఎం

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 18న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలో పర్యటించనున్నారు. ఇందుకోసం నారాయణపేట జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. హెలిపాడ్ సైతం సిద్ధం చేస్తున్నారు. కోస్గిలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

## నేడు డీసీసీ అధ్యక్షులతో మున్షీ సమావేశం

సాక్షి, హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నేడు(శుక్రవారం) మరో సమావేశం నిర్వహించనుంది. రాష్ట్రంలో అన్ని జిల్లాలు, నగర పార్టీ అధ్యక్షులతో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ భేటీ కానున్నారు. జిల్లాలు, నగరాలవారీగా పార్టీ పరిస్థితి, రానున్న పార్లమెంటు ఎన్నికల కోసం అనుసరించాల్సిన వ్యూహం లాంటి అంశాలపై చర్చించి జిల్లాస్థాయి కార్యాచరణను రూపొందించనున్నారు. ఈ సమావేశాల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, ప్రజల్లో ఉన్న అభిప్రాయానికి సంబంధించిన ఫీడ్‌బ్యాక్‌ను కూడా పార్టీ నేతల నుంచి సేకరించనున్నట్టు తెలుస్తోంది.

## ట్రాన్స్‌ఫర్.. ట్రాన్స్‌ఫర్.. ట్రాన్స్‌ఫర్

### మూడు రోజుల వ్యవధిలోనే సివిల్ డీఎస్పీల పోస్టింగ్‌లలో మార్పు

సాక్షి, హైదరాబాద్: ఐపీఎస్ మొదలు డీఎస్పీ వరకు ఇటీవల పోలీస్‌శాఖలో పెద్ద ఎత్తున బదిలీలు జరిగాయి. అయితే సివిల్ డీఎస్పీల పోస్టింగ్‌లు మారుస్తూ జరిగిన వరుస బదిలీలు మాత్రం చర్చనీయాంశమయ్యాయి. ఈ నెల 12న 110 మంది సివిల్ డీఎస్పీలు, 14వ తేదీన మరో 95మంది, తాజాగా గురువారం మరో 26 మంది సివిల్ డీఎస్పీలను బదిలీ చేశారు. బదిలీల ప్రక్రియ అత్యంత సహజమే అయినా, ఒకసారి ఇచ్చిన పోస్టింగ్ మారుస్తూ...లేదంటే అప్పటికే ట్రాన్స్‌ఫర్ చేసిన వారిని తిరిగి అక్కడే కొనసాగిస్తున్నట్టు పేర్కొంటూ వరుస ఉత్తర్వులు వెలువడుతుండడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కొందరు అధికారులు బదిలీ అయినా తమ 'పట్టు'నిలుపుకొని తిరిగి అదే స్థానాల్లో కొనసాగుతున్నారు. మరికొందరు బదిలీ అయిన స్థానంలో చేరకముందే రోజుల వ్యవధిలోనే 'అనుకూల'పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఒకేసారి పెద్ద సంఖ్యలో బదిలీ జరిగినప్పుడు కొద్దిమేర పోస్టింగ్‌ల్లో మార్పులు సహజమే. అయితే, గత మూడు రోజుల్లో విడుదల చేసిన పోస్టింగ్ ఉత్తర్వులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయని పోలీస్‌వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో సన్నిహితంగా మెలిగిన వారికే మళ్లీ కీలకస్థానాల్లో పోస్టింగ్‌లు దక్కుతున్నాయన్న చర్చ జరుగుతోంది. 'పోలీసులపై ప్రభుత్వ పెత్తనం ఉండబోదు'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఐపీఎస్ ఆఫీసర్ల గెట్ టు గెదర్‌లో చెప్పినా, పరిస్థితి మాత్రం అలా లేదని కొందరు వాపోతున్నారు.

**26 మంది సివిల్ డీఎస్పీల బదిలీ**

రాష్ట్రవ్యాప్తంగా 26 మంది సివిల్ డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన డీఎస్పీలు వారికి కేటాయించిన పోస్టింగ్‌లలో వెంటనే చేరాలని డీజీపీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# మోదీ 'అన్యాయ్‌కాల్'కు కౌంట్‌డౌన్ మొదలైంది

- పదేళ్లలో మోదీ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు
- పంటలకు మద్దతు ధర ఇస్తామని పట్టించుకోవడం లేదు
- సీడబ్ల్యూసీ సభ్యుడు దిగ్విజయ్‌సింగ్



దిగ్విజయ్



మున్షీ సమక్షంలో పార్టీలో చేరిన మధు

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ హయాంలోని పదేళ్ల 'అన్యాయ్‌కాల్'కు కౌంట్‌డౌన్ మొదలైందని, త్వరలోనే అది ముగుస్తుందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు దిగ్విజయ్‌సింగ్ వ్యాఖ్యానించారు. మోదీ ఇచ్చిన హామీలు గత పదేళ్ల కాలంలో ఒక్కటి కూడా అమలు కాలేదని, కానీ వాగ్దానాలతో చేసిన ఆయన ప్రసంగాలు ఇంకా ప్రజల జ్ఞాపకాల్లో ప్రతిధ్వనిస్తున్నాయని దిగ్విజయ్‌సింగ్ పేర్కొన్నారు. గురువారం ఆయన హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఢిల్లీ శివార్లలో రైతుల ఆందోళన సందర్భంగా పంటలకు మద్దతు ధరపై చట్టబద్ధత కల్పిస్తామని మోదీ ఇచ్చిన హామీని రెండేళ్లయినా పట్టించుకోవడం లేదన్నారు. ఢిల్లీలో రైతుల తాజా ఆందోళనను నిలువరించేందుకు డ్రోన్‌లు ఉపయోగించి గ్యాస్ షెల్స్ ప్రయోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ పాలనలో గ్యాస్ సిలెండర్ ధరలు రెండింతలు పెరిగాయని, దేశ అప్పులు మూడు రెట్లు పెరిగాయని, దేశంలోని ఏ ఒక్క వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరని విమర్శించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్‌లో చేరిన నీలం మధు**

అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఎస్పీలో చేరిన పఠాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన నీలం మధు గురువారం దీపాదాస్‌మున్షీ సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. ఆయనను దీపాదాస్‌మున్షీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# ..ప్రజలు సానుభూతి చూపరు

▶ మొదటి పేజీ తరువాయి

అధికారంలోకి వచ్చి పేదల కోసం పని చేస్తుంటే.. మామా అల్లుళ్లు తమను తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం చేసిన దోపిడీని చూపించేందుకే మేడిగడ్డకు వెళ్లామని, ప్రాజెక్టు పేక మేడలా కూలిపోయే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. ప్రాజెక్టులపై చర్చ పెడితే అసెంబ్లీకి రాకుండా పారిపోయారన్నారు.

**ఔరంగజేబు అవతారమెత్తాల్సిందే**

హరీశ్‌రావు పదవి కోసం ఔరంగజేబు అవతారమెత్తాల్సిందేనని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'నువ్వు రాజీనామా చెయ్.. నేను చేసి చూపిస్తా' అని హరీశ్‌రావు చెబుతున్నారని, దీనిని బట్టి సీఎం కావడానికి హరీశ్‌రావు.. మరో ఔరంగజేబు కావాల్సిందేనని ఎద్దేవా చేశారు. అధికారం కోసం సొంత వాళ్లపైనే కర్కశంగా ప్రవర్తించిన చరిత్ర ఔరంగజేబుదని గుర్తు చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నపుడు గాలికి తిరిగారా? అని ప్రశ్నించారు. దోచుకున్నది దాచుకోవడానికి బీఆర్‌ఎస్ పదేళ్లు పనిచేసిందన్నారు. ఒక రైతు బిడ్డ సీఎం కుర్చీలో కూర్చుంటే కేసీఆర్ కళ్లు మండుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**త్వరలో గ్రూప్–1 పరీక్ష నిర్వహిస్తాం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగ నియామకాలపై దృష్టి సారించిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. యూపీఎస్సీ తరహాలో టీఎస్‌పీఎస్సీలో నియామకాలు చేపట్టాలని నిర్ణయించామని. త్వరలో గ్రూప్–1 పరీక్ష నిర్వహిస్తామన్నారు. అధికారం చేపట్టిన 70 రోజుల్లోనే దాదాపు 25వేల ఉద్యోగ నియామకాలు చేపట్టామని వివరించారు. ప్రతి నియోజకవర్గంలో ఒకే కాంప్లెక్స్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. విద్యార్థుల్లో సోదర భావం మరింత పెంపొందించేందుకు గురుకుల పాఠశాలలన్నింటినీ ఒకే గొడుకు కిందకు తెస్తామన్నారు. పైలట్ ప్రాజెక్టుగా కొండగల్‌లో సుమారు 20 ఎకరాల్లో వంద కోట్ల వ్యయంతో గురుకులాల సముదాయం నిర్మించనున్నట్లు వెల్లడించారు. అన్ని నియోజకవర్గాల్లో ఇందుకు కావాల్సిన స్థలాలను సేకరించాలని అధికారులకు ఆదేశాలిస్తున్నట్లు చెప్పారు. త్వరలో మెగా డీఎస్సీ ద్వారా నియామకాలను చేపడతామన్నారు.

**వైఎస్సార్‌ది జనరంజక పాలన**

దివంగత వైఎస్సార్ హయాంలో జనరంజక పాలన సాగిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. 2004లో ఇదే ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేసిన వైఎస్సార్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణ, విద్యుత్ బకాయిల మాఫీ, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. ఆదే స్ఫూర్తి, ఆలోచనతో తిరిగి ప్రభుత్వం ఏర్పాటు కోసం ప్రయత్నించామన్నారు.

**గ్రీన్ చానల్ ద్వారా మెస్ చార్జీలు: మంత్రి పొన్నం**

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకులాలకు మెస్ చార్జీలను గ్రీన్ చానల్ ద్వారా అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. 2004–14 మధ్య మెస్ చార్జీలన్నీ గ్రీన్ చానల్ ద్వారా పేమెంట్ అయ్యేవని, కానీ 2014 తరువాత రెండేళ్ల వరకు మెస్ చార్జీలు రాక నాణ్యత కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాలు ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌లతోపాటు ఎంతో ఉన్నత స్థానాల్లో ఉన్న వారిని తయారు చేశాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తదితరులు మాట్లాడారు.

ఎవడైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తాడో అతనికి మంచి ప్రతిఫలముంటుంది. మేము అతనిని ఆజ్ఞాపించినపుడు, సులభతరమైన ఆజ్ఞనే ఇస్తాము.
– ఇస్లాం ధర్మం



సాక్షి
శుక్రవారం, 16 ఫిబ్రవరి 2024

# బంధం బలపడుతోంది!

ప్రధానమంత్రిగా తన రెండో విడత పదవీకాలం ముగిసిపోనున్న వేళ నరేంద్ర మోదీ చేస్తున్న తుది అంతర్జాతీయ పర్యటనల్లో ఒకటి గత రెండు మూడు రోజులుగా ఆసక్తి రేపుతోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో, ఆ వెంటనే ఖతార్‌లో సాగిన మోదీ పర్యటన ఘన విజయం సాధించిందనే చెప్పాలి. అబుదాబిలో స్వామి నారాయణ్ ఆలయ ప్రారంభోత్సవం, ఈ పర్యటనకు సరిగ్గా ఒక రోజు ముందే ఖతార్ నుంచి ఎనిమిది మంది భారత మాజీ నౌకాదళాధికారుల విడుదల, దుబాయ్‌లోని వరల్డ్ గవర్నమెంట్ సమిట్‌లో ఇతర దేశాలు చెవి ఒగ్గి మన మాట వినేలా చేయడంలో భారత విజయం... ఇవన్నీ ఛాతీ ఒకింత ఉప్పొంగే క్షణాలు. కృత్రిమ మేధ (ఏఐ), క్రిప్టో కరెన్సీ సహా పలు అంశాలపై ప్రపంచ దేశాల మధ్య సహకారానికి పిలుపునిస్తూ, ప్రపంచానికి ఇప్పుడు కావాల్సింది సమ్మిళిత, స్వచ్ఛ, పారదర్శక, పర్యావరణ హిత ప్రభుత్వాలని భారత ప్రధాని పేర్కొనడం సైతం ఆకర్షించిందనే చెప్పాలి. వెరసి, అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడితో భారత ప్రధానికి ఉన్న ప్రత్యేక అనుబంధం రెండు దేశాలనూ మరింత సన్నిహితం చేస్తోంది. నమ్మకమైన ఇలాంటి మిత్రదేశం చలవతో గల్ఫ్ ప్రాంతంలో భారత ప్రాబల్యం మరింత పెరగడం ఖాయమనిపిస్తోంది.

తాజా పర్యటనలో భాగంగా యూఏఈ రాజధాని అబుదాబిలో 'ఎహ్లాన్ మోదీ' (మోదీకి స్వాగతం) కార్యక్రమం అట్టహాసంగా సాగింది. అక్కడి పాలకులను ప్రశంసిస్తూ, ప్రవాస భారతీయులను ఉత్తేజపరుస్తూ ఆ కార్యక్రమాన్ని రూపొందించారు. ఆ హంగామా కానీ, ఆ మర్నాడు చేసిన భారీ హిందూ దేవాలయ ప్రారంభోత్సవం కానీ భారత్, గల్ఫ్‌సీమల మధ్య బలపడుతున్న బంధానికి ప్రతీకలే. చెప్పాలంటే, మన దేశం దృష్టిలో పశ్చిమాసియాకు ముఖద్వారం అబుదాబి. అందుకే 2015 ఆగస్టులో మోదీ తొలిసారిగా ఈ గల్ఫ్‌దేశాన్ని సందర్శించారు. 1981లో ఇందిరా గాంధీ అనంతరం భారత ప్రధాని ఒకరు అక్కడికి వెళ్ళడం అదే తొలిసారి. మూడు దశాబ్దాల పైచిలుకు తర్వాత మొదలుపెట్టినా అప్పటి నుంచి ఈ తొమ్మిదేళ్ళలో 7 సార్లు యూఏఈ వెళ్ళారు మోదీ. విస్తృత ద్వైపాక్షిక అజెండాకూ, ఇరు దేశాల మధ్య బలమైన బంధానికీ అది బలమైన పునాది అయింది. పనిలో పనిగా యూఏఈలోని ప్రవాస భారతీయుల దీర్ఘకాలిక వాంఛకు తగ్గట్టుగా హిందూ ఆలయ నిర్మాణానికి స్థలం కోరారు. ఆ దేశం అంగీకరించింది. సంప్రదాయవాద ఇస్లామిక్ దేశంలో, పూర్తిగా ఆ దేశ పాలకుల అండతో, 27 ఎకరాల విశాల ప్రాంగణంలో అత్యంత భారీ హిందూ దేవాలయ నిర్మాణం జరగడం, దాని ప్రారంభోత్సవానికి భారత ప్రధాని వెళ్ళడం అనూహ్యం, అసాధారణం.

ఇరుదేశాల మధ్య గాఢమైన బంధాన్ని పరస్పర ప్రయోజనాలు ప్రోది చేశాయి. యూఏఈలో దాదాపు 35 లక్షల మంది ప్రవాస భారతీయులున్నారని లెక్క. ఏడు దేశాల సమూహమైన యూఏఈ మన వాళ్ళకు ఉపాధి అందించే కేంద్రం. ఫలితంగా, అక్కడి నుంచి మన దేశానికి ధన ప్రవాహం సరేసరి. గల్ఫ్‌సీమకు సైతం మనం వాణిజ్యానికీ, వ్యూహాత్మకంగా నమ్మదగిన దేశమయ్యాం. వీటన్నిటి ఫలితంగా స్థానిక రాజకీయాలతో సంబంధం లేకుండా కొన్నేళ్ళుగా బంధం బలపడిందన్న మాట. అసలు పశ్చిమాసియాలోని వివిధ శక్తిసంపన్న దేశాలతో చారిత్రకంగా మన దేశానికి మంచి సత్సంబంధాలు ఉన్నాయి. సున్నీల ప్రాబల్యమున్న సౌదీ అరేబియా నుంచి షియాలు చక్రం తిప్పే ఇరాన్ వరకు అన్నీ మనకు మిత్రదేశాలే. ఆ మధ్య కొన్నేళ్ళుగా అరబ్ ప్రపంచానికీ, ఇజ్రాయెల్‌కూ మధ్య సర్దుబాటు చేసే క్రమంలో పశ్చిమాసియాతో మన బంధం మరింత దృఢమవుతూ వచ్చింది. ఇక, భారత్, ఇజ్రాయెల్, యూఏఈ, అమెరికాల మధ్య ఐ2యూ2 సాంకేతిక సహకారం నిమిత్తం 2022 జూలైలో అమెరికాతో కలసి మనం సంతకాలు చేశాం.

ఖతార్ సైతం భారత్‌లో గణనీయంగా పెట్టుబడులు పెడుతోంది. అంతేకాక, భారత్ చేసుకొనే ద్రవీకృత సహజవాయు (ఎల్ఎన్‌జీ) దిగుమతుల్లో సగభాగం ఖతార్ చలవే. పైగా రష్యా ఇంధనంపై ఆధారపడడాన్ని తగ్గించుకొనేలా ఒప్పందాల కోసం యూరప్ సైతం ఈ ప్రాంతం వైపు చూస్తున్న సమయంలో... భారత్ – ఖతార్‌ల మధ్య దీర్ఘకాలిక ఇంధన సరఫరా ఒప్పందం సంతోషదాయక విషయం. నిజానికి, 2022లోనే ఇరుదేశాలూ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేసి, 100 బిలియన్ డాలర్ల స్థాయికి చేర్చాలని బాస చేసుకున్నాయి. ఇంధనం, డిజిటల్ లావాదేవీలు సహా పలు అంశాలపై ఒప్పందాలు కుదరడం విశేషం. ఇక, ఇండియా – మధ్యప్రాచ్యం– యూరప్ ఆర్థిక నడవాకు సంబంధించి ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒడంబడిక అత్యంత కీలకమైనది. చైనా చేపట్టిన 'బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్'కు ప్రత్యామ్నాయమని భావిస్తున్న నడవాను గత సెప్టెంబర్‌లో ఢిల్లీలో జీ20 సదస్సు వేళ ప్రకటించారు. గాజాలో యుద్ధం కారణంగా దాని భవిష్యత్తుపై ప్రస్తుతం కొంత నీలినీడలు పరుచుకున్నా ఒక్కసారి అమలైతే ప్రాంతీయ అనుసంధానాన్ని అది పెంచుతుంది.

అబుదాబిలో దిగితే అచ్చం స్వదేశంలో ఉన్నట్టే ఉందని భారత ప్రధాని వ్యాఖ్యానించడం గమనార్హం. వినడానికి కాస్త అత్యుక్తిగా అనిపించినా, ఆ మాటల్లో వాస్తవం లేకపోలేదు. భారత్ – అరబ్ ఎమిరేట్స్ మధ్య సాంస్కృతికంగా, ఆర్థికంగా, భౌగోళిక రాజకీయాల పరంగా సత్సంబంధాల సంచిత ఫలితమది. ముస్లిమ్ మెజారిటీ దేశంలో ఒక అతి పెద్ద హిందూ ఆలయ నిర్మాణం పెరుగుతున్న ధార్మిక సహిష్ణుతకు చిహ్నమనే చెప్పాలి. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో ఆయుధాలు, సైనిక టెక్నాలజీల విషయంలోనూ గల్ఫ్, భారత్ కలసి అడుగులు వేస్తే మంచిది. పశ్చిమ హిందూ మహా సముద్రంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయి. పరస్పర వ్యూహాత్మక ప్రయోజనాలూ నెరవేరుతాయి.

# భద్రతా మండలిలో చోటుకు బదులు...

విశ్లేషణ



కె.పి. నాయర్

**ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశ హోదా కోసం భారత్ పావు శతాబ్ద కాలంగా విఫలయత్నం చేసింది. మండలి విస్తరణ జరిగినా చోటు దొరక్కపోతే మళ్లీ మరో పాతికేళ్ళు వృథా అవుతుంది. అందుకే ఆ ప్రయత్నాలను కొనసాగిస్తూనే, ప్రత్యామ్నాయంగా భిన్న దేశాల కూటములతో కలిసి పనిచేయాలన్న కచ్చితమైన నిర్ణయం భారత్ తీసుకుంది. ప్రపంచ సమస్యలపై ఎజెండాను రూపొందించడానికి ప్రయత్నిస్తోంది. 'ఐఎస్ఏ', 'సీడీఆర్ఐ' లాంటి సమూహాల స్థాపనకు చొరవ తీసుకోవడమే కాకుండా, వాటి కార్యాలయాలను ఢిల్లీలో ఏర్పాటు చేయించడంలో విజయం సాధించింది. క్వాడ్, ఐ2యూ2 లాంటి సమూహాలతో కూడా సాగుతూ భారత్ ప్రాభవాన్ని పెరిగేలా చూడటం మన దౌత్య పురోగతికి సంకేతం.**

దౌత్యపరంగా ప్రపంచంలోనే అత్యున్నత వేదిక అయిన భద్రతా మండలిలో శాశ్వత స్థానం కోసం భారత్ ఇక ఎదురుచూడటం లేదు. ఐక్యరాజ్యసమితి (ఐరాస)కి చెందిన అత్యంత ముఖ్యమైన ఈ విభాగంలో సమాన ప్రాతినిధ్య లక్ష్యం దిశగా పావు శతాబ్ద కాలంగా చేస్తూ వచ్చిన ప్రయత్నాలు పెద్ద పురోగతిని సాధించలేదు. భద్రతా మండలి విస్తరణలో కూడా మరో పాతికేళ్ళ కాలం భారత్ వంటి ఆశావహులను పక్కదారి పట్టించవచ్చనేది ఇప్పుడు కేంద్రప్రభుత్వానికి ఆందోళన కలిగిస్తోంది.

అందుకే, అంతుచిక్కని ఐక్యరాజ్యసమితి సంస్కరణల లక్ష్యం కోసం ఎదురుచూడకుండా ప్రపంచ వేదికపై తన పాద ముద్ర వేయడానికి, చిన్న చిన్న దేశాల సమూహాలతో కలిసి పనిచేయాలని నరేంద్ర మోదీ ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయం తీసుకుంది. భారత్ 37 బహుపాక్షిక సమూహాలలో చేరింది. అంతేకాకుండా, భద్రతా మండలికి బదులుగా ప్రపంచ సమస్యలపై ఎజెండాను రూపొందించడానికి ప్రయత్నిస్తోంది.

విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి. మురళీధరన్ ఫిబ్రవరి 8న రాజ్యసభలో మాట్లాడుతూ, ఈ బహుపాక్షిక సమూహాలు ''వాణిజ్యం, పెట్టుబడి, సాంకేతికత, రక్షణ సహకారం సహా అనేక రంగాలలో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి భారత్‌కు వీలు కల్పిస్తాయి. ఇలాంటి ఫలితాలు భారత్ జాతీయ అభివృద్ధి ఎజెండాకు దోహదం చేస్తాయి, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తాయి, మన ప్రజల శ్రేయస్సును మెరుగుపరుస్తాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను ముందుకు తెస్తాయి'' అని చెప్పారు.

ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ (ఐఎస్ఏ) అనేది భారత్ ఆలోచన. 2015లో ప్యారిస్‌లో జరిగిన 21వ వాతావరణ మార్పు సదస్సులో అప్పటి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హొలాండే అందించిన మద్దతు ఈ భావనను ఫ్రాంకో–ఇండియన్ ఉమ్మడి ప్రయత్నంగా మార్చింది. ఇది మోదీ ప్రభుత్వ మొట్టమొదటి బహుపాక్షిక చొరవ. కాబట్టి, ఇది ప్రారంభం కావడానికి కాస్త సమయం పట్టింది. అయితే ఐఎస్ఏ ప్రధాన కార్యాలయం ఢిల్లీలోని జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీటీ)లో ఉన్నందున ఇది భారత ప్రతిష్ఠను మరింతగా పెంచింది. అనేక దశాబ్దాలుగా మన దేశమే సమస్యగా ఉండటం కాకుండా, వాతావరణ మార్పుపై సమస్య–పరిష్కర్తగా మారేట్టు చేసి, భారత ఖ్యాతిని పెంచింది.

సీడీఆర్ఐ విషయానికి వస్తే, దానికి ఐఎస్ఏ లాగా అంత పేరు లేదు. ఇది 2019లో ఏర్పడిన కొత్త, ముఖ్యమైన భాగస్వామ్యం. ఇది వాతావరణానికి తట్టుకోగల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి... బహుపాక్షిక ఏజెన్సీలు, అభివృద్ధి బ్యాంకులు, ప్రైవేట్ రంగం, విద్యాసంస్థలతో కలిసి పనిచేయడానికీ ప్రభుత్వాలను ఒక చోటికి తీసుకువస్తుంది. 2016లో జరిగిన విపత్తు నష్టభయం తగ్గింపుపై జరిగిన ఆసియా మంత్రుల సదస్సులో మోదీ అటువంటి కూటమి ఆలోచనను ప్రతిపాదించారు. అయితే ఈ ఆలోచనను దాని భాగస్వాములు ఆమోదించడానికీ, సీడీఆర్ఐని రూపొందించడానికీ మరో మూడేళ్లు పట్టింది. సీడీఆర్ఐ ప్రధాన కార్యాలయం కూడా న్యూఢిల్లీలో ఉంది.



ఐఎస్ఏ ప్రారంభ సదస్సులో ఇతర దేశాల నేతలతో ప్రధాని మోదీ

అనేక దశాబ్దాలుగా, జెనీవా, నైరోబీ, వియన్నా వంటి మెట్రోలకు లాగే తన నగరాల్లో ఒకదానిని ఐక్యరాజ్యసమితి నగరంగా ప్రకటించాలని భారత్ ఆకాంక్ష. పైన పేర్కొన్న నగరాలు న్యూయార్క్‌కు అనుబంధ, ద్వితీయ ప్రధాన కార్యాలయంగా పని చేస్తాయి. ఇక్కడ ఐరాస వార్షిక జనరల్ అసెంబ్లీ వంటి అతి ముఖ్యమైన కార్యకలాపాలు సాగుతాయి. అయితే, భారత్ కోరుకున్నట్లు జరగలేదు. తన ప్రధాన నగరాల్లో ఒకదానిలో ప్రాంతీయ ఆర్థిక సంఘాన్ని నెలకొల్పేలా ఐరాసను భారత్ ఒప్పించలేకపోయింది. అడిస్ అబాబా, బ్యాంకాక్, బీరూట్, జెనీవా, శాంటియాగోలకు ఈ ఘనత లభించింది. అందువల్ల, భారత్‌లో సీడీఆర్ఐ, ఐఎస్ఏ కార్యాలయాలను నెలకొల్పటానికి వ్యవస్థాపక సభ్యదేశాలను ఒప్పించటం గొప్ప విషయం. నేడు ఈ రెండు సంస్థలు పెద్ద సంఖ్యలో భారతీయులకు ఉపాధి కల్పిస్తున్నాయి. న్యూఢిల్లీకి మకాం మార్చి, ఈ సంస్థలలో పని చేయడానికి విదేశాల నుంచి కూడా నిపుణులను రప్పించారు. జాతీయ రాజధాని ప్రాంతం ఈ సంస్థల నుండి అనుబంధ ప్రయోజనాలను పొందుతుంది. వారి ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ కార్యక్రమాల ద్వారా సమావేశాలు, ప్రదర్శనలకు న్యూఢిల్లీ ఒక ముఖ్యమైన వేదికగా ఎదుగుతుంది.

భారత్ సభ్యురాలిగా ఉన్న అతి ముఖ్యమైన బహుళజాతి సమూహం ఏదంటే నిస్సందేహంగా క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్. దీనిని సరళంగా క్వాడ్ అని పిలుస్తున్నారు. ఇది భారత్, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికాలను ఒకచోట చేర్చింది. క్వాడ్‌కు భారత్‌లో సంశయవాదులు మాత్రమే కాకుండా కొన్నిసార్లు తీవ్రమైన వ్యతిరేకులు కూడా లేకపోలేదు. కానీ భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ 'వై భారత్ మ్యాటర్స్' పుస్తకంలో, క్వాడ్ గురించి చాలా ముఖ్యమైన కానీ తరచుగా నిర్లక్ష్యం చేయబడిన అంశాన్ని పేర్కొన్నారు. భారత్‌కు 'ఇటీవలి కాలంలో చాలా స్పష్టంగా అభివృద్ధి చెందిన సంబంధం ఆస్ట్రేలియాతోనే' అని రాశారు. జైశంకర్ ప్రకారం, ఈ క్వాడ్ సభ్యదేశంతో పెరుగుతున్న సంబంధాలు ఇతర క్వాడ్ సభ్యదేశాలైన జపాన్, అమెరికాలతో సంబంధాలలో అంతరాన్ని తగ్గించాయి. అధికారిక అంచనా, ప్రజల అవగాహన రెండింటిలోనూ జపాన్, అమెరికాతో భారత్ సంబంధాలు చాలా ముఖ్యమైనవి.

జైశంకర్ వాదనను అంగీకరించినట్లయితే, బహుపాక్షిక క్వాడ్ నిజానికి సాధారణంగా అంగీకరించిన దానికంటే పెద్ద ద్వైపాక్షిక ప్రయోజనాన్ని అందిస్తోంది. గత సంవత్సరం, క్వాడ్ మొదటిసారిగా ఐరాస భద్రతా మండలి సంస్కరణపై అంతర్–ప్రభుత్వ చర్చలకు మద్దతు ఇచ్చింది. ఐక్యరాజ్యసమితిని వాస్తవానికి ఏర్పాటు చేయడానికి కారణమైన ప్రశంసనీయమైన లక్ష్యాలను అణచివేసే ప్రయత్నాలను అడ్డుకోవడానికి కలిసి పనిచేయడానికి అంగీకరించింది. జైశంకర్ ప్రకారం, క్వాడ్ 'రెండు దశాబ్దాలుగా కీలక సంబంధాలలో భారత దేశం సాధించిన పురోగతి సమాహారం'.

ఇండియా, ఇజ్రాయెల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలతో కూడిన 'ఐ2యూ2' కూటమి కూడా పూర్తిగా భారత్‌కు మాత్రమే ప్రయోజనం చేకూర్చింది. యూఏఈ పెట్టుబడులు, ఇజ్రాయెల్ నీటిపారుదల సాంకేతికతతో మధ్యప్రదేశ్‌లో ఫుడ్ పార్కుల నెట్‌వర్క్ స్థాపన జరిగింది. రెండో ఐ2యూ2 ప్రాజెక్ట్ అమెరికా నిధులతో గుజరాత్‌లో విద్యుదుత్పత్తి కోసం సౌరశక్తిని ఉపయోగించాలని భావిస్తోంది. అయితే, పశ్చిమాసియాలో పెరుగుతున్న సంఘర్షణ దృష్ట్యా కొత్త ఐ2యూ2 ప్రాజెక్ట్‌లు ముందుకు సాగడానికి చాలా సమయం పట్టనుండటం విచారకరం.

ఇలాంటి మరెన్నో సమూహాలకు కేంద్రంగా ఉంటున్న భారత్‌తో బహుళజాతి కార్యక్రమాలు, త్రైపాక్షికత పెరుగుతుండటం అనేవి భారతీయ దౌత్య పురోగతికి సంకేతం. భారత్, ఫ్రాన్స్, యూఏఈ తమ 'ఫోకల్ పాయింట్స్ గ్రూప్'ను 2022లో ఏర్పాటు చేశాయి. ఇది రక్షణ, విపత్తు నిర్వహణ నుండి ప్రాంతీయ అనుసంధానం, ఆహార భద్రత వరకు అనేక రంగాలలో పురోగమిస్తోంది. ఈ మోడల్ మాదిరిగానే భారత్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా కాలానుగుణంగా 'ఫోకల్ పాయింట్ల సమావేశాలను' నిర్వహిస్తున్నాయి. అంత మాత్రాన ఇదంతా భద్రతా మండలి శాశ్వత సభ్యత్వానికి వీడ్కోలు చెప్పడం కానే కాదు. కానీ ఫ్రెంచ్‌వారన్నట్లు 'మనం మళ్లీ కలిసేవరకు' కొనసాగుతాయని అర్థం.

వ్యాసకర్త వ్యూహాత్మక అంశాల విశ్లేషకుడు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### పెళ్లికి సిద్ధం



షి సెడ్ యెస్– ఆమె అవునని చెప్పింది. (పెళ్లికి తన స్నేహితురాలు జోడీ హేడన్ అంగీకరించిందనీ, తమ నిశ్చితార్థం జరిగిందనీ ఫొటో షేర్ చేశారు.)
– ఆంథోనీ అల్బనీస్, ఆస్ట్రేలియా ప్రధాని

### దేవుడికీ తప్పదా?



ఆఖరికి తండ్రిగా దేవుడు కూడా నిస్సహాయుడన్నమాట! ('మహాభారత్' ధారావాహికలో కృష్ణుడి పాత్ర పోషించిన నితీశ్ భరద్వాజ్... విడిగా ఉంటున్న భార్య తమ కుమార్తెలను చూడనివ్వకుండా మానసికంగా హింసిస్తోందని ఫిర్యాదు చేశారని వార్త.)
– దీపికా నారాయణ్ భరద్వాజ్, యాక్టివిస్ట్

### గైడ్లు దేవుళ్లా?



'పీహెచ్డీ ఇవ్వను' అని తన గైడ్ బెదిరించినట్టు ఒక మొదటి సంవత్సర పరిశోధక విద్యార్థి ఫిర్యాదు చేశాడు. అసలు గైడ్ పీహెచ్డీ ఇస్తాడని ఎందుకు అనుకుంటారో నాకు అర్థం కాదు. పీహెచ్డీ అనేది సాధించుకునేది, దానంగా ఇచ్చేది కాదు. ఈ 'హుజూర్' అనిపించుకునే జాడ్యం వల్లే... మనల్ని మనం దేవుని అవతారాలని అనుకుంటాం.
– అభిజిత్ మజుందార్, ఐఐటీ బాంబే ప్రొఫెసర్

### మోస్ట్ వాంటెడ్



ఇప్పటికే రామ్‌లల్లా 2024 సాధారణ ఎన్నికల్లో 400 సీట్ల సంగతి చూసుకున్నాడని అనుకున్నాను. మరెందుకు ఒకప్పుడు అవినీతి నేతలని దూషించినవాళ్లనే బీజేపీ గట్టిగా లాక్కునేందుకు ప్రయత్నిస్తోంది? ఈ లెక్కలో త్వరలో నేను కూడా వాళ్లకు కావాలి.
– మహువా మొయిత్రా, తృణమూల్ నేత

### మంచి తీర్పు




ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని గౌరవనీయ సుప్రీంకోర్టు సరైన తీర్పునిచ్చింది. ఇది ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతనూ, వ్యవస్థలో సమగ్రతనూ తెస్తుంది. ఈ తీర్పు ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడంతో పాటు, అన్ని రాజకీయ పార్టీలకూ సమాన అవకాశాన్ని కల్పించింది.
– ఎం.కె.స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి

### షుక్రియా, యూఏఈ!



ముస్లింల పట్ల సానుకూల, సహనశీల, సామరస్యపూర్వక ఇమేజ్ కలిగించేలా వ్యవహరించిన యూఏఈ స్థానికులు, పాలకులకు ధన్యవాదాలు (యూఏఈలో హిందూ ఆలయం ప్రారంభమైన నేపథ్యంలో.) అత్యధిక సున్నీ దేశాలు (ఖతార్, ఈజిప్ట్, టర్కీ, అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, మాల్దీవులు లాంటివి), అలాగే సున్నీ దేశం కాని ఇరాన్ దురదృష్టవశాత్తూ తమ క్షుద్ర దౌత్యం ద్వారా ముస్లింలకు అప్రతిష్ఠ తెస్తున్నాయి.
– యానా మీర్, జర్నలిస్ట్

### దొందూ దొందే



తాము అధికారంలోకి వస్తే కనీస మద్దతు ధర మీద స్వామినాథన్ నివేదికను అమలు చేస్తామని కాంగ్రెస్ అంటోంది. నివేదిక 2006లోనే సిద్ధంగా ఉంది. మరి మన్మోహన్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేదు? మోదీ ప్రభుత్వం 2022లో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామంది. ఆ వాగ్దానం ఏమైంది?
– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** శు.సప్తమి ప.2.38 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** భరణి ప.2.21 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.2.01 నుండి 3.34 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.49 నుండి 9.34 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.21 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.43 నుండి 11.16 వరకు, రథసప్తమి.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం: 5.57
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ఇన్ బాక్స్

## సైన్స్ సేవకుడు

సామాజిక రుగ్మతల నిర్మూలనకు సైన్సే అస్త్రంగా ముందుకు నడిచిన వైజ్ఞానిక గురువూ, విజ్ఞాన శాస్త్రమే ఊపిరిగా జీవించిన వ్యక్తి, జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ముంద్ర ఆదినారాయణ. ఆయన మృతి వైజ్ఞానిక సమాజానికి తీరనిలోటు. 'జన విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో జనగామలో జరిగిన 'చెకుముకి' సైన్స్ సంబరాల్లో ఆయన పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో సైన్సు చర్చలు జరిపారు. ఈ కార్యక్రమం మధ్యలోనే ఫిబ్రవరి 11వ తేదీన గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త సైన్స్ అభిమానులను దిగ్భ్రాంతికి గురిచేసింది. సూర్యాపేట జిల్లా నల్లబండ గూడెం ఆయన స్వస్థలం. ఉస్మానియా యూనివర్సిటీలో రసాయన శాస్త్ర ప్రొఫెసర్ పనిచేశారు.



ప్రొ॥ ముంద్ర ఆదినారాయణ

20 ఏళ్లుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచే జన విజ్ఞాన వేదికలో అనేక హోదాల్లో చురుగ్గా పనిచేశారు. 2016 నుంచి 2018 వరకు జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. సైన్స్ ప్రచార ఉద్యమానికి గొప్ప మార్గ నిర్దేశిగా ఉన్నారు. తెలుగు అకాడమీకి రసాయన, భౌతికశాస్త్రం పుస్తకాలు రాస్తూ, సంపాదకులుగా కూడా వ్యవహరించిన గొప్ప మేధావి. కృత్యాధార బోధన ద్వారా సైన్స్ పట్ల అభిరుచి కల్పించడానికి రాష్ట్రవ్యాప్తంగా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం మరిచిపోలేని జ్ఞాపకం. ప్రభుత్వ సహకారంతో 85 ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడమే దీనికి నిదర్శనం. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులచే విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కనబరిచేలా చేశారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి తపన పడిన ప్రొఫెసర్ ఆదినారాయణ వృద్ధాప్యాన్ని కూడా లెక్కచేయలేదు. అంతిమ శ్వాస వరకు నిజాయితీ, నిబద్ధతతో శాస్త్ర ప్రచార ఉద్యమానికి సమయాన్ని ఇచ్చి ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడుస్తూ వైజ్ఞానిక సమాజ నిర్మాణానికి నడుం బిగించాలి. అదే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి.

– సంపతి రమేష్ మహారాజ్, జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

# వాస్తవాలను గ్రహించి మెలగాలి

అభిప్రాయం



చాడ వెంకటరెడ్డి

రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లవుతున్నా రాజ్యాంగం వాగ్దానం చేసిన పీఠికలో పేర్కొన్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలతో పాటు ప్రాథమిక హక్కులు ప్రజలకు పరిపూర్ణంగా అందుబాటులోకి రాకపోవడం శోచనీయం. 2014లో ఎన్నికల సభలలో నరేంద్రమోదీ చేసిన ప్రసంగాలు, ఇచ్చిన హామీలు అమలుకాలేదు. ఈ మధ్య ఆయన చేస్తున్న ప్రసంగాలు మరోసారి ప్రజలను తప్పుతోవ్వ పట్టించే దిశగా సాగుతున్నాయి. వాటి సారాంశాన్నీ, వాస్తవాన్నీ ప్రజలు గ్రహించకపోతే మరింత గడ్డు రోజులు వచ్చే ప్రమాదం పొంచివున్నది.

విదేశాలలో పర్యటిస్తూ ప్రపంచంలోనే భారత దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల విలువ గల మూడవ అతి పెద్ద ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతామని ప్రగల్భాలు పలికారు ప్రధాని మోదీ. దేశానికి రూ. 168 లక్షల కోట్ల అప్పుతో 5 ట్రిలియన్ డాలర్ల సంపదను ఎలా సృష్టిస్తారు? మోదీ పదేళ్ల పాలనలో రూ. 110 లక్షల కోట్లు అప్పు చేశారంటే దేశాభివృద్ధి పట్ల ఎంత పట్టింపు ఉన్నదో విదితమవుతోంది. 60 సంవత్సరాల కాలంలో రూ. 50 లక్షల కోట్లు అప్పు అయితే... ఈ దశాబ్ద కాలంలో దాన్ని మూడింతలు చేయడమంటే దేశాన్ని ఉద్ధరించినట్లేనా? దేశంలో సగం శాతం ప్రజలు కటిక దరిద్రంలో వలస కార్మికులుగా జీవిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు కాని దుస్థితి ఉంది.

అన్ని రంగాలలో విఫలమైన మోదీ ప్రభుత్వం త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని 'రామరాజ్యా'న్ని స్థాపిస్తామనే నినాదంతో మరోసారి హిందుత్వ ఎజెండాను భుజానికి ఎత్తుకున్నది. 2014 సార్వత్రిక ఎన్నికలలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే లేదు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగితే ప్రేక్షకపాత్ర వహించడమేనా ప్రభుత్వ ఉద్ధరణ.

వ్యవసాయాన్ని నిర్వీర్యం చేయడానికి మూడు సాగు చట్టాలు తెచ్చిన నేపథ్యంలో అఖిలపక్ష రైతు



సంఘాలు 350 రోజులకు పైబడి సాగించిన ఉద్యమంలో 750 మంది రైతులు మరణించారు. ఉద్యమ తీవ్రత చూసి ప్రభుత్వం చట్టాల అమలును వాయిదా వేసింది. ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలుచేయకపోవడంతో రైతులు మళ్లీ ఢిల్లీ బాట పట్టడం చూస్తున్న దృశ్యమే.

ఇప్పటి వరకు ఇతర పార్టీ ఎంఎల్ఏలను తమ పార్టీలోకి ఫిరాయింప జేసుకొని బలం పెంచుకున్న మోదీ, అమిత్ షా ద్వయం ఇప్పుడు రూటు మార్చారు. ఏకంగా ప్రతిపక్ష పార్టీలనే చీల్చి, వారికి అనుకూలంగా ఉన్న చీలిక వర్గానికే ఆ పార్టీని కట్టబెడుతున్నారు.

మరో వైపు 'భారతరత్న' పురస్కారాన్ని కూడా తమ రాజకీయాలకు వాడుకుంటున్నారు. బాలరాముని ప్రాణప్రతిష్ఠకు అద్వానీని పిలవకపోవడంపై గుర్రుగా ఉన్న సంఘీయులను మచ్చిక చేసుకునేందుకు ఆయనకు 'భారతరత్న'ను ఇచ్చారు. అలాగే ఆర్ఎల్‌డీని తమ పంచకు చేర్చుకునేందుకు చౌధరీ చరణ్ సింగ్‌కు కూడా భారతరత్న ఇచ్చారు. జార్ఖండ్‌లో యూపీఏ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ విశ్వ ప్రయత్నం చేసింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రిగా ఉన్న హేమంత్ సోరేన్‌పై ఈడీని ఉసిగొల్పి అరెస్టు చేసి, సీఎం పదవి నుండి దింపింది. ఇంత చేస్తే ఆయన దగ్గర దొరికింది రూ. 36 లక్షలు, 8 ఎకరాల భూమి. వందల, వేల కోట్లు ఉన్న వారు మాత్రం బీజేపీలో చేరితే బారా ఖూన్ మాఫ్.

ప్రతిపక్షాలు 'ఇండియా' పేరుతో కూటమిగా ఏర్పడిన కొద్ది రోజులకే విడిపోవడం శోచనీయం. బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ వంటివారి ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా బీజేపీ దీని వెనుక ఉన్నది. అలాగే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరు, మరోవైపున పెద్దన్న పాత్ర వహించవల్సిన కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాలను కలుపుకు పోకపోవడం వంటివి బీజేపీకి ప్రయోజనం కలిగించే అంశాలు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలూ పరిస్థితులను సమీక్షించుకొని, 'ఇండియా' కూటమి బలోపేతానికి కృషి చేస్తేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని గుర్తించాలి.

వ్యాసకర్త సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

## అదే కాపాడుతుంది!

చేసిన ధర్మం వృథా పోదు. మనం చేసే ధర్మం మనల్ని కాపాడటంతోపాటు మన సంతతినీ కాపాడుతుందనేది భారతీయుల నమ్మకం. దీనికి ఈ కథే ఓ నిదర్శనం.

పేద రైతు రామయ్య దగ్గరకు నలుగురైదుగురు గ్రామస్థులు వచ్చారు. 'మన ఊరు చివర ఒక చెరువు తవ్వబోతున్నాం. తగినంత నిధులు లేకపోవడంతో ఊళ్ళో పది



జ్యోతిర్మయం

మందినీ కలిసి విరాళాలు అడుగుతున్నాం. ఈ క్రమంలోనే మీ వద్దకు కూడా వచ్చాం. మీకు చేతనైనంత ఇచ్చి మేము తలపెట్టిన కార్యక్రమానికి సహకరించండి. ఇది మీరు చేసే ధర్మం అనుకోండి' అన్నారు రామయ్యతో. అయితే ఆయన తన తాహతుకు తగ్గట్టు ఓ యాభై రూపాయలు మాత్రమే ఇచ్చాడు. అంత తక్కువ ఇస్తున్నందుకు ఎంతో సిగ్గు పడ్డాడు. కొంతకాలానికి ఆయన కాలం చేశాడు.

ఒక రోజు రామయ్య మనవడు తోటి పిల్లలతో కలిసి ఆటలు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఊరి పెద్దలు తవ్వించిన చెరువులో పడ్డాడు. అతడితో పాటూ ఉన్న పిల్లలు భయపడి ఆ సంగతి పిల్లవాడి తల్లిదండ్రులకు చెప్పడానికి ఊళ్లోకి పరుగు తీశారు. ఇంతలో అటువైపు వెళుతున్న ఓ వ్యక్తి పిల్లవాడిని నీటి నుంచి బయటకు తీశాడు. అప్పటికి మిగతా పిల్లల ద్వారా ప్రమాదం విషయం తెలిసిన పిల్లవాడి తల్లి ఏడుస్తూ చెరువు దగ్గరకు వచ్చింది. తన కుమారుడూ, అతణ్ణి రక్షించిన గ్రామస్థుడూ కనిపించడంతో పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లు సంతసించింది. 'ఏదో పెద్దలు చేసిన పుణ్యం ఈ రోజు మీ రూపంలో వచ్చి నా కొడుకుని కాపాడింది' అని గ్రామస్థునికి కృతజ్ఞతలు చెప్పి నమస్కరించింది. 'నిజమే నమ్మా. ఈ చెరువు తవ్వడానికి వాళ్ల తాత చేసిన ధర్మమే ఈ బాలుణ్ణి రక్షించింద'ని గ్రామస్థుడు నవ్వి వెళ్లిపోయాడు. ఇందులో వాస్తవం ఏదైనా నమ్మకం అలాంటిది మరి.

– యామిజాల జగదీశ్

# ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

కావడం. పరిమిత స్థాయిలో ఉండే వ్యక్తిగత విరాళాలను, అపరిమితమైన కార్పొరేట్ విరాళాలను ఒకే గాటన కట్టలేం. కార్పొరేట్ విరాళాలు స్వేచ్ఛాయుత ఎన్నికల ప్రక్రియకు విఘాతంగా మారాయి. కనుక సంస్థలు, కంపెనీల నుంచి పార్టీలకు అందే భారీ విరాళాలకు కారణాలను గోప్యంగా ఉంచడాన్ని అనుమతించరాదు''అని స్పష్టం చేసింది. కేవలం ఎన్నికలే ప్రజాస్వామ్యానికి ఆది, అంతం కావంటూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా రెండు విడి తీర్పులు రాశారు. పలువురు మాజీ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్లు కూడా తీర్పును సమర్థించడం విశేషం. ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా కూడా ఉన్నారు. తనతో పాటు జస్టిస్ గవాయ్ తరఫున సీజేఐ 152 పేజీల తీర్పు, తనతో పాటు న్యాయమూర్తులు జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మిశ్రాల తరఫున జస్టిస్ ఖన్నా 74 పేజీల తీర్పు వెలువరించారు.

### చాలా లోపాలున్నాయి...

ఎన్నికల బాండ్ల పథకాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత జయా ఠాకూర్ తదితరులు దాఖలు చేసిన నాలుగు పిటిషన్లపై ధర్మాసనం 2023 అక్టోబర్ నుంచి వాదనలు ఆలకిస్తూ వస్తోంది. ఈ పథకం రహస్య బ్యాలెట్ విధానం వంటిదేనని, విరాళాలిచ్చేవారి గోప్యనీయతను కాపాడుతుందని కేంద్రం చేసిన వాదన లోపభూయిష్టమని తాజా తీర్పులో ధర్మాసనం స్పష్టం చేసింది. బాండ్లను కొనుగోలు చేసేలా వ్యక్తులను, సంస్థలను ఈ పథకం ద్వారా ఒత్తిడి చేయవచ్చని పేర్కొంది. బాండ్‌పై దాత పేరుండదు గనుక అవి ఎవరి నుంచి వచ్చాయన్న ఆ విరాళాన్ని అందుకునే పార్టీకి కూడా తెలిసే అవకాశం లేదన్న కేంద్రం వాదననూ తోసిపుచ్చింది. ''ఈ పథకం లోపరహితం కాదు. విరాళాలు ఇచ్చిందెవరో పార్టీలు తెలుసుకునేందుకు అవకాశం కల్పించే లోపాలెన్నో ఇందులో ఉన్నాయి''అని స్పష్టం చేసింది. ''పౌరుల రాజకీయ విశ్వాసాలు, అభిప్రాయాలు ఏర్పరచుకోవడం వారి రాజకీయ వ్యక్తీకరణలో తొలి దశ. అందుకే పౌరుల రాజకీయ విశ్వాసాలకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) రక్షణ కల్పిస్తోంది. కానీ ఈ పథకం నిబంధనల ప్రకారం బాండ్ల కొనుగోలుదారుల వివరాలను ఓటర్లకు తెలియకుండా గోప్యంగా ఉంచుతారు. ఇది కల్పిస్తున్న రాజ్యాంగం కల్పిస్తున్న భావ ప్రకటన స్వేచ్ఛను ఉల్లంఘించడమే''అంటూ తప్పుబట్టింది. అంతేగాక కార్పొరేట్ సంస్థలు పార్టీలకు అపరిమితంగా విరాళాలు అందజేసేందుకు వీలు కల్పించేలా కంపెనీల చట్టంలోని నిబంధనను తొలగించడం ఆర్టికల్ 14 ద్వారా రాజ్యాంగం కల్పిస్తున్న సమానత్వపు హక్కుకు విరుద్ధమంది.

ఎన్నికల బాండ్ల పథకాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. 2019 ఏప్రిల్ 12 నుంచి ఇప్పటిదాకా దీనికింద కొనుగోలు చేసిన ఎన్నికల బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలను మార్చి 6కల్లా కేంద్ర ఎన్నికల సంఘానికి అందజేయాలని బాండ్ల జారీ అధీకృత సంస్థ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. ప్రతి బాండ్ ముఖ విలువ, కొనుగోలు తేదీ, కొనుగోలుదారు పేరు, తద్వారా పార్టీలవారీగా అందుకున్న విరాళాలు వంటి అన్ని వివరాలనూ పొందుపరచాలని పేర్కొంది. వాటన్నింటినీ మార్చి 13 కల్లా ఈసీ అధికారిక వెబ్‌సైట్‌లో అందరికీ అందుబాటులో ఉంచాలని నిర్దేశించింది. ఇంకా నగదుగా మార్చుకోని బాండ్లను సంబంధిత పార్టీ లు తిరిగి ఎస్‌బీఐలో జమ చేయాలని, సదరు మొత్తాలను కొనుగోలుదారు ఖాతాకు బ్యాంకు జమ చేయాలని ఆదేశించింది. పార్టీలు బాండ్ల ద్వారా అందిన విరాళాల వివరాలను ఈసీకి సీల్డ్ కవర్లో సమర్పించాలని 2019 ఏప్రిల్ 12న ధర్మాసనం మధ్యంతర తీర్పు వెలువరించడం తెలిసిందే.

### గోప్యత కీలకం: సీజేఐ

రాజకీయ పార్టీకి అందే విరాళాల గురించిన సమాచారం ఓటరుకు తెలియడం తప్పనిసరని సీజేఐ తన తీర్పులో పేర్కొన్నారు. అప్పుడే ఓటు హక్కును ప్రభావవంతంగా వినియోగించుకోగలడన్నారు. ''ఎన్నికల వ్యయంలో నల్లధనం కట్టడికి బాండ్లే ఏకైక మార్గం కాదు. దీనితో పోలిస్తే సమాచార హక్కు స్ఫూర్తికి గండి కొట్టని మెరుగైన ఇతర మార్గాలెన్నో ఉన్నాయి. అయితే అన్ని రాజకీయ విరాళాలనూ విధాన నిర్ణయాలను ప్రభావితం చేసే ప్రయత్నాలుగా చూడలేం. చట్టసభల్లో పెద్దగా ప్రాతినిధ్యం లేని పార్టీలకు కూడా విరాళాలందుతున్నాయి''అని ఆయన అభిప్రాయపడ్డారు. ''ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు, విధానాలను ప్రభావితం చేసేందుకు డబ్బు ఎంతో అవసరం. ఎన్నికల్లో ప్రజాస్వామికంగా పాల్గొనేందుకు కూడా డబ్బు కావాల్సిందే''అన్నారు. అయితే, ''వ్యక్తుల రాజకీయ విశ్వాసాలకు సంబంధించిన సమాచారాన్ని అసమ్మతిని అణచివేసేందుకు ప్రభుత్వం రాజకీయంగా వాడుకునే ఆస్కారముంది. అంతేగాక సదరు వ్యక్తులకు ఉద్యోగావకాశాల వంటివాటిని నిరాకరించే ప్రమాదం కూడా ఉంది. అంతేగాక అవి మెజారిటీ అభిప్రాయాలకు విరుద్ధంగా ఉండే పక్షంలో వారిపై ప్రతికూల ప్రభావం పడవచ్చు. అందుకే పౌరులకు తమ రాజకీయ విశ్వాసాలను గోప్యంగా ఉంచుకునే హక్కు చాలా ముఖ్యం''అని సీజేఐ అన్నారు. గోప్యత హక్కుకు రాజ్యాంగపరమైన రక్షణ ఉంటుందంటూ 9 మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. ''ఓటు ఎవరికేస్తున్నదీ గోప్యంగా ఉంచే హక్కు లేకుంటే పరిణామాలు దారుణంగా ఉంటాయి. తమకు వ్యతిరేకంగా ఓటేసేవారి ఓట్లను తొలగించేందుకు వాడుకునే ప్రమాదమూ ఉంది. నియోజకవర్గాలను కూడా ఓటర్ల రాజకీయ మొగ్గుదల ఆధారంగా విభజించే ఆస్కారముంది. అప్పుడు ఎన్నికల వ్యవస్థకే అర్థం లేకుండా పోతుంది''అని ఆందోళన వెలిబుచ్చారు. కాకపోతే ఈ గోప్యత హక్కును పార్టీలకు అందే విరాళాలకు కూడా వర్తింపజేయవచ్చా అన్నదే ప్రశ్న అని సీజేఐ చెప్పారు. పార్టీలకు ఆర్థిక విరాళాలకు కూడా రాజ్యాంగపరమైన రక్షణ ఉందా అన్న అంశంపై విచారణ జరపాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

**క్విడ్ ప్రో కోకు ఆస్కారం:** పార్టీలకు భారీగా ఆర్థిక విరాళాలిచ్చే వారి ఉద్దేశమేమిటన్నది బహిరంగ రహస్యమేనని సీజేఐ అన్నారు. సాధారణంగా కార్పొరేట్ విరాళాల ఉద్దేశం క్విడ్ ప్రో కో ప్రయోజనాలేనన్న వాదనతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా విభేదించలేదని గుర్తు చేశారు. రాజకీయ సమానత్వానికి మన దేశంలో రాజ్యాంగ రక్షణ ఉన్నా ఆ విషయంలో ఇప్పటికీ అసమానత కొనసాగుతూనే ఉందని సీజేఐ ఆవేదన వెలిబుచ్చారు. ''రాజకీయ నిర్ణయాలను ప్రభావితం చేయడంలో వ్యక్తుల సామర్థ్యంలో అసమానతలున్నాయి. ఆర్థిక అసమానతలే అందుకు కారణం. పార్టీలకందే ఆర్థిక సాయాన్ని కూడా ఈ అసమానతలు నియంత్రిస్తున్నాయి. సంపన్నులకు పార్టీలకు భారీ ఆర్థిక విరాళమిచ్చే సామర్థ్యముంటుంది. తద్వారా ప్రజాప్రతినిధులకు దగ్గరయ్యేందుకు, ప్రభుత్వ విధాన నిర్ణయాలను ప్రభావితం చేసేందుకు కూడా అవకాశముంటుంది. ఇది వారికి కావాల్సిన లైసెన్సులివ్వడమో, వారికి అనుకూలమైన విధాన నిర్ణయాలు తీసుకోవడమో జరిగే ఆస్కారముంది. ఇలా క్విడ్ ప్రో కో జరిగే అవకాశముంది'' అన్నారు. రాజకీయ సమానత్వాన్ని పాటించే సమాజంలో పౌరులందరికీ రాజకీయ ప్రక్రియను ప్రభావితం చేసే విషయంలో సమానంగా గళమెత్తే అవకాశం కీలకమని సీజేఐ అభిప్రాయపడ్డారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేయడానికి జస్టిస్ ఖన్నా తన తీర్పులో పలు కారణాలను ఉటంకించారు.

### ఈ తీర్పుపై ఎవరేమన్నారంటే..

''ఈ తీర్పు ద్వారా నల్లధన మార్పిడి వ్యవస్థను సుప్రీంకోర్టు రద్దు చేసింది. కేంద్రం ఇప్పటికైనా ఇలాంటి మతిలేని ఆలోచనలు కట్టిపెడుతుందని ఆశిస్తున్నా. ఎన్నికల బాండ్ల పథకం కింద 95 శాతం నిధులు ఒక్క బీజేపీకే అందాయి''
– కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

''మోదీ ప్రభుత్వ అవినీతి విధానాలకు ఇది మరో నిదర్శనం. ఎన్నికల బాండ్లను లంచాలు, కమీషన్లు తీసుకునే మార్గంగా బీజేపీ మార్చుకుంది. దీనికి సుప్రీంకోర్టు తెర దించింది''
– కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ

''ఎన్నికల బాండ్లు సదుద్దేశంతో తెచ్చిన పథకం. విపక్షాలు దీన్ని అనవసరంగా రాజకీయం చేస్తున్నాయి. అయితే సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తున్నాం''
– బీజేపీ

''తీర్పును స్వాగతిస్తున్నాం. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత తెచ్చేందుకు ఇదెంతగానో దోహదపడుతుంది''
– ఆమ్ ఆద్మీ పార్టీ

''పాలక పార్టీ లబ్ధి కోసం తీసుకొచ్చిన అక్రమ పథకానికి సుప్రీంకోర్టు తీర్పు తెర దించింది''
– సీపీఎం

''తీర్పును స్వాగతిస్తున్నాం. ఎన్నికల బాండ్లు అప్రజాస్వామికం, రాజ్యాంగవిరుద్ధం''
– సీపీఐ (ఎంఎల్)

''ఇది గత ఆరేడేళ్లలో వెలువడ్డ చరిత్రాత్మక తీర్పు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని ఈ తీర్పు పునరుద్ధరిస్తుంది.
– కేంద్ర మాజీ ఎన్నికల ప్రధానాధికారి ఎస్‌వై ఖురేషీ

''తీర్పు స్వాగతించదగ్గదే. అయితే ఎన్నికల నిధుల వ్యవస్థ ప్రక్షాళనకు చేయాల్సింది చాలా ఉంది''
– కేంద్ర మాజీ ఎన్నికల ప్రధానాధికారి ఎస్.గోపాలస్వామి

### క్లుప్తంగా...

## కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయండి

**కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల లేఖ**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేంద్ర ప్రభుత్వానికి గురువారం లేఖ రాశారు. తెలంగాణలోని 27 జిల్లాలలో మొత్తం 2,233 ఎకరాలలో కొబ్బరి సాగు అవుతుండగా, ఏడాదికి 94.92 లక్షల కాయల ఉత్పత్తి జరుగుతోందని లేఖలో పేర్కొన్నారు. ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,358 ఎకరాలలో, ఖమ్మం జిల్లాలో 586 ఎకరాలలో కొబ్బరి సాగుచేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొబ్బరి సాగు విస్తరణ, అభివృద్ధి కార్యకలాపాలను చూసేందుకు హైదరాబాద్‌లో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఉండేదని, రాష్ట్ర విభజన తర్వాత ఆ కార్యాలయం ఏపీలోని విజయవాడకు మార్చినట్టు తెలిపారు. ఏపీలోని కార్యాలయమే తెలంగాణలో సేవలందిస్తోందన్నారు. రాష్ట్రంలో కొబ్బరి సాగుకి అనుకూలమైన సూక్ష్మ వాతావరణ పరిస్థితులు ఉన్నాయని, అవసరమైన ప్రోత్సాహం, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక సహాయం అందించడంమొదలైన విషయాలలో రైతులకు చేయూత అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం తెలంగాణలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే రాష్ట్రంలో కొబ్బరి సాగు విస్తరణ, అభివృద్ధి వేగంగా జరుగుతుందని లేఖలో పేర్కొన్నారు. కాగా, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల రైతులు తమ ప్రాంతంలో కొబ్బరి పరిశ్రమ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని మంత్రికి విజ్ఞప్తి చేయడంతో ప్రాంతీయ కార్యాలయం ఏర్పా టు కోసం తుమ్మల కేంద్రానికి లేఖ రాశారు.

## 'ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహం నెలకొల్పాలి'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై నెలకొల్పాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. వీరనారి ఐలమ్మ పోరాటస్ఫూర్తి మలిదశ తెలంగాణ ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందని, అలాంటి మహనీయురాలిని సముచితంగా గౌరవించుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

## సాగర్‌లో ముగిసిన ఎన్డీఎస్‌ఏ పర్యటన

నాగార్జునసాగర్: నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నేతృత్వంలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), సీఎస్ఎంఆర్ఎస్, ఆంధ్ర, తెలంగాణ ఇంజనీర్ల బృందం నాగార్జునసాగర్ ప్రాజెక్టు సందర్శన గురువారం ముగిసింది. వీరంతా మంగళ, బుధవారాల్లో సాగర్ డ్యాం స్పిల్‌వే, విద్యుదుత్పాదన కేంద్రాలను సందర్శించారు. గురువారం ఎడమ కాల్వను సందర్శించాల్సి ఉంది. కానీ నిపుణులు చాలామంది నాగార్జునకొండను సందర్శించిన అనంతరం బుధవారం రాత్రి వెళ్లిపోయారు. కొందరు నిపుణులు ఉదయాన్నే బుద్ధవనాన్ని సందర్శించారు. అనంతరం విజయవిహార్‌లోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆంధ్ర, తెలంగాణ ఇంజనీర్లతో మాట్లాడారు. జలాశయంలో ఎంతమేరకు నీరున్నప్పుడు ఎడమకాల్వ కు సాగునీటిని విడుదల చేసే అవకాశముందో అడిగి తెలుసుకున్నారు. ఎడమ కా ల్వపై గల విద్యుదుత్పాదన కేంద్రానికి జలాశయంలో నీటిమట్టం ఏమేరకు ఉంటే విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా నీటిని విడుదల చేస్తారో అడిగి తెలుసుకున్నారు.

## గాయత్రి సుగర్స్‌కు రైతుల తాళం

- క్రషింగ్ జాప్యంపై నిరసన

**మెట్‌పల్లి:** జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని గాయత్రి చక్కెర కర్మాగారం కార్యాలయానికి గురువారం మల్లాపూర్ మండలం రాఘవపేట రైతులు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన సుమారు 20 మంది చెరుకు రైతులం కర్మాగారంతో ఒప్పందం కుదుర్చుకుని 22 ఎకరాల్లో పంట పండించామని తెలిపారు. చెరకును క్రషింగ్‌కు తరలించడానికి ఒప్పందం ప్రకారం కూలీలతో కటింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ విషయంలో కర్మాగారం యాజమాన్యం జాప్యం చేస్తున్నందుకు నిరసనగా తాళం వేశారు. మరో పది రోజుల్లో క్రషింగ్ ప్రక్రియ ముగిసే అవకాశముందని, చెరకును కటింగ్ చేయకుంటే ఆర్థికంగా నష్టపోవలసి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. యాజమాన్యం స్పందించి కటింగ్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.

## ఎల్లిగడ్డల పంట చోరీ



దొంగలు చోరీ చేసిన ఎల్లిగడ్డ చేను

**శంకరపట్నం:** ఎల్లిగడ్డ ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో కొందరు దొంగల కన్ను ఆ పంట చేలపై పడింది. దీంతో బుధవారం రాత్రి ఎల్లిగడ్డలు చోరీ చేశారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కన్నాపూర్‌లో జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన గుండవేణి శంకర్ తన పొలంలో ఇతర పంటలతో పాటు వెల్లుల్లి సాగు చేస్తున్నాడు. బుధవారం రాత్రి కొందరు దొంగలు చేలో పడ్డారు. సుమారు రూ.40 వేల విలువైన క్వింటా ఎల్లిగడ్డలను చోరీ చేశారు. దీంతో బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## గుండెపోటుతో తొమ్మిదేళ్ల బాలుడి మృతి



హర్షిత్ (ఫైల్)

**జగిత్యాలక్రైం:** తొమ్మిదేళ్లకే ఓ బాలుడికి నూరేళ్లు నిండిపోయాయి. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన బాలె హర్షిత్ (9) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన బాలె గంగాధర్, శిరీష దంపతులకు ఇద్దరు కుమారులు. మూడురోజుల క్రితం కుటుంబసభ్యులందరూ కలిసి తిరుపతి శ్రీవారి దర్శనానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పెద్ద కుమారుడు హర్షిత్ అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్థానిక వైద్యులకు చూపించి చికిత్స చేయించారు. గురువారం ఇంటికి చేరుకున్న తర్వాత మళ్లీ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. హర్షిత్ ఓ ప్రైవేటు స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్నాడు. ఇప్పటివరకు హర్షిత్‌కు ఎలాంటి అనారోగ్యం లేదని తల్లిదండ్రులు తెలిపారు. చిన్న వయసులోనే హర్షిత్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## కవి, రచయిత నల్లెల్ల రాజయ్య కన్నుమూత



నల్లెల్ల రాజయ్య (ఫైల్)

హన్మకొండ కల్చరల్: వరంగల్ నగరానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, కవి, రచయిత, పౌర స్పందన వేదిక ప్రధాన కార్యదర్శి, నల్లెల్ల రాజయ్య (62) కన్నుమూశారు. తీవ్ర అనారోగ్యానికి గురైన రాజయ్య వారం రోజులుగా హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం ఉదయం గుండెపోటుతో మరణించారు. రాజయ్యకు భార్య సుగుణమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వరంగల్ రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా రాజయ్య అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ మట్టి పాటలు (తెలంగాణోద్యమ గేయాలు), తెలంగాణ జంగ్-2009, 2010, ఆశయాల పందిరి తదితర రచనలు చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

## పని చేయలేని వాళ్లు తప్పుకోండి

**వచ్చే ఎన్నికల్లో ఎక్కువ ఎంపీ సీట్లు గెలవాలి**

- విజయ సంకల్ప రథయాత్రల సక్సెస్ ద్వారానే ఇది సాధ్యం
- ఈ యాత్రల్లో చురుగ్గా పనిచేయలేని వాళ్లు పదవుల నుంచి వైదొలిగితే మంచిది
- బీజేపీ శ్రేణులతో కిషన్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహిస్తున్న విజయసంకల్పరథ యాత్రల విజయవంతం ద్వారా పార్టీ అత్యధిక సీట్లను గెలుచుకునే అవకాశముందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని మెజారిటీ లోక్‌సభ సీట్లలో పార్టీ గెలవాలంటే నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. గురువారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో విజయసంకల్పయాత్రలో పాల్గొనబోయే సభ్యులను ఉద్దేశించి కిషన్‌రెడ్డి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో... ఈ యాత్ర ప్రాధాన్యతను గుర్తించి అందరూ కష్టపడి పనిచేయాలని లేని పక్షంలో పార్టీకి నష్టం జరిగే అవకాశాలున్నాయని హెచ్చరించారు. ఈ యాత్రల్లో చురుగ్గా పనిచేయలేమని భావించే వారు తమ బాధ్యతల నుంచి తప్పుకోవాలని సూచించారు. పార్టీ లక్ష్యాలకు అనుగుణంగా, జాతీయ నాయకత్వం ఆదేశాలను తు.చ. తప్పకుండా అమలు చేస్తూ పనిచేయాలనుకునే వారే బాధ్యతలు, పదవుల్లో కొనసాగాలని స్పష్టం చేశారు.

**చాయ్ టిఫిన్ పేరిట నేతలతో కిషన్ భేటీ**

గురువారం ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌రావు, ఆదిలాబాద్ జిల్లా పార్టీ నేతలతో కిషన్‌రెడ్డి సమావేశమయ్యారు. చాయ్-టిఫిన్ పేరిట ఏర్పాటు చేసిన ఈ భేటీలో ఈ నెల 20న బాసర సరస్వతీ మాత ఆలయంలో పూజల అనంతరం భైంసాలో మొదలుపెట్టనున్న విజయసంకల్పయాత్ర ఏర్పాట్ల అంశం చర్చకు వచ్చినట్టు తెలిసింది. బంజారాల ఆరాధ్యదైవం సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి కిషన్ రెడ్డి నివాళులర్పించారు.

## పెళ్లికి పిలుస్తలేరు.. చావుకు చెప్తలేరు..

- పంచాయితీ పెద్దలు చెబితే వినలేదని..
- ఏడాదిగా ఆ కుటుంబానికి కుల బహిష్కరణ
- కరీంనగర్ జిల్లా లింగాపూర్‌లో ఘటన



కుల బహిష్కరణకు గురైన సంపత్ కుటుంబం

మానకొండూర్ రూరల్: ఊరిలో ఆ కులానివి దాదాపు 50 గడపలు. శుభ కార్యమైనా.. అశుభ కార్యమైనా అందరూ కలసికట్టుగా హాజరవుతారు. అయితే పంచాయితీ పెద్దలు చెప్పినట్లు వినలేదని, వారి తీర్పును తిరస్కరించారని కులం నుంచి ఓ కుటుంబాన్ని బహిష్కరించారు. ఏడాదికాలంగా గ్రామంలో పెళ్లయినా, చావైనా వీరిని పిలవడం లేదు. బాధిత కుటుంబం కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన మాదాసు సంపత్ కుటుంబానికి ఊరిలో వారసత్వంగా వచ్చిన 1.03 ఎకరాల వ్యవసాయ భూమి అతని తండ్రి కొమురయ్య పేరున ఉంది. 2014లో సంపత్ తండ్రి కొమురయ్య మరణించాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన అడప శ్రీనివాస్ ఆ భూమి విషయంలో సంపత్‌తో గొడవకు దిగాడు. స్థానిక కోర్టుకు వెళ్లడంతో తీర్పు సంపత్‌కు అనుకూలంగా వచ్చింది. దీంతో తమ భూమిని సాగు చేసేందుకు అతను వెళ్లాడు. అయితే అడప శ్రీనివాస్, సంపత్‌ను అడ్డుకుని.. దాడి చేశాడు. గొడవ పెద్దది కావడంతో ఇరువురూ పోలీసుస్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఈ విషయమై ఇద్దరూ ఏడాది క్రితం గ్రామంలోని పంచాయితీ పెద్దలను ఆశ్రయించారు. వారు ఇరువర్గాలు రూ.50 వేలు డిపాజిట్ పెట్టాలని సూచించారు. సంపత్ తనవద్ద అంత మొత్తం లేవని, రూ.5 వేలు మాత్రమే ఇచ్చాడు. దీంతో తాము చెప్పినట్లు వినలేదని పంచాయితీ పెద్దలు సంపత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటినుంచి వారి కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. గ్రామంలోని తమ కులస్తులు ఏడాదికాలంగా తమను ఎలాంటి కార్యాలకు పిలవకపోవడంతో మనోవేదనకు గురవుతున్నట్లు సంపత్ కుటుంబం వెల్లడించింది. కుల బహిష్కరణ చేసిన 11 మంది పంచాయితీ పెద్దలపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని ఆయన ఇటీవల సీపీ కార్యాలయంలోనూ ఫిర్యాదు చేశాడు.

## కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలు

- కేసీఆర్‌పై క్రిమినల్ కేసు పెట్టాలి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

**వేములవాడ రూరల్:** రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం విషయంలో కేసీఆర్‌పై క్రిమినల్ కేసు పెట్టాలని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యంతోనే మేడిగడ్డకు ఈ దుస్థితి పట్టిందని, ఈ అంశంపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందన లేదని అన్నారు. కాళేశ్వరం అవినీతిపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు డ్రామాలాడుతున్నాయని విమర్శించారు. బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర గురువారం సిరిసిల్ల పట్టణంతోపాటు తంగళ్లపల్లి, వేములవాడ అర్బన్ మండలాల్లో కొనసాగింది. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మేడిగడ్డ కుంగుబాటుపై కేసీఆర్ సహా ఇతర బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్లానింగ్, డిజైన్, నిర్వహణ విషయంలో రాష్ట్రాన్ని 20 అంశాలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సంస్థలు వివరణ కోరితే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 11 అంశాలకే వివరణ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాగా, ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇచ్చిన హామీలను పార్లమెంట్ ఎన్నికల కోడ్ రాకముందే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లాకు రూ.1,408 కోట్ల కేంద్రం నిధులు తెచ్చినట్లు ఆయన తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు సైతం బలహీనంగా ఉన్నాయన్నారు. ఈ బ్యారేజీల్లో సైతం మేడిగడ్డ తరహాలో సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. బీజేపీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రాణి రుద్రమ, దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ తదితరులు బండి సంజయ్ వెంట ఉన్నారు.

## పూర్వగిరీశుడి ఆలయంలో అధ్యయనోత్సవాలు



అధ్యయనోత్సవాల్లో భాగంగా తిరుమంజనం నిర్వహించి పారాయణం పఠిస్తున్న వేద పండితులు, ఆచార్యులు

**యాదగిరిగుట్ట:** యాదాద్రి పుణ్యక్షేత్రానికి అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం అధ్యయనోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా తిరుమంజన మహోత్సవాన్ని వైభవంగా జరిపారు. సాయంత్రం ఆలయంలో తొళక్కం నిర్వహించారు. అనంతరం దివ్య ప్రబంధ సేవా కాలంలో పారాయణికులు పారాయణాన్ని నిర్వహించారు. అధ్యయనోత్సవాలను ఈ నెల 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆచార్యులు తెలిపారు.

## సమ్మక్కకు ముస్లిం కుటుంబం బంగారం కానుక



**శంకరపట్నం:** సమ్మక్క–సారలమ్మ జాతర సమీపిస్తోన్న నేపథ్యంలో కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కరీంపేటకు చెందిన ఓ ముస్లిం కుటుంబం గురువారం సమ్మక్క–సారలమ్మ వనదేవతలకు ఎత్తుబంగారం కానుకగా ఇచ్చింది. మహమ్మద్ సర్దార్, షబానా దంపతుల కొడుకు షాన్‌వాజ్ పేరిట ఎత్తు బంగారం తూకం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తమకు కొడుకు పుడితే మేడారం సమ్మక్కకు ఎత్తుబంగారం ఇస్తామని మొక్కుకున్నట్లు తెలిపారు. ఈనెల 22న మేడారంలో జరిగే సమ్మక్క జాతరకు కుటుంబసమేతంగా వెళ్లి మొక్కులు చెల్లించుకుంటామని వివరించారు.

# ఏమిటీ ఎలక్టోరల్ బాండ్లు..!

ఎన్నికల బాండ్లు.. పార్టీలకు విరాళాలిచ్చేందుకు ఉద్దేశించిన ప్రామిసరీ నోట్ల వంటి పత్రాలు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం 2018లో ఈ ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. భారతదేశానికి చెందిన వ్యక్తులు/సంస్థలు ఎవరైనా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాలూకు ఎంపిక చేసిన శాఖల్లో వీటిని కొనుగోలు చేసి తమకు నచ్చిన పార్టీకి విరాళంగా ఇవ్వవచ్చు. ఇవి రూ.1,000, రూ.10 వేలు, రూ.లక్ష, రూ.కోటి ముఖవిలువతో ఉంటాయి. జారీ అయిన 15 రోజుల్లోపు వీటిని నగదుగా మార్చుకోవాలి. లేదంటే ఆ మొత్తం ప్రధాని జాతీయ రిలీఫ్ ఫండ్‌కు వెళ్తుంది. బాండ్ల కొనుగోలుపై సంఖ్య పరిమితేమీ లేదు. ఒక్కరు ఎన్ని బాండ్లైనా కొనవచ్చు. పైగా తమ వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచవచ్చు. బాండ్లపై వారి పేరు తదితర వివరాలేవీ ఉండవు. బ్యాంకు వాటిని ఎవరికీ వెల్లడించదు. పార్టీలు రూ.20 వేలకు మించిన నగదు విరాళాల వివరాలను విధిగా బయట పెట్టాల్సి ఉంటుంది. కానీ ఈ బాండ్ల విషయంలో అలాంటి నిబంధనేదీ లేదు. ఎంత పెద్ద మొత్తం విరాళంగా అందినా వివరాలను ఈసీతో పాటు ఎవరికీ వెల్లడించాల్సిన పని లేదు. ఇది పారదర్శకతకు పాతరేయడమేనన్నది ప్రజాస్వామ్యవాదుల ప్రధాన అభ్యంతరం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్నింటికీ బాండ్లు సేకరించే అవకాశమున్నా ఇది ప్రధానంగా అధికార పార్టీలకే బాగా ఉపయోగపడుతుందన్న వాదనలున్నాయి. ఎన్నికల బాండ్ల పథకం నిబంధనలు పౌరుల సమాచార హక్కు చట్టానికే విరుద్ధమని సుప్రీంకోర్టులో హోరాహోరీగా వాదనలు జరిగాయి. చివరికి ఈ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు గురువారం తీర్పు చెప్పింది.

**ఇవీ అభ్యంతరాలు**

- బాండ్ల కొనుగోలుదారులతో సహా అన్ని వివరాలూ గోప్యంగా ఉంటాయి. ఇది పారదర్శకతకు గొడ్డలిపెట్టు.
- భారీగా విరాళాలిచ్చే కార్పొరేట్ సంస్థలు సదరు పార్టీ అధికారంలోకి వచ్చాక దాని నుంచి భారీగా అనుచిత లబ్ధి పొందే ఆస్కారం చాలావరకు ఉంటుంది. ఇది క్విడ్ ప్రో కోకు దారి తీస్తుంది.
- పైగా ఈ బాండ్లతో అధికార పార్టీలకే అధిక ప్రయోజనం. దేశవ్యాప్తంగా అత్యధిక బాండ్లు వాటికే అందుతుండటమే ఇందుకు నిదర్శనం.
- మొత్తం ప్రక్రియలో ఎవరి పేరూ బయటికి రాదు గనుక వ్యక్తులకు, సంస్థలకు అనుచిత లబ్ధి చేకూర్చేందుకు అధికార పార్టీలు ఇలా బాండ్ల ముసుగులో లంచాలు స్వీకరించే ఆస్కారం కూడా పుష్కలంగా ఉంది.
- పైగా ఈ నిధులను ఎన్నికల కోసమే వాడాలన్న నిబంధనేమీ లేదు. దాంతో వాటిని పార్టీలు తమ ఇష్టానికి ఖర్చు చేసుకోవచ్చు.
- దేనిపై వెచ్చించాయన్న వివరాలు కూడా ఎవరికీ చెప్పాల్సిన అవకాశం లేదు.
- ఈ పథకం నల్లధనాన్ని మార్చుకునే పరికరంగా కూడా మారింది.
- దీనికి తోడు బాండ్ల కొనుగోలుదారుల వివరాలను తెలుసుకునే అవకాశం అధికార పార్టీలకు ఉంటుంది.
- తద్వారా సదరు వ్యక్తులను, కంపెనీలను వేధించే ప్రమాదమూ ఉంది.



**అత్యధిక వాటా బీజేపీదే**

ఎన్నికల బాండ్ల పథకం ద్వారా 2018 మార్చి నుంచి 2024 జనవరి దాకా రూ.16,518.11 కోట్ల విలువైన 28,030 బాండ్లు జారీ అయ్యాయి. వీటిలో పార్టీలన్నింటికీ కలిపి రూ.12,000 కోట్లకు పైగా విరాళాలందాయి. ఎన్నికల సంఘం, అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) గణాంకాల ప్రకారం ఇందులో ఏకంగా సగానికి పైగా, అంటే 55 శాతం బీజేపీ వాటాయే కావడం విశేషం. బాండ్ల ద్వారా ఆ పార్టీకి రూ.6,566 కోట్లు సమకూరాయి. బీజేపీ మొత్తం ఆదాయంలో సగానికి పైగా బాండ్ల రూపేణా సమకూరినదే. బాండ్ల ద్వారా కాంగ్రెస్ పార్టీకి రూ.1,123 కోట్లు రాగా ఇతర పార్టీలన్నింటికీ కలిపి రూ.5,289 కోట్లు అందాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

## అమెరికాలో కాల్పులు.. ఒకరి దుర్మరణం

### 22 మందికి గాయాలు

**కాన్సాస్ సిటీ:** అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రం కాన్సాస్ సిటీలో కాల్పులు చోటు చేసుకున్నాయి.. ఈ ఘటనలో ఒకరు చనిపోగా 8 మంది చిన్నారులు సహా మరో 22 మంది గాయాలపాలయ్యారు. బుధవారం సూపర్ బౌల్ చాంపియన్ షిప్ గెలుచుకున్న జట్టు విజయోత్సవాలు జరుపుతున్న వేళ గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులకు దిగారు. దీంతో జనమంతా భయంతో కేకలు వేస్తూ తలోదిక్కుకు పరుగులు తీయడంతో అంతా గందరగోళంగా మారింది. కాల్పులకు కారకులుగా అనుమానిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కాల్పులకు కారణాలు తెలియాల్సి ఉంది.

**మరో ఘటనలో..**

రాజధాని వాషింగ్టన్‌లో బుధవారం ఉదయం పోలీసు అధికారులు జంతు హింస కేసులో జూలియస్ జేమ్స్ అనే వ్యక్తికి వారెంట్లు ఇచ్చేందుకు అతడి ఇంటికి వెళ్లారు. నిందితుడు పారిపోయేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అతడు ఇంట్లో ఉండే పోలీసులపైకి కాల్పులకు దిగాడు. ఘటనలో ముగ్గురు అధికారులకు గాయాలయ్యాయి. కొన్ని గంటల అనంతరం నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

# రైతు ఉద్యమం ఉధృతం

**మూడో రోజుకు చేరిన ఢిల్లీ చలో**

- ఢిల్లీ సరిహద్దుల వద్ద వేలాదిగా రైతులు, పోలీసులతో ఘర్షణ
- నేడు భారత్ బంద్‌కు పిలుపు
- సంఘాలతో కేంద్రం చర్చలు

**న్యూఢిల్లీ:** పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయడం సహా పలు డిమాండ్ల సాధనకు రైతులు చేపట్టిన 'చలో ఢిల్లీ' మరింత ఉధృతమైంది. ఢిల్లీ సమీపంలో శంభు, టిక్రి సరిహద్దుల వద్ద పోలీసుల బారికేడ్లు, ఇనుపకంచెలు, సిమెంట్ దిమ్మెలను దాటేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. పోలీసుల భాష్పవాయు గోళాలు, జలఫిరంగుల దాడితో పరిస్థితి చాలా ఉద్రిక్తంగా మారింది. ఉద్యమం మొదలై మూడురోజులవుతున్నా అటు రైతులు, ఇటు కేంద్ర ప్రభుత్వం పట్టువిడవడం లేదు. పంజాబ్, హరియాణాల మధ్యనున్న శంభు సరిహద్దు వద్ద వేలాదిగా రైతులు సంఘటితమయ్యారు. టిక్రి, సింఘు, కనౌరీ బోర్డర్ పాయింట్ల వద్దా అదే పరిస్థితి కనిపించింది. వారిని నిలువరించేందుకు మరింతగా బాష్పవాయుగోళాలు అవసరమని ఢిల్లీ పోలీసులు నిర్ధారించారు. 30,000 టియర్‌గ్యాస్ షెల్స్‌కు ఆర్డర్ పెట్టారు. గ్వాలియర్‌లోని బీఎస్ఎఫ్ టియర్ స్మోక్ యూనిట్ వీటిని సరఫరా చేయనుంది. ఘాజీపూర్ సరిహద్దు వద్ద సైతం పోలీసులు మొహరించారు. చండీగఢ్‌లో రైతు సంఘాల నేతలు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్, శర్వాణ్ సింగ్ పాంథెర్, ప్రభుత్వ ప్రతినిధులైన వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి అర్జున్ ముండా వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్, హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ మధ్య గురువారం రాత్రి మూడో దఫా చర్చలు మొదలయ్యాయి. చర్చల్లో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సైతం పాల్గొన్నారు. వాటిలో తేలిందనేది ఇంకా వెల్లడి కాలేదు. సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం)లో భాగమైన భారతీయ కిసాన్ యూనియన్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా రైతులు నేడు గ్రామీణ భారత్ బంద్‌ను పాటించనున్నారు. ''రైతులెవ్వరూ శుక్రవారం నుంచి పొలం పనులకు వెళ్లొద్దు. కార్మికులు సైతం ఈ బంద్‌ను భాగస్వాములవుతున్నారు. ఈ రైతు ఉద్యమంలో ఎంతగా భారీ సంఖ్యలో జనం పాల్గొంటున్నారో ప్రభుత్వానికి అర్థమవుతుంది'' అని భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్ అన్నారు. భారత్‌బంద్ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు హరియాణాలోని నోయిడాలో కర్ఫ్యూ విధించారు. పలు జిల్లాల్లో 17వ తేదీ దాకా టెలికాం సేవలను నిలిపేస్తూ హరియాణా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రైతులు సైన్యంలా ఢిల్లీ ఆక్రమణకు వస్తున్నారంటూ బీజేపీ పాలిత హరియాణా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు పంజాబ్‌లోనూ శుక్రవారం దాకా ఇంటర్నెట్ సేవలను నిలిపేస్తున్నట్లు కేంద్ర హోం శాఖ ప్రకటించింది.



గురువారం పటియాలాలోని శంభు వద్ద రైలు పట్టాలపై బైఠాయించిన రైతులు

**పట్టాలపై బైఠాయింపు**

నిరసనల్లో భాగంగా గురువారం రైతులు రైల్ రోకో కూడా నిర్వహించారు. పంజాబ్, హరియాణా సరిహద్దుల్లో అతి పెద్దదైన రాజాపురా రైల్వే జంక్షన్ వద్ద వందలాది మంది రైతులు పట్టాలపై బైఠాయించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా రైళ్ల రాకపోకలను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. చాలా రైళ్లను దారి మళ్లించగా కొన్నింటిని రద్దు చేశారు.

## మీ నమ్మకాన్ని పొందటం నాకు గర్వకారణం

**రాయ్‌బరేలీ ఓటర్లకు సోనియా భావోద్వేగ లేఖ**



**న్యూఢిల్లీ:** దశాబ్దాలుగా రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి విజయం సాధిస్తూ ప్రస్తుతం వయోభారం కారణంగా ప్రజాసభను వదిలి ఎగువ సభకు తన రాజకీయ పథాన్ని మార్చుకుంటున్న కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తన నియోజకవర్గ ఓటర్లకు భావోద్వేగంతో ఒక లేఖ రాశారు. ''నేనిప్పుడు ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి మీరే కారణమని గర్వంగా చెబుతా. మీ వల్లే, మీరు నాపై ఉంచిన నమ్మకం వల్లే నా శక్తిమేరకు మీకు సేవచేయగలిగాను. అనారోగ్యం, వయోభారం సమస్యల కారణంగా ఇక మీదట లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయదల్చుకోలేదు. ఈ నిర్ణయం తర్వాత ప్రత్యక్షంగా మీకు సేవచేసే అవకాశం నాకు లేదని తెలుసు. కానీ నా మనసు నిండా మీరే ఉన్నారు. గతంలోలాగే ఇక మీదట కూడా మీరు నాకు, నా కుటుంబానికి అండగా నిలబడతారని తెలుసు'' అని హిందీలో సోనియా ఓటర్లకు ఒక సందేశం పంపారు. ''మీరు లేకుండా ఢిల్లీలో నా కుటుంబం సంపూర్ణం కాదు. రాయ్‌బరేలీకి వచ్చి మిమ్మల్ని కలిసినప్పుడే మొత్తం కుటుంబం అనే భావన కలుగుతోంది. మీ బంధం దశాబ్దాలనాటిది. నా అత్తగారి నుంచే నేనీ బంధాన్ని వారసత్వంగా పొందా. రాయ్‌బరేలీతో నా కుటుంబ బంధం బలంగా పెనవేసుకుంది. నా మామగారు ఫిరోజ్ గాంధీ స్వాతంత్ర్య సిద్ధించాక తొలి సార్వత్రిక ఎన్నికల్లో ఇదే రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభలో అడుగుపెట్టారు. ఆ తర్వాత ఇందిరా గాంధీని ఆశీర్వదించి లోక్‌సభకు పంపారు. జీవితంలో ఎన్ని ఎత్తుపల్లాలు ఎదురైనా తోడుగా నిలిచి బంధాన్ని మరింత పటిష్టం చేశారు. అత్తను కోల్పోయినప్పుడు, భర్తను కోల్పోయినప్పుడూ మీ చెంతకొచ్చిన నన్ను ఆదరించి అక్కున చేర్చుకున్నారు. ఇంతటి మద్దతు, ప్రోత్సాహాన్ని జీవితంలో మరువను. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో గడ్డుపరిస్థితులు ఎదురైనా మీరు నావెంటే నడిచారు. నా కంటే పెద్దవారికి ధన్యవాదాలు, యువతకు ప్రేమాశీస్సులు. త్వరలోనే మిమ్మల్ని కలుస్తా' అని సోనియా తన సందేశం పంపారు. రాజస్తాన్ నుంచి రాజ్యసభకు నామినేషన్ దాఖలుచేసిన మరుసటి రోజు సోనియా తన నియోజకవర్గ ప్రజలను గుర్తుచేసుకుంటూ లేఖ రాయడం గమనార్హం. సోనియా కుమార్తె ప్రియాంక గాంధీ ఈసారి రాయ్‌బరేలీ నుంచి సార్వత్రిక సమరంలో నిలబడతారని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.



గురువారం దోహాలో ఖతార్ ఎమీర్ హమద్ అల్ తానీతో ప్రధాని మోదీ

## భారత్, ఖతార్ బంధం సుదృఢం

**ఖతార్ ఎమీర్, మోదీ ద్వైపాక్షిక చర్చలు**

**దోహా:** భారత్, ఖతార్ దేశాల బంధం మరింత బలోపేతం అవుతోందని ప్రధాని మోదీ ప్రకటించారు. ఖతర్ పర్యటనలో ఉన్న మోదీ గురువారం ఖతార్ ఎమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్–థానీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. గూఢచర్యం ఆరోపణలపై అరెస్టయి శిక్షలు పడిన ఎనిమిది మంది మాజీ భారతీయ నావికాదళ అధికారులకు ఖతార్ ప్రభుత్వం విడిచిపెట్టిన నేపథ్యంలో ఖతార్ పాలకునితో మోదీ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ''ఎమీర్‌ను కలవడం అద్భుతం. ఇరుదేశాల మధ్య భిన్నరంగాల్లో విస్తృతస్థాయి సహకారానికి ఈ భేటీ బాటలు పరుస్తోంది. పర్యావరణానికి ప్రయోజనం చేకూర్చే నూతన రంగాల్లో కలిసి పనిచేసేందుకు భారత్, ఖతార్ సిద్ధంగా ఉన్నాయి'' అని భేటీ తర్వాత మోదీ 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు.

**నేవీ అధికారులను విడిచిపెట్టినందుకు థాంక్యూ**

'ఇరు నేతల చర్చలు ఫలవంతమయ్యాయి. ఖతార్‌లోని భారతీయుల సంక్షేమ బాధ్యతలు తీసుకున్న ఖతార్ ఎమీర్‌కు మోదీ ధన్యవాదాలు చెప్పారు. కఠిన శిక్షలు పడిన 8 మంది మాజీ భారతీయ నావికాదళ అధికారులను వదిలిపెట్టినందుకు ఖతార్ ఎమీర్‌కు మోదీ థాంక్యూ చెప్పి మెచ్చుకున్నారు. భారత్‌లో పర్యటించాల్సిందిగా ఆయనను మోదీ ఆహ్వానించారు'' అని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ ఖ్వాత్రా వెల్లడించారు.

## ట్రంప్ కంటే బైడెన్ నయం: పుతిన్

**మాస్కో:** తెంపరితనం, దూకుడుకు మారుపేరైన డొనాల్డ్ ట్రంప్‌తో పోలిస్తే జో బైడెన్‌ను మరోసారి అమెరికా అధ్యక్షుడిగా చూడాలనుకుంటున్నానని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆశాభావం వ్యక్తంచేశారు. రష్యా అధికారిక టీవీ ఛానెల్‌కు బుధవారం ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో పుతిన్ పలు అంశాలపై మాట్లాడారు. ''రాబోయే అమెరికా ఎన్నికల్లో ఎవరు అధ్యక్షుడు అయినా వారితో రష్యా ప్రభుత్వం కలిసి పనిచేస్తుంది. రష్యా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే ట్రంప్ కంటే బైడెన్ గెలిస్తేనే మంచిదని అనుకుంటున్నా. ఎందుకంటే ఉపాధ్యక్షుడిగానూ, అధ్యక్షుడిగానూ పనిచేసిన బైడెన్‌కు అనుభవం ఎక్కువ. పాతకాలం విధానాలను అవలంబించే నేత ఆయన. ఆయనను కొంత అంచనావేయొచ్చు కూడా. ట్రంప్ ఆలోచనలు అనూహ్యం' అని అన్నారు. బైడెన్ ఆరోగ్యం సరిగా లేదంటూ వస్తున్న వార్తలపై పుతిన్‌ను ప్రశ్నించగా.. 'నేనేమీ డాక్టర్‌నుకాదు. అయినా ఇలాంటి ప్రశ్నకు వ్యాఖ్యలు చేయడం సబబు కాదు. అయితే బైడెన్ ఆరోగ్య సమస్యలు వచ్చే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రభావం చూపగలవు. నేను గమనించినంత వరకు బైడెన్ ఆరోగ్యంగానే ఉన్నారు. అధ్యక్షుడిగా కొనసాగే సత్తా ఆయనకు లేదు అని నేనైతే అనుకోను. పేపర్ వైపు చూసే ప్రసంగం చదువుతారనేది వాస్తవం. నేను కూడా కొన్ని సార్లు ప్రసంగపాఠాన్ని చూసే చదువుతా. అదేమంత పెద్ద విషయం కాదు. ఏదేమైనా బైడెన్ ప్రభుత్వ విధానాలు చాలా తప్పు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనతోనే చెప్పా'' అని పుతిన్ వెల్లడించారు.

## టీఎంసీ ఎంపీ మిమి చక్రవర్తి రాజీనామా



**కోల్‌కతా:** ప్రముఖ బెంగాలీ నటి, టీఎంసీ ఎంపీ మిమి చక్రవర్తి పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు చెప్పారు. రాజకీయాలు తనకు ఇష్టం లేని అంశమని చెప్పారు. జాదవ్‌పూర్ నుంచి మొదటిసారిగా లోక్‌సభకు ఎన్నికైన మిమి గురువారం టీఎంసీ చీఫ్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీని రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో కలిశారు. ఈ నెల 13వ తేదీనే పదవికి రాజీనామా లేఖను పంపినట్లు అనంతరం తెలిపారు. తనకు రాజకీయాలు పడవని అనుభవం ద్వారా తెలుసుకున్నానని చెప్పారు. అయితే, రాజీనామాను సీఎం మమత అంగీకరించిందీ లేనిదీ మిమి తెలుపలేదు. టీఎంసీ అంగీకరించాక నిబంధనల మేరకు లోక్‌సభ స్పీకర్‌కు రాజీనామా లేఖను అందజేస్తానన్నారు. మరికొద్ది నెలల్లోనే లోక్‌సభ ఎన్నికలు జరగనుండగా ఈ పరిణామం చోటుచేసుంది.

## మూత్రం నుంచి విద్యుత్

**పాలక్కడ్:** కాలుష్యకారక శిలాజ ఇంధనాలకు బదులు పునరుత్పాదక ఇంధనంపై ప్రపంచం దృష్టిపెట్టాలన్న ఆకాంక్షల నడుమ ఐఐటీ పాలక్కడ్ పరిశోధకులు పునరుత్పాదక ఇంధనాన్ని మూత్రం నుంచి ఉత్పత్తిచేసి ఔరా అనిపించారు. సంబంధిత పరిశోధనా పత్రాన్ని ప్రముఖ ఆన్‌లైన్ జర్నల్ 'సపరేషన్ అండ్ ప్యూరిఫికేషన్ టెక్నాలజీ'లో ప్రచురించారు. ఈ పునరుత్పాదక విద్యుత్ తయారీ కోసం వారు కొత్తగా ఎలక్ట్రో కెమికల్ రిసోర్స్ రికవరీ రియాక్టర్(ఈఆర్ఆర్ఆర్)ను తయారుచేశారు. ఇందులో మూత్రాన్ని నింపి ఎలక్ట్రోరసాయనిక చర్యల ద్వారా విద్యుత్‌ను, సహజ ఎరువును ఉత్పత్తి చేస్తారు. ఈ విద్యుత్‌తో స్మార్ట్‌ఫోన్లను చార్జ్‌చేయొచ్చు. విద్యుత్ దీపాలను వెలిగించవచ్చు. రీసెర్చ్ స్కాలర్ వి.సంగీత, ప్రాజెక్ట్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీజిత్ పీఎం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్‌లో రీసెర్చ్ అసోసియేట్ రీను అన్నా కోశీల బృందం ఈ పరిశోధన చేపట్టింది. ఈఆర్ఆర్ఆర్ ద్వారా నైట్రోజన్, ఫాస్పరస్, మెగ్నీషియంలు ఎక్కువగా ఉండే సహజ ఎరువునూ పొందొచ్చని ఐఐటీ పాలక్కడ్ ఒక ప్రకటనలో పేర్కొంది. అమ్మోనియా సంగ్రహణి, క్లోరినేషన్ గది, ఎలక్ట్రికల్ గొట్టాల సమన్వయంతో ఈ రియాక్టర్ పనిచేస్తుంది. ఇందులో మెగ్నీషియంను ఆనోడ్‌గా, గాలి కార్బన్‌ను కాథోడ్‌గా వాడతారు. థియేటర్లు, షాపింగ్ మాల్స్ ప్రాంగణాల్లో మూత్ర విసర్జన ఎక్కువ. ఇలాంటి చోట్ల ఈ రియాక్టర్ల ద్వారా ఎక్కువ స్థాయిలో విద్యుత్‌ను ఉత్పత్తిచేసి అక్కడి విద్యుత్‌దీపాలను వెలిగించవచ్చు. ప్రస్తుతం ఈ సాంకేతికత ప్రయోగ దశలోనే ఉందని ఐఐటీ పాలక్కడ్ స్పష్టంచేసింది. ఈ టెక్నాలజీపై పేటెంట్ కోసం బృందం ఇప్పటికే దరఖాస్తు చేసుకుంది. ప్రాజెక్టుకు కేంద్రమే నిధులిచ్చింది.


## గెలిచింది నేను కాదు, నాకొద్దీ సీటు

**నిజాయితీ చాటుకున్న పాక్ ప్రావిన్షియల్ ఎన్నికల విజేత**

**కరాచీ:** ఎన్నికల పందేరంలో కోట్లు పంచైనా సరే ఓట్లు ఒడిసిపట్టాలనే నేతలున్న ఈ కాలంలో నువ్వే గెలిచావని ఎన్నికల సంఘం చెబుతున్నా ఒక పాకిస్తాన్ నేత 'నాకు ఇలాంటి గెలుపు వద్దే వద్దు' అని తెగేసి చెప్పారు. రిగ్గింగ్‌కు పాల్పడటం ద్వారా తనను గెలిపించారని, వాస్తవానికి విజేత వేరే ఉన్నారని కుండబద్దలు కొట్టారు. సంక్షుభిత పాకిస్తాన్‌లో ఇటీవల జరిగిన జాతీయ ఎన్నికలతోపాటు నాలుగు ప్రావిన్షియల్(అసెంబ్లీ) ఎన్నికలు జరిగాయి. వాణిజ్య రాజధాని కరాచీ నగరంలో పీఎస్–129 నియోజకవర్గం నుంచి జామాతే ఇస్లామీ పార్టీ అభ్యర్థి హఫీజ్ ఉర్ రెహ్మాన్ పోటీకి నిలబడ్డారు. అవినీతి కేసుల్లో జైలుపాలైన మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్తాన్ తెహ్రీకే ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ నేత, స్వతంత్ర అభ్యర్థి సైఫ్ బారీ కూడా ఇదే స్థానంలో బరిలో నిల్చారు. సైఫ్‌కు 31,000 ఓట్లు రాగా, రెహ్మాన్‌కు 26,000 ఓట్లు పడ్డాయి. అయితే పీటీఐ నేతను ఎలాగైనా అడ్డుకోవాలనే లక్ష్యంతో కొందరు రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. సైఫ్‌కు కేవలం 11,000 ఓట్లు పడ్డట్లు ఫలితాల్లో వచ్చేలా చేశారు. ఇదే ఫలితాలను పాక్ ఎలక్షన్ కమిషన్ అసలైనవిగా భావించి రెహ్మాన్‌ను విజేతగా ప్రకటించింది. రిగ్గింగ్ విషయం తెల్సి రెహ్మాన్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రత్యేకంగా పత్రికా సమావేశం పెట్టిమరీ తన ధర్మాగ్రహాన్ని వ్యక్తంచేశారు. ''అన్యాయంగా నన్ను ఎవరైనా గెలిపించాలనుకుంటే అందుకు నేను అస్సలు ఒప్పుకోను. ప్రజాతీర్పును గౌరవించాల్సిందే. విజేతనే గెలవనివ్వండి. రెండో స్థానంలో ఉన్న అభ్యర్థి ఓటమిని చవిచూడాల్సిందే. అలాంటి వారికి ఎక్స్‌ట్రాలు అక్కర్లేదు. నేను ఈ గెలుపును స్వీకరించట్లేను. విజేతకే విజయం దక్కాలి'' అని అన్నారు. రెహ్మాన్ నిజాయతీ చూసి అక్కడి వాళ్లు మెచ్చుకున్నారు. అయితే ఈ ఉదంతంపై పాక్ ఎన్నికల సంఘం మరోలా స్పందించింది. ''రిగ్గింగ్ అవాస్తవం. ఇలాంటి ఫిర్యాదులపై దృష్టి పెడతాం'' అని పేర్కొంది. ఈ ఘటనపై త్వరలోనే స్పందిస్తామని పీటీఐ తెలిపింది.

## నేషనల్ కాన్ఫరెన్స్ యూ టర్న్

- సొంతంగా పోటీ చేస్తామన్న ఫరూక్ అబ్దుల్లా
- అలాంటిదేమీ లేదన్న ఒమర్



**శ్రీనగర్:** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీని కలిసికట్టుగా ఎదుర్కొనే లక్ష్యంతో ఏర్పాటైన ఇండియా కూటమి నుంచి ఒక్కో పార్టీ దూరమవుతున్న వేళ మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. జమ్మూకశ్మీర్‌లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా బరిలోకి దిగుతుందని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) చీఫ్ ఫరూక్ అబ్దుల్లా గురువారం ప్రకటించారు. కొద్దిసేపటికే పార్టీ నేత, ఫరూక్ అబ్దుల్లా కుమారుడు ఒమర్ అబ్దుల్లా అలాందేమీ లేదంటూ ప్రకటించారు. ఇండియా కూటమిలోనే కొనసాగుతామని జమ్మూకశ్మీర్‌లోని ఎంపీ స్థానాల్లో పోటీపై భాగస్వామ్య పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. కశ్మీర్‌లోని అతిపెద్ద పార్టీ అయిన ఎన్‌సీ ఇండియా కూటమితోపాటు ప్రాంతీయ గుప్కార్(పీఏజీడీ) అలయెన్స్‌లోనూ కీలకంగా ఉంది.

## రైతు పోరాటం దేశం కోసమే: రాహుల్



**ఔరంగాబాద్:** దేశ సరిహద్దులను కాపాడేందుకు సైనికులు పోరాడుతున్నట్లే రైతులు కూడా దేశం కోసమే ఆందోళనలు సాగిస్తున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పంటలకు కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయడం, రుణ మాఫీ వంటి డిమాండ్ల సాధనకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో' ఆందోళనలపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఢిల్లీలో నిరసనలు తెలుపుతున్న రైతులపైకి టియర్ గ్యాస్, పెల్లెట్లను ప్రయోగిస్తున్నారు. రబ్బర్ బుల్లెట్లు తగిలి ముఖమంతా గుర్తు పట్టలేని విధంగా మారిపోయిన ఓ రైతు నన్ను కలిశారు. మీరు చేస్తోంది తప్పు కాదు. సరిహద్దుల్లో సైనికుల్లాగా మీరు కూడా దేశం కోసం పోరాడుతున్నారు' అని ఆయనకు ధైర్యం చెప్పానన్నారు. తాము అధికారంలోకి వస్తే మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించారు. రాహుల్ యాత్ర గురువారం బిహార్‌లోని ఔరంగాబాద్ జిల్లాలో సాగింది.

## మహువా మొయిత్రాకు ఈడీ సమన్లు



**న్యూఢిల్లీ:** విదేశీ మారకద్రవ్య (ఫెమా) నిబంధనల ఉల్లంఘన కేసులో టీఎంసీ నేత, లోక్‌సభ మాజీ సభ్యురాలు మహువా మొయిత్రాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం సమన్లు జారీ చేసింది. లోక్‌పాల్ నమోదు చేసిన కేసులో ప్రాథమిక విచారణలో భాగంగా వాంగ్మూలం నమోదు చేసేందుకు ఈ నెల 19వ తేదీన ఢిల్లీలోని తమ కార్యాలయానికి రావాలని ఆమెను కోరింది. అదానీ గ్రూప్, ప్రధాని మోదీ లక్ష్యంగా పార్లమెంట్‌లో ప్రశ్నలు సంధించినందుకు వ్యాపారవేత్త హీరానందాని నుంచి ఆమె ప్రతిఫలం అందుకున్నారని, జాతీయ భద్రతను సైతం ఆమె పట్టించుకోలేదంటూ బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే ఆరోపణలు చేయడం తెలిసిందే. ఇదే అంశంపై డిసెంబర్‌లో ఆమె లోకసభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. తానెలాంటి తప్పిదానికి పాల్పడలేదని, కేంద్రం కావాలనే ఇలాంటివన్నీ చేస్తోందని మహువా మొయిత్రా ఆరోపిస్తున్నారు.

## అజిత్ వర్గమే అసలైన ఎన్‌సీపీ: స్పీకర్

**ముంబై:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ)లోని అజిత్ పవార్ వర్గమే అసలైన ఎన్‌సీపీ అని మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ ప్రకటించారు. 2023 జూలైలో పార్టీలో చీలిక అనంతరం అనర్హత వేటు వేయాలంటూ అజిత్ పవార్, శరద్ పవార్ వర్గాలు పరస్పరం అందజేసిన పిటిషన్లను సైతం ఆయన కొట్టిపారేశారు. ఈ విషయాన్ని గురువారం ఆయన మీడియా ఎదుట ప్రకటించారు. 2023 జూలైలో ఎన్‌సీపీ నుంచి వేరుకుంపటి పెట్టుకున్న అజిత్ పవార్ తన వర్గంతో కలిసి శివసేన–బీజేపీ ప్రభుత్వంలో చేరడం, డిప్యూటీసీఎంగా ప్రమాణం చేయడం తెలిసిందే. అజిత్ పవార్ వర్గమే అసలైన ఎన్‌సీపీ అంటూ కేంద్ర ఎన్నికల సంఘం సైతం ఇటీవల ప్రకటించారు.

## సోరెన్‌కు 22 వరకు జ్యుడీషియల్ కస్టడీ

**రాంచీ:** జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్‌సోరెన్‌కు ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. హేమంత్ సోరెన్‌ను గురువారం కోర్టులో హాజరుపరచగా భూ కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈ నెల 22వ తేదీ వరకు కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారని న్యాయవాదులు తెలిపారు. అనంతరం ఆయన్ను అధికారులు రాంచీలోని బిర్సా ముండా సెంట్రల్ జైలుకు తరలించారన్నారు. జనవరి 31వ తేదీన హేమంత్ సోరెన్ సీఎం పదవికి రాజీనామా చేసిన వెంటనే ఈడీ అదుపులోకి తీసుకుంది.

## 17 నుంచి బీజేపీ జాతీయ మండలి భేటీ

**న్యూఢిల్లీ:** రానున్న లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈ నెల 17వ తేదీ నుంచి రెండు రోజులపాటు ఢిల్లీలో పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశాలు జరగనున్నాయి. భారత్ మండపంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రారంభిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ ఆఫీస్ బేరర్లు, కేంద్రమంత్రులు, సిట్టింగ్, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు సహా మొత్తం 11,500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు. రెండో రోజు ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని వివరించారు.

## అమెరికాలో మరో భారతీయుడి హత్య



**వాషింగ్టన్:** అమెరికాలో భారతీయుల వరస మరణాలు అక్కడి భారతీయుల్లో గుబులు రేపుతున్నాయి. కాలిఫోర్నియా రాష్ట్రంలో కేరళ కుటుంబం మొత్తం సొంతింట్లో మరణించిన వార్త మరువకముందే మరో హత్యోదంతం అమెరికాలో వెలుగుచూసింది. అలబామా రాష్ట్రంలో రహదారి వెంట హోటల్‌ను నడుపుకుంటున్న 76 ఏళ్ల ప్రవీణ్ రావూజీభాయ్ పటేల్‌ను అద్దె గది కోసం వచ్చిన ఒక కస్టమర్ కాల్చి చంపారు. ఫిబ్రవరి ఎనిమిదో తేదీన జరిగిన ఈ ఘటన తాలూకు పూర్తి వివరాలను షెఫీల్డ్ పట్టణ పోలీస్ ఉన్నతాధికారి రిక్కీ టెర్రీ గురువారం వెల్లడించారు. షెఫీల్డ్ పట్టణంలో హిల్‌క్రెస్ట్ మోటెల్ పేరుతో ఒక హోటల్‌ను ప్రవీణ్ సొంతంగా నిర్వహిస్తున్నారు. ఆ హోటల్‌కు 35 ఏళ్ల విలియం జెరిమీ మోరే అనే వ్యక్తి వచ్చి రూమ్ కావాలని ప్రవీణ్‌ను అడిగాడు. కొద్దిసేపటికే విలియం, ప్రవీణ్ మధ్య పెద్ద వాగ్వాదం జరిగింది. వెంటనే విలియం తన వద్ద ఉన్న గన్‌తో ప్రవీణ్‌ను కాల్చిచంపాడు. అక్కడి నుంచి పారిపోయి దగ్గర్లోని ఇంట్లో చొరబడేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అరెస్ట్‌చేశారు. మూడు సార్లు తుపాకీ శబ్దం విన్నానని అక్కడే ఉన్న ఒక సాక్షి చెప్పారు. అసలు కారణాలను పోలీసులు వెల్లడించలేదు.

## ఆర్థిక మాంద్యంలోకి జపాన్

**టోక్యో:** జపాన్ మాంద్యంలోకి జారిపోయింది. జపాన్ ఆర్థిక వృద్ధి రేటు 2023 చివరి త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్ మధ్య)లో 0.4%, జూలై–సెప్టెంబర్‌లో 2.9% మేర క్షీణించింది. వరుసగా రెండు త్రైమాసికాల్లో ఆర్థిక వృద్ధి మందగించిన సందర్భాల్లో ఆర్థిక వ్యవస్థను మాంద్యంలో ఉందనేందుకు గుర్తుగా భావిస్తారు. దీంతోపాటు, జపాన్ కరెన్సీ యెన్ కూడా బలహీనపడింది. ఫలితంగా ప్రపంచంలోని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న జపాన్..అమెరికా, చైనా, జర్మనీల తర్వాత నాలుగో స్థానానికి పడిపోయింది.

సాక్షి
కరీంనగర్
శుక్రవారం । 16 । ఫిబ్రవరి । 2024





ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్



శేషవాహనంపై విహరిస్తున్న స్వామివారు



చిన్నారి నృత్య ప్రదర్శన



స్వామివారికి సారె తెచ్చిన మహిళలు

# శేషవాహనంపై శ్రీవారు

**కరీంనగర్ వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ**



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని మార్కెట్ రోడ్డులో ఉన్న వేంకటేశ్వర ఆలయ సప్తమ బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ జరిగింది. బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల ఏర్పాట్లపై ఆరా తీశారు. సహస్ర కలశాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవింద నామస్మరణల మధ్య పాతబజార్ శివాలయం వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి పుట్టమట్టిని సేకరించి మేళతాళాలతో వేంకటేశ్వర ఆలయానికి చేరుకున్నారు. సాయంత్రం యాగశాలలో విశ్వక్‌సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, ధ్వజాధివాసం జరిగాయి. రాత్రి శ్రీవారు ఉభయ దేవరులతో కలిసి శేషవాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరించారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులు పులకించిపోయారు.

సాంస్కృతిక కళావేదికపై గాయకుడు, ఉత్సవాల కల్చరల్ ఆర్గనైజర్ సల్వాజి ప్రవీణ్ నేతృత్వంలో వివిధ భజనమండళ్ల పారాయణాలు, భజనలు, కీర్తనలు అలరించాయి. అర్చకులు లక్ష్మీనారాయణాచార్యులు, నాగరాజాచార్యులు, వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో పుదుతల వెంకన్న, కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పురుమల్ల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, కటకం వెంకటరమణ, నార్ల కార్తీక్, గుగ్గిళ్లపు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన



పాత శివాలయం నుంచి పుట్టమన్ను తీసుకొస్తూ..

## న్యూస్‌రీల్

### కొనసాగుతున్న స్తంభం ఎక్కే పరీక్ష



కరీంనగర్: టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ పరిధిలో జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) పోస్టుల భర్తీకి కరీంనగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో అభ్యర్థులకు గురువారం ఐదోవిడత స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించారు. జేఎల్ఎం రాత పరీక్షలో అర్హత సాధించిన 27మందిలో 24 మంది అభ్యర్థులు హాజరు అయ్యారు. వరంగల్ నుంచి వచ్చిన సీజీఎం (హెచ్‌ఆర్‌డీ) ప్రభాకర్ పరిశీలకులుగా, కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ చైర్మన్‌గా, బండారి చంద్రయ్య కన్వీనర్‌గా, డీఈలు విజయేందర్‌రెడ్డి, ఈశ్వరప్రసాద్ సభ్యులుగా అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. అభ్యర్థులతో హామీని తీసుకుని పోల్ క్లైంబింగ్ టెస్టును నిర్వహించారు. ఒక్కో అభ్యర్థి రెండు నిమిషాల్లో పోల్ ఎక్కి దిగితేనే అర్హులుగా ప్రకటించారు. మిగిలిన వారిని అనర్హులుగా తేల్చారు. ఈ జాబితాను వరంగల్‌లోని కార్పొరేట్ ఆఫీసుకు పంపించారు. కార్పొరేట్ ఆఫీసు స్థాయిలో అర్హత సాధించిన జేఎల్ఎంలకు నియామక పత్రాలు అందించనున్నారు.

### స్వల్పంగా పెరిగిన పత్తి ధరలు



జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధరలు స్వల్పంగా పెరిగాయి. బుధవారం క్వింటాల్‌కు రూ.6,750 కాగా గురువారం క్వింటాల్‌కు రూ.150 పెరిగి రూ.6,900 పలికింది. మార్కెట్‌కు 66 వాహనాల్లో 728 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తేగా.. మోడల్ ధర రూ.6,750, కనిష్ట ధర రూ.6,100 పలికింది. గన్నీ సంచుల్లో ఎనిమిది మంది రైతులు 12 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకరాగా గరిష్ట ధర రూ.6,400, మోడల్ ధర రూ.6,200, కనిష్ట ధర రూ.5,800కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్ కార్యదర్శి గుగూలోతు రెడ్డినాయక్ క్రయవిక్రయాలను పర్యవేక్షించారు.

### ఆలోచించి పరీక్ష రాయాలి



సప్తగిరికాలనీ(కరీంనగర్): పదోతరగతి విద్యార్థులు పరీక్ష పేపరు శ్రద్ధగా చదివి రాయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్.జనార్దన్ రావు సూచించారు. గురువారం ఆయన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సవరన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. పలు సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలను అడిగారు. గణితంలోని కొన్ని లెక్కలను బోర్డుపై రాసి విద్యార్థులతో పూర్తిచేయించారు. ప్రీఫైనల్స్ బాగా చదివి ఆలోచించి రాయాలని విద్యార్థులకు సూచించారు. మంచి విద్యార్థులను మరింత ప్రోత్సహిస్తూ.. వెనుకబడినవారి స్థాయి పెంచేందుకు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సూచించారు.

### ఏపీఆర్వోకు పదోన్నతి బదిలీ

కరీంనగర్ అర్బన్: సహాయ ప్రజా సంబంధాల అధికారి(ఏపీఆర్వో) శారద పదోన్నతిపై బదిలీ అయ్యారు. కరీంనగర్ డీపీఆర్వో కార్యాలయంలో ఏపీఆర్వోగా విధులు నిర్వహిస్తుండగా రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజాసంబంధాల అధికారిగా బదిలీ అయ్యారు.

# ఆకలి చదువులు

- పదోతరగతి విద్యార్థుల అల్పాహారానికి నిధుల్లో కోత
- ఒక్కో విద్యార్థికి గతేడాది రూ.15, ఈ ఏడాది నుంచి రూ.5 చెల్లింపు
- ప్రభుత్వ ఉత్తర్వులపై పెదవి విరుస్తున్న ఉపాధ్యాయులు
- దాతల వైపు చూపు.. చొప్పదండి ఎమ్మెల్యే రూ.1.50లక్షల విరాళం
- మిగితా ప్రజాప్రతినిధులు స్పందించేనా?



ఒద్యారం హైస్కూల్‌లో విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)

కరీంనగర్: పదోతరగతి వార్షిక పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక తరగతులకు హాజరు అవుతున్న విద్యార్థులకు అల్పాహారం కోసం ప్రభుత్వం ఏటా నిధులు మంజూరు చేస్తోంది. గతేడాది ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున నిధులు విడుదల చేయగా.. తాజా విద్యాసంవత్సరంలో రూ.5 మాత్రమే కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయమై ఉపాధ్యాయులు పెదవి విరుస్తున్నారు. కొన్నేళ్లుగా పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు ఆర్థికంగా అండగా నిలిచేవారు. గతేడాది నుంచి ప్రభుత్వమే ఒక్కో విద్యార్థికి రూ.15 కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది రూ.5 చొప్పున మాత్రమే నిధులు విడుదల చేసింది. దీంతో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం ఎలా అందించాలో తెలియక ప్రధానోపాధ్యాయులు సతమతం అవుతున్నారు.

**జిల్లాలో 4,246 మంది విద్యార్థులు**

జిల్లాలోని 160 ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి యాక్షన్ ప్లాన్ అమలు చేస్తూ రివిజన్ టెస్టులు, ఉదయం 8.30–9.30వరకు, సాయంత్రం 4.30–5.30వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది విద్యార్థులు ఉదయం వేళ టిఫిన్ చేయకుండా వస్తున్నారు. మధ్యాహ్నం తిన్నవారు రాత్రి 7–8 గంటల వరకు ఆహారం తీసుకునే పరిస్థితి లేదు. దీంతో వారిలో అలసట, నీరసం కారణంగా చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం అల్పాహారం అందించాలని నిర్ణయించడం ఊరట కలిగించే అంశమే. కానీ గత ఏడాది రూ.15 ఇచ్చిన ప్రభుత్వం, ఈసారి రూ.5లు కేటాయించడం ఏంటని విద్యాభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

| జిల్లాలో పాఠశాలలు | | విద్యార్థులు |
|---|---|---|
| ఉన్నత పాఠశాలలు | 149 | 3,183 |
| ఆదర్శ పాఠశాలలు | 11 | 1,063 |
| మొత్తం | 160 | 4,246 |

### చొప్పదండి ఎమ్మెల్యే రూ.1.50 లక్షల విరాళం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అల్పాహారం కోసం రూ.1.50లక్షల చెక్కును చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలెక్టర్ పమేలా సత్పతికి ఇటీవల అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పరిస్థితులు తాను అనుభవించానని, ఆకలి కడుపులతో చదువులు ఉండొద్దనే ఉద్దేశంతో తన మొదటి నెల జీతం నుంచి రూ.1.50లక్షల చెక్కు అందించినట్లు వివరించారు. పేద విద్యార్థుల అల్పాహారం కోసం గతంలో గంగాధర పాఠశాలలోనూ రూ.30వేలు అందజేశానని వెల్లడించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను స్ఫూర్తిగా తీసుకొని మిగితా ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాజకీయ నాయకులు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బాసటగా నిలువాలని విద్యాభిమానులు కోరుతున్నారు.



అల్పాహారం కోసం రూ.1.50 లక్షల చెక్కు అందిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే సత్యం

# నేతన్న యాప్‌పై అవగాహన కల్పించాలి



టీ నేతన్న యాప్‌పై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: చేనేత కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన టీ–నేతన్న యాప్ గురించి సంపూర్ణ అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో చేనేత,జౌళిశాఖ ఆధ్వర్యంలో టీ–నేతన్న యాప్‌పై చేనేత, మరమగ్గా కార్మికులు, అనుబంధ కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. చేనేత, పవర్‌లూం కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల రాయితీలను తెలియజేసేందుకు ఈ యాప్‌ను తీసుకురావడం జరిగిందన్నారు. చేనేత కార్మికులు తయారుచేసిన టవల్స్, కర్టన్స్ వంటి వస్త్రాలను జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగించాల్సిందిగా సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. టి నేతన్న యాప్‌లో ఉన్న సాంకేతిక సమస్యలను వారంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ వి.అశోక్ రావు, సహాయ సంచాలకులు ఎస్.ఎస్.చరణ్, డీఎంవో టెస్కో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**ఓటింగ్‌శాతం పెంపునకు ప్రత్యేక కార్యక్రమాలు**

కరీంనగర్ అర్బన్: తక్కువగా పోలైన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను చైతన్యపరిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గంలోని 39 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌శాతం తక్కువగా నమోదైందని, ఈ నెలాఖరు వరకు స్వీప్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుందని పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఓటింగ్ శాతాన్ని పెంచేలా, సూపర్‌వైజర్లు, బీఎల్‌వో, గుర్తించబడిన రాజకీయ పార్టీల బీఎల్ఏలతో బూత్‌స్థాయి సమావేశాలను నిర్వహిస్తామని ప్రకటనలో తెలిపారు. యువ, క్రియాశీల ఓటర్లతో వాక్ టు పోలింగ్ బూత్ కార్యక్రమాలు, పోలింగ్ రోజున ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటు ప్రాముఖ్యతను తెలియపరిచేలా ఎలక్టోరల్ లిట్రసి క్లబ్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందని అన్నారు.

# కాంగ్రెస్ చేవెళ్ల డిక్లరేషన్ ఏమైంది?

- ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయడం లేదు?
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్
- సేవాలాల్ మహారాజ్ సేవలు కొనియాడిన ఎంపీ



సిరిసిల్లలో ప్రజాహిత యాత్రలో ఎంపీ సంజయ్

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీల్లో ఇంతవరకు ఒక్కటి కూడా అమలు చేయలేకపోయిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తానని, పోడు భూములకు పట్టాలిస్తానని మాట ఇచ్చి తప్పిన మోసగాడు కేసీఆర్, కాంగ్రెస్ సైతం అవే హామీలు ఇచ్చి అమలు చేయకుండా మాట తప్పిందన్నారు. ఎస్టీలకు 3 కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తానని చెప్పి, ఇంతవరకు ఆచరణలోకి తేలేకపోయిందని విమర్శించారు. గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని బంజారాలకు శుభాకాంక్షలు తెలిపారు. వీరోచిత పోరాటాల చరిత్ర గిరిజనుల సొంతమని, అంతటి నేపథ్యమున్న గిరిజనులు గత పదేళ్లుగా కేసీఆర్ పాలనలో అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వారిని పట్టించుకోకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తానని గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తే, కాంగ్రెస్ సైతం అదేబాటలో నడుస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. వంద రోజుల్లో హామీలు అమలుచేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చే దాకా జాప్యం చేసి.. చివరికి కోడ్ సాకుతో దాటవేసే ప్రయత్నం కనిపిస్తోందన్నారు. అదే జరిగితే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని గిరిజనులను కోరారు.

### చొప్పదండి మున్సిపల్ కమిషనర్‌గా నాగరాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగరాజు

చొప్పదండి: చొప్పదండి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా కె.నాగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు విధులు నిర్వహించిన శాంతికుమార్ తొర్రూర్ మున్సిపాలిటీకి బదిలీపై వెల్లారు. నూతన కమిషనర్‌కు మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించి రిలీవ్‌పై వెళ్లిన శాంతికుమార్‌ను మున్సిపల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

## అసెంబ్లీలో మనోళ్ల వాయిస్

### 'డబుల్' ఇళ్లకు వసతులు కల్పించాలి

- అసెంబ్లీలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్



జగిత్యాల: రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా జగిత్యాలలో 4,520 డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించామని, తాగునీటి సౌకర్యం కల్పించామని, చిన్నచిన్న వసతులు కల్పిస్తే సరిపోతుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అసెంబ్లీలో ప్రస్తావించారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు కేటాయించరాదన్న విషయం దృష్టికి వచ్చిందని, సదుపాయాల దృష్ట్యా మంజూరు చేయించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కోరారు. గృహలక్ష్మీ పథకంలో గతంలో మంజూరు చేసిన ప్రొసీడింగ్ ద్వారా కొందరు నిరుపేదలు ఇళ్లు కట్టుకున్నారని, వాటిని ఇందిరమ్మ ఇళ్ల పథకంలో చేర్చి నిధులు మంజూరు చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలకు ఏసీడీపీ నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా సభ దృష్టికి సంజయ్ కుమార్ తీసుకెళ్లారు.

### డయాలసిస్ బెడ్ల సంఖ్య పెంచండి

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



కోరుట్ల:కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ నియోజకవర్గంలోని పలు సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించారు. కోరుట్లలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం డయాలసిస్ యంత్రాలను ఏర్పాటు చేసిందని,నియోజకవర్గంలో కిడ్నీ రోగుల సంఖ్య పెరిగిందని, డయాలసిస్ యంత్రాల సంఖ్య పెంచాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి నిధులను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని, వాటిని యథావిధంగా కొనసాగించాలని సూచించారు. ముత్యంపేట చక్కెర కర్మాగారం పునరుద్ధరణకు ప్రభుత్వం ఓ కమిటీ వేసినట్లు మీడియాలో చూశానని, చక్కెర కర్మాగారం తన నియోజకవర్గ పరిధిలో ఉంటుందని, కమిటీ ఏర్పాటు విషయంపై తనకు సమాచారమూ లేదని పేర్కొన్నారు.

### సూరమ్మ ప్రాజెక్టు పూర్తి చేయాలి

- వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు సాగునీరందించే సూరమ్మ రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం అసెంబ్లీలో ప్రస్తావించారు. రాళ్లవాగు ప్రాజెక్టు నిజామాబాద్ జిల్లా పరిధిలో ఉండగా.. కాలువలు జగిత్యాల జిల్లా పరిధిలో ఉన్నాయని, మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కలిగోట సూరమ్మ ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి ఎత్తిపోతలు నీళ్లు వచ్చేలా కాలువ పనులకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. సూరమ్మ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాలువలు పూర్తి చేస్తే కథలాపూర్, మేడిపెల్లి, బీమారం మండలాల్లో 45 వేల ఎకరాలకు నీరందుతుందన్నారు.

### జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



హుజూరాబాద్: కేసీఆర్ ప్రభుతం గతంలో కల్పించిన ఉద్యోగాలకు సంబంధించి అభ్యర్థులకు పత్రాలు ఇవ్వడం కాదు.. 2 లక్షల కొత్త ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## క్లుప్తంగా

### బావిలో పడి వృద్ధురాలి మృతి


లక్ష్మి మృతదేహం

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని లింగన్నపేటకు చెందిన వృద్ధురాలు బరుకుటం లక్ష్మి(65) ముస్తఫానగర్‌ శివారులోని ఓ బావిలో పడి మృతిచెందింది. లక్ష్మి భర్త ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందాడు. కుమారుడు మూగవాడు. ఓ రైసుమిల్లులో కూలీ పనులు చేసుకుంటున్నాడు. లక్ష్మి ఇంటిదగ్గర ఒంటరిగానే ఉంటుంది. కొంతకాలంగా మతిస్థిమితం లేదు. గురువారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లిన లక్ష్మి మధ్యాహ్నం బావిలో శవమై కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. జీవితంపై విరక్తితోనే బావిలో దూకి ఆత్మహత్య చేసుకొని ఉంటుందని కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్‌ తెలిపారు.

### డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులో ముగ్గురికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి కరీంనగర్‌ కోర్టు జైలు శిక్ష, జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్‌ ఏసీపీ మహ్మద్‌ సర్వర్‌ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 22 మందిని కరీంనగర్‌ కోర్టులో గురువారం హాజరుపర్చగా ఒకరికి పదిరోజుల జైలు, మరొకరికి ఏడు రోజుల జైలు, మరో వ్యక్తికి మూడు రోజుల జైలుతో పాటు రూ.6వేల జరిమానా విధించారన్నారు. మిగతా 19 మందికి 33,500 జరిమానా విధించినట్లు ఏసీపీ తెలిపారు.

### ఇన్‌స్పైర్‌మనక్‌ ఎగ్జిబిషన్‌కు పారమిత విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

కరీంనగర్‌: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్‌ స్కూల్‌లో పదోతరగతి చదువుతున్న సిద్రా రహ్మత్‌, శుభశ్రీ సాహులు 2023–24 విద్యా సంవత్సరానికిగానూ ఈ నెలాఖరులో జరగనున్న రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌ మనక్‌ అవార్డ్‌ ఎగ్జిబిషన్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రితేష్‌ మెహతా తెలిపారు. విద్యార్థులను, గైడ్‌ టీచర్‌ లలిత్‌ మోహన్‌ సాహు పారమిత విద్యాసంస్థల చైర్మన్‌ డా.ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌ రావు, రష్మిత, రాకేశ్‌ అభినందించారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- చట్టపరంగా ముందుకెళ్తాం
- ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కావొద్దు
- హెచ్చరించిన రామగుండం సీపీ ఎం.శ్రీనివాసులు


కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, మెడికోలు

కోల్‌సిటీ(రామగుండం): 'రామగుండం సీపీగా బాధ్యతలు తీసుకున్న రోజునే మెడికల్‌ కాలేజీలో జరిగిన ర్యాగింగ్‌ ఘటన నన్ను కలిచివేసింది. మెడికోలకు అవగాహనలు, కౌన్సెలింగ్‌లు, సలహాలు ఇవ్వడం కాదు.. ఇదే లాస్ట్‌ కావాలి. ఇలాంటి ఘటనలు మరోసారి కాలేజీలో పునరావృతం కావొద్దు. మెడికోలకు ఇది వార్నింగ్‌. ర్యాగింగ్‌ చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు' అని సున్నితంగా మెడికోలను రామగుండం పోలీస్‌ కమిషనర్‌ ఎం.శ్రీనివాసులు హెచ్చరించారు. గోదావరిఖనిలోని ప్రభుత్వ సిమ్స్‌ కాలేజీలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో 'యాంటీ ర్యాగింగ్‌, యాంటీ డ్రగ్‌ అవేర్‌నెస్‌' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడిన తీరు ఆలోచింపజేసింది. 'జూనియర్లకు సీనియర్లు ఒక అన్నలా ఉండాలి కానీ.. ఫన్‌, ఆకతాయి కోసం ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తును చేతులారా పోగొట్టుకున్నవారవుతారు. ఒక్కసారి శిక్షకు గురైతే పాస్‌పోర్ట్‌, వీసా కూడా రాదు. ఏ కాలేజీలో అడ్మిషన్‌ ఇవ్వరు' అని వివరించారు. తనకు కూడా డాక్టర్‌ కావాలని చాలా ఆశ ఉండేదని, స్టెతస్కోప్‌ పట్టాలనుకున్న చేతులోకి గన్‌ వచ్చిందన్నారు. ప్రజలకు ప్రాణం పోయడానికి, డాక్టర్‌ వృత్తిని ఎంచుకోవడానికి పోటీపడి చదివి ఉచిత సీటుతో మెడికల్‌ కాలేజీకి వచ్చిన విద్యార్థులు ర్యాగింగ్‌ పేరుతో భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్మించడంలో కళాశాల క్యాంపస్‌ కీలక పాత్రపోషిస్తుందని, ర్యాగింగ్‌ రహిత క్యాంపస్‌గా మార్చడానికి విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కాలేజీలో ప్రత్యేక పోలీస్‌ టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని కాలేజీల్లో షీ టీమ్‌ బృందాలు మఫ్టీలో తిరుగుతూ, నిరంతర నిఘా ఉంటుందని వివరించారు. యాంటీ ర్యాగింగ్‌పై చట్టాలు, శిక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం 'వార్నింగ్‌.. ర్యాగింగ్‌ నేరం' అనే పోస్టర్‌ను సీపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీపీ డాక్టర్‌ ఎం.చేతన, కాలేజీ ప్రిన్సిపాల్‌ హిమబిందు సింగ్‌, పెద్దపల్లి సెషన్స్‌ కోర్టు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ ఎం.జ్యోతి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ అడ్వకేట్‌ శ్రీనివాస్‌, సీడీపీవో కమలాకర్‌, సీఐలు ప్రమోదరావు, ప్రవీణ్‌కుమార్‌, ఎస్సైలు, మెడికల్‌ కాలేజీ ప్రొఫెసర్లు, మెడికోలు పాల్గొన్నారు.


ర్యాగింగ్‌పై హెచ్చరిస్తున్న సీపీ శ్రీనివాసులు

# రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి మృతి

- హైదరాబాద్‌లో ఘటన
- మృతుడిది కోరుట్ల పట్టణం


అజయ్‌ (ఫైల్‌)

కోరుట్ల: హైదరాబాద్‌లోని మాదాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోరుట్ల పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి వనతడుపుల అజయ్‌ (26) మృతిచెందాడు. మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. పట్టణానికి చెందిన అజయ్‌, శ్రీపాద సుశాంక్‌, అందె అజయ్‌ స్నేహితులు. బుధవారం రాత్రి విందుకు వెళ్లిన ముగ్గురు ఒకే బైక్‌పై తిరిగి వస్తుండగా హైదరాబద్‌లోని మాదాపూర్‌ శివారులో బైక్‌ అదుపు తప్పడంతో రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో అజయ్‌ అక్కడికక్కడే మృతిచెందారు. సుశాంక్‌ తీవ్రంగా గాయపడ్డాడు. అజయ్‌ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అజయ్‌, సుశాంక్‌ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నారు. అజయ్‌ పట్టణానికి చెందిన లహరిని రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు. అజయ్‌ కొంతకాలం క్రితం ఖతార్‌ వెళ్లి వచ్చాడు. యూరప్‌ వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాడు. అజయ్‌ మృతి చెందడం.. మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉండటం పట్టణంలో విషాదం నెలకొంది.

# రామగుండం ఎఫ్‌సీఎల్‌లో ప్రమాదం

- కాంట్రాక్టు కార్మికుడికి తీవ్రగాయాలు



ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండం ఫర్టిలైజర్స్‌ లిమిటెడ్‌ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. కార్మిక సంఘాల నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మొదటి షిఫ్ట్‌లో ప్లాంట్‌ షట్‌డౌన్‌ పనుల్లో భాగంగా మెకానిక్‌ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్‌ కార్మికుడు పి.శ్రీనివాస్‌ జారి కిందపడడంతో తీవ్రగాయాలైనాయి. క్షతగాత్రున్ని కరీంనగర్‌ ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా కాంట్రాక్ట్‌ కార్మికులకు భద్రత లేకుండా, వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. కర్మాగారంలో క్వాలిఫైడ్‌ సేఫ్టీ అధికారులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై శుక్రవారం ఆర్‌ఎఫ్‌సీఎల్‌ కార్మికులు, కాంట్రాక్ట్‌ కార్మికులతో సేఫ్టీ అధికారులు సమావేశం నిర్వహించనున్నారు. ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ చేసేందుకు కార్మికులకు సమాచారం అందించారు.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి...**

కర్మాగారంలో క్వాలీపై సేఫ్టీ అధికారులు లేకపోవడంతో ప్రమాదం సంభవించిందని ఫైట్‌ ఫర్‌ బెటర్‌ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్‌ ఆరోపించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు.

# మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్‌

- పిల్లలను ఎత్తుకెళ్లే వ్యక్తిగా అనుమానించిన గ్రామస్తులు
- వెంబడించడంతో పొలాల మీదుగా పారిపోయిన వైనం


పారిపోతున్న అనుమానిత వ్యక్తి

గొల్లపల్లి: మండలంలోని వెన్నుమట్లలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అనుమానాస్పదంగా గ్రామస్తులకు కన్పించాడు. చిన్నపిల్లలను ఎత్తుకెళ్లే వ్యక్తిగా అనుమానించి వెంబడించగా పొలాల్లోంచి పరుగులు తీశాడు. గ్రామానికి చేరుకున్న సదరు వ్యక్తిని గమనించిన స్థానికులు ప్రశ్నించగా సమాధానం చెప్పకుండానే అక్కడినుంచి వెళ్లిపోయాడు. గ్రామస్తులు వెంబడించడంతో పరుగులు తీశాడు. వెంటనే గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని ఆరా తీసి కొద్దిసేపటికి పట్టుకున్నారు. అతడిని ఆరాతీసి సిద్దిపేట ప్రాంతానికి చెందిన శ్రీకాంత్‌గా గుర్తించామని, మతిస్థిమితం సరిగా లేకనే ఇలా తిరుగుతున్నాడని, పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా వ్యక్తి కాదని ఎస్సై సతీశ్‌బాబు తెలిపారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు చొరబడితే వెంటనే తమకు సమాచారం అందించాలని 100, లేదా 87126 56826 సంప్రదించాలని కోరారు.

### పోస్టుమార్టం అడ్డుకున్న కుటుంబ సభ్యులు

గన్నేరువరం: గుండ్లపల్లికి చెందిన పంబాల కొమురయ్య బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతిపై అనుమానాలు ఉన్నాయని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరుతూ కరీంనగర్‌ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం కాకుండా కుటుంబసభ్యులు గురువారం అడ్డుకున్నారు. మృతిచెందిన ప్రదేశంలో చెప్పులు, కళ్లద్దాలు, దుస్తువులు వేర్వేరు చోటా పడి ఉన్నాయని, అంతే కాకుండా మోచేతులు, నుదుటిపై గాయాలయ్యాయని, గ్రామానికి చెందిన ఓవ్యక్తి తన తండ్రిని పనికి తీసుకెళ్లాడని, అక్కడ విద్యుత్‌ షాక్‌తో మృతిచెందిన అనంతరం శవాన్ని మా పొలంలో వేశారని ఆరోపించారు. అతని పేరును ఎఫ్‌ఐఆర్‌లో చేర్చాలని కోరుతూ సీపీ అభిషేక్‌ మహంతిని కలిశారు. ఫిర్యాదు ఆధారంగా పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

### ప్రైవేట్‌ ఆసుపత్రి ఎదుట ఆందోళన

మెట్‌పల్లి: పట్టణంలోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రి వైద్యుల తీరును నిరసిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన చిన్నమల్లయ్య (65)కు ఈనెల 12న ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స అందించే క్రమంలో పరిస్థితి విషమించింది. వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌కు తరలిస్తుండగా.. మృతిచెందాడు. అయితే అతడి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు ఆసుపత్రికి వద్దకు వచ్చి ఆందోళన చేశారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

# చేపల వలకు చిక్కిన పాము


వలలో చిక్కిన జెరిపోతును రక్షిస్తున్న సందీప్‌

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామంలో చేపలవలలో పాము చిక్కింది. గ్రామానికి సందీప్‌యాదవ్‌ గ్రామంలోని మిడ్‌ మానేరు ప్రాజెక్టు ఉపకాల్వ8 వద్ద బుధవారం చేపలను పట్టిన అనంతరం వలను కాల్వ పక్కన చెట్టు వద్ద పెట్టి వెళ్లిపోయాడు. చేపల వాసనకు జెరిపోతు వలలోకి దూరింది కానీ అందులోంచి బయటకు రాలేకపోయింది. గురువారం చేపలు పట్టడానికి ఉపకాల్వ వద్దకు చేరుకున్న సందీప్‌ పామును గమనించాడు. వెంటనే వలను కత్తిరించి పామును రక్షించాడు. సందీప్‌యాదవ్‌ చేపలను పట్టడమే కాకుండా ప్రమాదంలో ఉన్న విషసర్పాలను కాపాడిన సంఘటన చాలా ఉన్నాయి.

# మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


శిక్షణ కార్యక్రమానికి హాజరైన మహిళలు

గన్నేరువరం: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని నాబార్డు ఏజీఎం, అసిస్టెంట్‌ జనరల్‌ మేనేజర్‌ జయప్రకాశ్‌ అన్నారు. మండలంలోని జంగపల్లిలో గురువారం నాబార్డు సౌజన్యంతో జనవికాస గ్రామాణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వశక్తి మహిళలకు ఫ్లవర్‌ బొకే తయారీపై ఎంఈడీపీ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ... ప్రస్తుతం ఫ్లవర్‌ బొకేకు మార్కెట్‌లో డిమాండ్‌ ఎక్కువ ఉందని, పుట్టిన రోజు, పెళ్లిళ్లు, ఈవెంట్‌ మేనేజ్మెంట్‌, ఇతర రాజకీయ పార్టీల కార్యక్రమాలకు వీటి అవసరం ఎక్కువ ఉంటుందని తెలిపారు. బంచ్‌, హ్యాండ్‌ బాస్కెట్‌, చాక్లెట్‌ , టేబుల్‌, వాల్‌ బొకేస్‌, టిప్స్‌ ఆఫ్‌ వెనిస్‌ ఫ్లవర్‌ జడ మొదలగు వాటిపై 15 రోజుల పాటు 30 మంది స్వశక్తి మహిళలకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం స్టడీ మెటీరియల్‌, రూ.750, సర్టిఫికెట్స్‌ కూడా అందజేయడం జరుగుతోందన్నారు. మంచి ఆదాయ మార్గాలనే అన్వేషించాలని తెలిపారు. కార్యక్రమంలో జనవికాస గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యదర్శి పెండ్లి సంపత్‌కుమార్‌, మాస్టర్‌ ట్రైనర్‌ షకీల్‌, మనీషా, అనూషరెడ్డి, సహకార సంఘం డైరెక్టర్‌ గంప వెంకన్న, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిలో దూకి ఒకరి ఆత్మహత్య


కమల్‌గౌడ్‌ (ఫైల్‌)

వెల్గటూర్‌: మండలంలోని కోటిలింగాల వద్దగల గోదావరిలో దూకి మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మ్యాదరిపేటకు చెందిన బత్తిని కమల్‌గౌడ్‌ (29) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కమల్‌గౌడ్‌ షార్ట్‌ఫిల్మ్స్‌ తీస్తుంటాడు. ఈనెల 13న తనకు డేటా ఎంట్రీ ఉద్యోగం వచ్చిందని తండ్రి వద్ద రూ.70వేలు, బంధువు వద్ద రూ.44,500 తీసుకుని ఇంటి నుంచి బయల్దేరాడు. అదేరోజు రాత్రి వరుసకు అల్లుడైన ఆకుల పవన్‌కు ఫోన్‌ చేసి తన డబ్బులు హ్యాక్‌ అయ్యాయని తెలిపాడు. రెండురోజుల అనంతరం కోటిలింగాల వద్దగల పుష్కరఘాట్‌ వద్ద శవమై కనిపించాడు. షార్ట్‌ఫిల్మ్స్‌ లొకేషన్‌ కోసం వచ్చి ప్రమాదవశాత్తు గోదావరిలో పడి మరణించాడా..? లేక డబ్బులు పోయాయనే మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్నాడా..? అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు మొత్తం పోవడంతోనే ఇంటికెలా వెళ్లాలనే మనోవేదనతో గోదావరి నదిలో దూకి మృతిచెందాడని తండ్రి మల్లేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్‌ తెలిపారు.







### ఏటీఎం చోరీ నిందితుడి అరెస్ట్‌

- పరారీలో మరో ముగ్గురు

జ్యోతినగర్‌(రామగుండం): గోదావరిఖనిలోని గౌతమినగర్‌ ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ చేసి నగదు అపహరించిన కేసులో హర్యానాకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్‌ గురువారం తెలిపారు. వివరాలు.. ఈ నెల 10న ఎస్‌బీఐ ఏటీఎంలోకి దొంగలు చొరబడి ధ్వంసం చేసి అందులోని రూ.27,59,900 అపహరించిన ఘటనలో చానల్‌ మేనేజర్‌ గాండ్ల రమేశ్‌ ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు బృందాలుగా దర్యాప్తు ముమ్మరం చేశారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుల కదలికలను అనుసరిస్తూ 12న హర్యానా వెళ్లి నూహ జిల్లా నెహదా గ్రామానికి చెందిన హకుమొద్దీన్‌(33) అలియాస్‌ హక్కును అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు షోకెం ఖాన్‌, అమీర్‌ఖాన్‌, వసీంఖాన్‌ పారిపోయారు. విచారణ అనంతరం హకుమొద్దీన్‌ను రిమాండ్‌ చేసినట్లు సీఐ వెల్లడించారు. పట్టుబడిన నిందితుడి వద్ద ఎలాంటి నగదు లభించలేదని తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో శ్రమించిన అధికారులు, సిబ్బందిని పెద్దపల్లి డీసీపీ డాక్టర్‌ చేతన అభినందించారు.

### శివాలయంలో చోరీ

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్‌లోని శ్రీకోదండరామాలయ ప్రాంగణ శివాలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీని పగులగొట్టి అందులోని సొత్తును ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం వేకువజామున ఆలయానికి వెళ్లిన భక్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా గత కొద్ది రోజులుగా బసంత్‌నగర్‌లో వరుస దొంగతనాలు స్థానికులను కలవరపెడుతున్నాయి. ఇంటి ముందర, బస్టాండ్‌ల వద్ద పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను దుండగులు ఎత్తుకెళ్తున్నారు. గడిచిన 15 రోజుల వ్యవధిలో మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనాయి. గ్రామాల్లో సీసీ కెమెరాల నిర్వహణ, రాత్రివేళల్లో పోలీసుల గస్తీ కూడా లేకపోవడంతో దొంగలు చెలరేగిపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### చికిత్స పొందుతూ మహిళ మృతి

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సయ్యద్‌ నజీరా(20) అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల వివరాలు.. కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఈ నెల 14న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. చుట్టు పక్కల వారు గమనించి జమ్మికుంటలోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తల్లి షేక్‌ హైదర్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

### విద్యుత్‌ మోటార్‌ చోరీ

సారంగాపూర్‌: బీర్‌పూర్‌ మండలం నర్సింహులపల్లెకు చెందిన ఓ రైతు మోటార్‌ను ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. రైతు ఎడ్ల లక్ష్మీనారాయణకు చెర్లపల్లి శివారులో రెండెకరాలు ఉంది. ఈనెల 13న పొలానికి నీరు పెట్టి వచ్చాడు. మరుసటి రోజు వెళ్లగా.. బావిలో మోటార్‌ కనిపించలేదు. బాధితుడికి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌతంపవార్‌ తెలిపారు.

# గల్ఫ్‌ ట్రావెల్స్‌లపై నిఘా కరువు

- జిల్లాలో అర్హత లేని ట్రావెల్స్‌లు అనేకం
- ఏజెంట్ల చేతిలో మోసపోతున్న బాధితులు
- ఆందోళన చెందుతున్న నిరుద్యోగులు


గల్ఫ్‌ ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులు (ఫైల్‌)

బీర్‌పూర్‌ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన ఇద్దరు, మరో గ్రామానికి చెందిన యువకుడు కలిసి న్యూజిలాండ్‌ వెళ్లేందుకు నిజామాబాద్‌ జిల్లా జక్రాన్‌పల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఏజెంట్‌కు రూ.9 లక్షలు ముట్టజెప్పారు. సదరు ఏజెంట్‌ వారికి నకిలీ వీసాలు చేతిలో పెట్టాడు. అప్పుడుఇప్పుడు అంటూ ఏడాది కాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు.

జగిత్యాల రూరల్‌ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు, రాయికల్‌ మండలం తాట్లవాయికి చెందిన మరో యువకుడు కలిసి స్నేహితుల ద్వారా నిజామాబాద్‌లోని మోర్తాడ్‌ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన ఓ గల్ఫ్‌ ఏజెంట్‌కు రూ.2లక్షలు అప్పగించారు. రెండు నెలలుగా దుబాయ్‌ పంపించకుండా.. డబ్బులు తిరిగి ఇవ్వకుండా యువకులనే బ్లాక్‌మెయిల్‌ చేస్తూ.. బెదిరింపులకు పాల్పడుతున్నాడు.

జగిత్యాలక్రైం: ఉపాధి కోసం గల్ఫ్‌ దేశాలకు వెళ్లే వారి సంఖ్య జిల్లాలో రోజురోజుకూ పెరుగుతుండడంతో అదునుగా తీసుకున్న కొంతమంది ట్రావెల్స్‌, గల్ఫ్‌ ఏజెంట్లు పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నారు. వీరు రెండేళ్లుగా యువకులను మోసగిస్తూనే ఉన్నారు. అనుమతులు లేకుండా జిల్లాలో సుమారు 180 ట్రావెల్స్‌లు నడుస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో గ్రామీణప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులకు విదేశీల్లో ఉపాధి కల్పిస్తామని గల్ఫ్‌ ఏజెంట్లు ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్నారు. జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాలతో పాటు 20 మండలాల్లో గల్ఫ్‌ ట్రావెల్స్‌ పేరున సుమారు 180 ట్రావెల్స్‌ నిర్వహిస్తున్నారు. వాస్తవానికి వీరు విమాన టికెట్స్‌ బుకింగ్‌ చేసేందుకే అనుమతి తీసుకుంటారు. కానీ.. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని చెప్పి.. వారి పాస్‌పోర్టులు తీసుకుని ఇంటర్వ్యూలకు హాజరుపరుస్తూ.. వీసా వచ్చిందని నమ్మిస్తూ.. నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. అదే ట్రావెల్స్‌లలో ఎలాంటి అనుమతులు లేకుండా మనీ ట్రాన్స్‌ఫర్‌ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. నిరుద్యోగులు కూడా స్థానికంగా ఉన్న ట్రావెల్స్‌లను నమ్మి లక్షలాది రూపాయలు చేతిలో పెట్టి మోసపోతున్నారు.

**30 మందికే లైసెన్స్‌లు**

గల్ఫ్‌ పంపించేందుకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ నుంచి జిల్లాలో కేవలం 30 మంది ఏజెంట్లకు మాత్రమే లైసెన్స్‌ ఉంది. మిగతావారు అనుమతి లేకున్నా.. ట్రావెల్స్‌, ఏజెంట్లుగా చలామణి అవుతూ నిరుద్యోగుల నుంచి వీసాల పేరుతో పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారు.

**లైసెన్స్‌ లేకున్నా ఇంటర్వ్యూలు**

వాస్తవానికి గల్ఫ్‌ ఏజెంట్లు, ట్రావెల్స్‌ నిర్వాహకులు లైసెన్స్‌ ఉన్నా జిల్లాలోని ఎస్పీ పోలీసులకు సమాచారం అందించి ఇంటర్వ్యూలు నిర్వహించాలి. కానీ వారు పోలీసులకు ఎలాంటి సమాచారం లేకుండానే ఇష్టారీతిలో జిల్లాకేంద్రంతో పాటు, పలుచోట్ల హోటళ్లు, ఫంక్షన్‌హాల్స్‌, గెస్ట్‌హౌస్‌ల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌, ముంబయ్‌, చెన్నై, ఢిల్లీలో ఉన్న ట్రావెల్స్‌ యజమానులు వీరికి జత కలుస్తున్నారు. ఇంటర్వ్యూల్లో అర్హత సాధించారని పేర్కొంటూ పాస్‌పోర్టులు తీసుకుని అనంతరం వారికి ఏదో ఒక వీసా అప్పగించి మోసాలకు పాలడుతున్నారు.

**యూరప్‌ దేశాలకూ ఇంటర్వ్యూలు**

లైసెన్స్‌ ఉన్న ట్రావెల్స్‌ యజమానులు గతంలో గల్ఫ్‌ దేశాలకు మాత్రమే నిరుద్యోగ యువకులను పంపించేవారు. కానీ ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా లైసెన్స్‌లు ఉన్నవారు, లేని వారు యూరప్‌ దేశాల్లోనూ ఉద్యోగాలున్నాయంటూ సుమారు రూ.2 నుంచి రూ.5లక్షల వరకు వసూలు చేస్తున్నారు.

**కేసులు నమోదు చేస్తున్నాం**



గల్ఫ్‌ పంపిస్తామని మోసం చేసిన వ్యక్తులపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేస్తున్నాం. నకిలీ ఏజెంట్లకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. ఎమిగ్రేషన్‌ చట్టబద్ధత ఉన్న వారి నుంచే వీసాలు పొందాలి. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి గల్ఫ్‌ మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపడతాం.
– సన్‌ప్రీత్‌సింగ్‌, ఎస్పీ

## • బీఐపాస్‌పై అవగాహన



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ మోడల్ ఆవాస మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం హైదరాబాద్‌కు చెందిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐపాస్)పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బీఐపాస్‌పై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పారావు, బీఐపాస్ ఎస్‌పీవో అభిసాయి, రిసోర్స్‌పర్సన్ ప్రభాకర్, మెంటర్ శ్రీవాణితో పాటు పలువురు పాల్గొన్నారు.

## • క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ. యూనిస్ పాషా, నాయకులు వీర్‌పాల్ రెడ్డి, వీరన్న, సమ్మయ్య, వేణుగోపాల్, రమేశ్, శ్రీనివాస్, రూపారాణి, కృష్ణవేణి, శ్రీలక్ష్మి, శ్రీలత, వనిత, హన్మంతు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# నగర సంపూర్ణ అభివృద్ధే లక్ష్యం

• మేయర్ సునీల్‌రావు



కాశ్మీర్‌గడ్డలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్రంలోనే అభివృద్ధిలో నగరం మొదటిస్థానం సాధించేలా తమ పాలకవర్గం కృషి చేస్తోందని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం 53వ డివిజన్ కాశ్మీర్‌గడ్డలో ఫైర్‌స్టేషన్ వద్ద రూ.29 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీకల్వర్టు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల నుంచి నగరపాలకసంస్థలోని అన్ని డివిజన్‌లలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కూడా తమకు సహకరిస్తే నగరాన్ని మరింతగా అభివృద్ధి పరుస్తామన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్రబడ్జెట్‌లో పురపాలకశాఖకు ప్రత్యేకంగానిధులు కేటాయించారని, అందులో కరీంనగర్ నగరపాలకసంస్థకు ఎంత అనేది స్పష్టత లేదన్నారు. 53వ డివిజన్‌లోని కాశ్మీర్‌గడ్డలో పైప్‌లైన్‌ల కారణంగా గతంలో వేసిన రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో వాటి స్థానంలో కొత్త రోడ్లు వేస్తున్నామన్నారు. ఇప్పటికే ముకరంపుర, కాశ్మీర్‌గడ్డ ప్రాంతాల్లో లింక్‌రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. పరివార్ బేకరీ రోడ్డుతో పాటు ఉమెన్స్ కాలేజీ రోడ్డు, గోదాంగడ్డ వరకు కూడా రోడ్లు సుందరంగా మారాయన్నారు. ఫైర్ స్టేషన్ సమీపంలో ప్రజల ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశామన్నారు.రూ.10 కోట్లతో కాశ్మీర్‌గడ్డ రైతుబజార్‌ను సమీకృత మార్కెట్ గా మారుస్తున్నామని చెప్పారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్పొరేటర్ శ్రీదేవి చంద్రమౌళి, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# ఈ రోడ్లను పట్టించుకోరా?

• సిక్‌వాడీలో అధ్వానంగా వీధులు



సిక్‌వాడీ ప్రాంతంలో రోడ్ల పరిస్థితి

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థలో ఓ ప్రక్క అభివృద్ధి పనులు జోరుగా సాగుతుంటే.. ఆ ప్రాంతంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ''తమ ప్రాంతంలో రోడ్లు అధ్వానంగా మారాయి.. రోడ్లు వేయండి..'' అంటూ కాలనీవాసులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. నగరం నడిబొడ్డున ఉన్న సిక్‌వాడీ పరిస్థితి ఇది. సిక్‌వాడీలోని పలు వీధులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని సంవత్సరాలు గడుస్తున్నా వాటి స్థితి మారడం లేదు. ఎప్పుడో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం తవ్విన సీసీ రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరినా వాటి స్థానంలో కొత్త రోడ్లు వేయడం లేదు. కనీసం మరమ్మతులకు కూడా ఆ నోచుకోవడం లేదు. ముఖ్యంగా సిక్‌వాడీలోని గురుద్వార్ ప్రధాన వీధి, గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రక్కవీధులు పూర్తిగా అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్లను పట్టించుకునే అధికారులు లేకుండా పోయారని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. నగర వాణిజ్య కేంద్రమైన టవర్‌సర్కిల్ ప్రాంతంలోనే రోడ్లను అధికారులు పట్టించుకోకపోవడమేమిటని వారంటున్నారు. కాగా సిక్‌వాడీ, గంజ్ హైస్కూల్ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు వేయాలని కార్పొరేటర్ కమల్‌జిత్ కౌర్ సోహన్ సింగ్ డిమాండ్ చేశారు.

## క్లుప్తంగా

### ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం



డైరీ అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యోగుల జేఏసీ, టీఎన్జీవోల సంఘం పని చేస్తోందని ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. టీఎన్జీవోల సంఘం డైరీని గురువారం వివిధ డిపార్ట్‌మెంట్లలోని ఉద్యోగులకు అందజేశారు. ఉద్యోగులతో ఆత్మీయ సమ్మేళనంలా కార్యక్రమాలు నిర్వహించారు. ఉద్యోగుల సమస్యలను ఆరా తీశారు. హెల్త్ కార్డులు, ఈహెచ్ఎస్, పీఆర్సీ ,పెండింగ్ డీఏలపై వివరించగా సదరు సమస్యలను కేంద్ర సంఘం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంగం లక్ష్మణరావు, జి.వీరారెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ షమీం, సుధీర్, భీమ్రావు, శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, బాలగంగాధర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

### మేయర్ పూజలు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని మల్కాపూర్ ప్రాంతంలో గల శాతవాహన హిల్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీబాలాత్రిపుర సుందరేశ్వరాలయంను మేయర్ సునీల్‌రావు గురువారం సందర్శించారు. బాలాత్రిపుర సుందరేశ్వరులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహా మృత్యుంజయ, లక్ష్మీ గణపతి, చండీ హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఏదుల్ల రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆలయ, నిర్మాణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### క్రైస్తవులపై దాడి శోచనీయం



మాట్లాడుతున్న మేకల రవీందర్

విద్యానగర్(కరీంనగర్): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పరిధిలోని జవ్వాడలో క్రైస్తవులపై, చర్చిపై దాడి చేయడం శోచనీయమని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేకల రవీందర్ అన్నారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు అనిల్‌కుమార్, మంద బాలయ్య, కొండయ్య, లక్ష్మణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

### ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలి



పరీక్ష ప్యాడ్లు అందుకున్న విద్యార్థులతో సభ్యులు

కరీంనగర్: విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని హామ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ అన్నారు. కరీంనగర్ మండలం జూబ్లీనగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష సామగ్రి అందజేశారు. వార్షిక పరీక్షల్లో 9.6, ఆపై జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.2,016 నగదు పారితోషికం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జలజారాణి, సంస్థ సంయుక్త కార్యదర్శి గోగురి శ్రీధర్‌రెడ్డి, రక్షన్, హిమసాయి, దేవిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



పూజల్లో పాల్గొన్న మేయర్ సునీల్‌రావు



సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని రేకుర్తి మల్కాపూర్ ప్రాంతంలో గురువారం సంత్ సేవాలాల్ జయంతిని బంజారా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మేయర్ సునీల్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని నగరపాలక సంస్థ ద్వారా అభివృద్ధి చేస్తామని అన్నారు. రోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. అభివృద్ధి పనుల ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు కూడా ఆదేశాలు ఇచ్చామనానరు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎదుల్ల రాజశేఖర్, బంజార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### బంజారుల ఆరాధ్య దైవం సేవాలాల్

కరీంనగర్ కార్పొరేషన్: బంజారుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి సందర్భంగా గురువారం ఇందిరాచౌక్‌లో కాంగ్రెస్ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. మానవాళిని సన్మార్గంలో నడిపిన గొప్ప గురువు సేవాలాల్ అని కొనియాడారు. సేవాలాల్ జయంతిని ఆప్షనల్ హాలిడేగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం శుభసూచికమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రవణ్‌నాయక్, నాయకులు అరుణ్‌కుమార్, విఠల్, భాస్కర్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చిత్రలేఖన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో స్కౌట్స్, గైడ్స్ ప్రతినిధులు

కరీంనగర్: కొత్తపల్లి మండలం చింతకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లకు జిల్లాస్థాయి కథా రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని చింతకుంట, గర్షకుర్తి, రుద్రారం ఉన్నత పాఠశాలలు, కరీంనగర్ కేజీబీవీ, పారమిత ఉన్నత పాఠశాలలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఇద్దరు చొప్పున హాజరయ్యారు.ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కథా రచన (ఇంగ్లీష్ మీడియం) పోటీలో ప్రథమ బహుమతి బి రచన, తెలుగు మీడియంలో డి తేజస్వీ, ద్వితీయ బహుమతి ఎస్ విశ్వశ్రీలు గెలుపొందారు. అదే విధంగా చిత్రలేఖనం పోటీలో ప్రథమ బహుమతి డి.మనోజ్‌కుమార్, ద్వితీయ బహుమతి ఎం రిత్విక్ యాదవ్‌లు గెలుచుకున్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు, జిల్లా కార్యదర్శి కంకణాల రాంరెడ్డి, శిక్షణ కమిషనర్ షరీఫ్ అహ్మద్, ఆర్గనైజింగ్ కమిషనర్ అడిగొప్పుల సదయ్య, ట్రెజరర్ కేతు.శ్రావణ్ కుమార్‌లు అభినందించారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని లయోల కళాశాలలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు జరిగే 52వ రాష్ట్రస్థాయి సీనియర్ మెన్, ఉమెన్ హ్యాండ్‌బాల్ పోటీ వాల్ పోస్టర్లను గురువారం సంఘం బాధ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్, ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ నిర్వాహకుడు సతీశ్‌రెడ్డి ఎస్వీజేసీ విద్యా సంస్థల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, హరికృష్ణ, లయోల విద్యా సంస్థల ప్రిన్సిపాల్ ఫాదర్ జోసెఫ్‌తో పాటు నమిలకొండ ప్రభాకర్, మూల వెంకటేశ్, నాగుల శ్రీనివాస్, దుర్గ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## వార్డు అధికారికి అస్వస్థత

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థలో వార్డు అధికారిగా పనిచేస్తున్న రంజిత్‌కుమార్ అస్వస్థతకు గురయ్యారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని బిల్డింగ్ సెక్షన్ వద్ద ఉన్న ఆయన అకస్మాత్తుగా కింద పడిపోయారు. దీంతో సహచర ఉద్యోగులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది.

## ఇళ్ల మధ్య కల్లు దుకాణం ఏర్పాటు నిలిపేయాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 30వ డివిజన్ మారుతినగర్‌లో ఇళ్ల మధ్యలో కల్లు దుకాణం ఏర్పాటు చేస్తున్న యత్నం వివాదాస్పదమైంది. ఇప్పటికే ఉన్న వైన్స్‌షాప్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. మళ్లీ కల్లు దుకాణం కూడా తోడైతే నివాసం ఉండడం కూడా కష్టమేనంటూ మారుతినగర్ ప్రజలు వాపోతున్నారు. ఈమేరకు గురువారం ఎక్సైజ్ కమిషనర్‌కు కార్పొరేటర్ నేతికుంట యాదయ్య ఆధ్వర్యంలో కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. వైన్స్‌షాప్ కారణంగా మహిళలు రోడ్లపై నడవాలంటే కష్టంగా ఉందని తెలిపారు. ఇప్పుడు కల్లు దుకాణం ఏర్పాటుతో మహిళలు, చిన్నపిల్లలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటారని, కల్లు దుకాణ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరారు.

# ప్రతిభ పరీక్షకు విశేష స్పందన



ప్రశ్నాపత్రం విడుదల చేస్తున్న నాయకులు

కరీంనగర్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని వాణినికేతన్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు మిల్కూరి వాసుదేవారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రశ్నాపత్రం విడుదల చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని అన్నారు. త్వరలో పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు వారిలోని భయాందోళనలు తొలగించడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా దాదాపు 50 సెంటర్లలో 3వేల మంది విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం పూజ, జిల్లా అధ్యక్షుడు అరవింద్, జిల్లా కమిటీ సభ్యులు శివ, నగర ఉపాధ్యక్షుడు ఇషాక్, గర్ల్స్ కోకన్వీనర్ నాగుల శ్రీజ, నాయకులు సందేశ్, బౌద్ధ రత్న, భోగేశ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం



పొన్నం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: బీసీల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యపడుతుందని, అందుకు బీసీ కుల గణన నాంది పలికిందని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్ అన్నారు. అసెంబ్లీలో బీసీ కుల గణన తీర్మానం కోసం కృషి చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి గురువారం ఇందిరాచౌక్ వద్ద క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాటలు తప్ప బీసీలకు చేసిందేమీ లేదన్నారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి బడ్జెట్‌లోనే రూ.8 వేల కోట్లు బీసీలకు కేటాయించిందన్నారు. బీసీ కుల గణనపై అసెంబ్లీలో తీర్మానానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీసీల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో బీసీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు చేపట్టనుందన్నారు. గతంలో పార్లమెంటులో తెలంగాణ గొంతు విప్పిన పొన్నం ప్రభాకర్ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉండడం బీసీలకు మరింతగా కలిసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమళ్ల శ్రీనివాస్, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు మల్యాల సుజిత్ కుమార్, ఎండీ తాజ్, బానోతు శ్రావణ్‌నాయక్, అనిల్ కుమార్, కొరివి అరుణ్‌కుమార్, పురం రాజేశం, అబ్దుల్ రెహమాన్, మాజీ కార్పొరేటర్ మాచర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెకు యూఎస్‌పీసీ మద్దతు



ప్రదర్శన నిర్వహిస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

కరీంనగర్: పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, విద్యుత్ చట్టాల సవరణ, స్వామినాథన్ సిఫారసుల అమలు కోసం కొన్ని రోజులుగా ఢిల్లీలో రైతులు చేస్తున్న నిరసనగా మద్దతుగా శుక్రవారం కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు యూఎస్‌పీసీ మద్దతు ఇస్తున్నట్లు డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని తెలంగాణచౌక్‌లో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ సిఫారసులు అమలు చేయడం ద్వారా వ్యవసాయరంగం అభివృద్ధి చెందుతుందని, కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి రైతులపై జరిపే దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రఘుశంకర్‌రెడ్డి, రాష్ట్ర పూర్వ ఆడిట్ కమిటీ కన్వీనర్ డి.ఏసురెడ్డి, యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర బాధ్యులు అశోక్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జావేద్, టీడీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సరేందర్, మండలాల ప్రధాన బాధ్యులు ఆర్.శంకర్, శ్రీనివాస్ ,వీరేశం, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎదురుకోళ్లను ఎగరవేసే హక్కు రజకులదే



మాట్లాడుతున్న పూసాల సంపత్

సప్తగిరికాలనీ(కరీంనగర్): రాష్ట్రంలో రెండేళ్లకోసారి జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో ఎదురుకోళ్లను ఎగరవేసే హక్కు రజకులదేనని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ అన్నారు. గురువారం తెలంగాణ రజక సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బహుజన సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో అనాదిగా వస్తున్న ఆచారాన్ని సామాజిక కట్టుబాట్లను ఆబాసు పాలు చేయడానికి కొన్ని గ్రామాల్లో జాతర్ల కమిటీ రాజకీయాలతో రజకులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈనెల 21 నుంచి జరిగే జాతరలో రజకుల ఎదురుకోళ్లను ఎగురవేయాలని ఎవరైనా అడ్డుపడితే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనపర్తి శంకర్, పొన్నాల తిరుపతి, జిల్లా అధ్యక్షుడు పైడి కొమరయ్య, పూసల శ్రీకాంత్, రావకొండ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ మెమోరియల్ క్లబ్ నూతన కార్యవర్గం



బైరం కుమార్



మాడెపు హరికృష్ణ

కరీంనగర్: నగరంలోని కార్ఖానగడ్డలో గల బీఆర్.అంబేడ్కర్ మెమోరియల్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బైరం కుమార్, ప్రధాన కార్యదర్శిగా మాడెపు హరికృష్ణ, ఉపాధ్యక్షుడిగా గొర్రె వాసు, కోశాధికారిగా కర్ర నవీన్‌కుమార్, ఆటల కార్యదర్శిగా కొరివి సాయిప్రణీత్, కార్యనిర్వాహక కార్యదర్శిగా బత్తుల లక్ష్మణ్‌లు ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి కొరివి వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బైరం కుమార్ మాట్లాడుతూ క్లబ్ అభివృద్ధికి పాటుపడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. సంఘం సభ్యులకు జవాబుదారీగా పని చేస్తామని తెలిపారు. ఈనెల 18న క్లబ్‌లో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కుల బాంధవులందరూ రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్లు ఎడ్ల రాధకిషన్, ఎడ్ల రాంశంకర్, కనమల్ల నరసింహా స్వామి, దామెర రామస్వామి, పిట్టల స్వామి, సుదర్శన్, పాతకుల భూమయ్య, రొడ్డ జగదీశ్వర్, చిగిరి మన్ మోహన్, మేకల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## లోక్‌సత్తా శ్రీనివాస్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న వినియోగదారుల మండలి సభ్యులు

కరీంనగర్: లోక్‌సత్తా ఉద్యమనేత నరేడ్ల శ్రీనివాస్ ఆశయ సాధనకు నేటి యువత ప్రతిన బూనాలని కరీంనగర్ వినియోగదారుల మండలి గౌరవ అధ్యక్షుడు ప్రకాశ్ హోల్లా అన్నారు. గురువారం ఫిలింభవన్‌లో లోక్‌సత్తా ఉద్యమనేత నరేడ్ల శ్రీనివాస్ తృతీయ వర్ధంతి సందర్భంగా శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శ్రీనివాస్ ఆశయాల దారిలో నిరంతరం శ్రమించడం జరుగుతుందని, అందుకు అందరి సహకారం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు చంద్రప్రభాకర్, వెంకటేశ్వర్‌రావు, కోల రామచంద్రారెడ్డి, లక్ష్మణ్‌కుమార్, శంకర్, దామోదర్, సయ్యద్ ముజఫర్, తదితరులు పాల్గొన్నారు.

## హెడ్‌కానిస్టేబుల్‌కు సిల్వర్ మెడల్



మెడల్ అందుకుంటున్న శ్రీనివాస్

కరీంనగర్‌క్రైం: ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరిగిన 67వ ఆల్ ఆండియా పోలీసు డ్యూటీ మీట్‌లో గురువారం కరీంనగర్ పోలీసుశాఖలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కాసుల శ్రీనివాస్ సిల్వర్ మెడల్ అందుకున్నారు. పోలీసు వీడియోగ్రఫీలో సిల్వర్‌మెడల్, రన్నర్‌ట్రోఫీని సాధించాడు. ప్రస్తుతం శ్రీనివాస్ సీఐడీ విభాగంలో పనిచేస్తున్నాడు.

• ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30

# అన్వేషకుల అద్భుత దీపం

'విజయం అంటే ఏమిటి?' అనే ప్రశ్నకు వీరి నోటి నుంచి వినిపించే సమాధానం... ఇష్టం. 'ఇష్టం' ఉన్నచోట 'ఆసక్తి' ఉంటుంది. 'ఆసక్తి' ఉన్నచోట 'అన్వేషణ' ఉంటుంది. 'అన్వేషణ' ఉన్నచోట 'అద్భుతం' చోటు చేసుకుంటుంది. 'ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30 -2024' తాజా జాబితాలో చోటు సంపాదించిన వివిధ రంగాల యువతారల ప్రయాణం 'అన్వేషణ'తో మొదలైంది....



**సీతా మహాలక్ష్మి నారాయణ్ (29)**
ఫైనాన్స్

'ప్రేమ్‌జీ ఇన్వెస్ట్' చరిత్రలో సీతామహాలక్ష్మి నారాయణ్ 'యంగెస్ట్‌-ఎవర్ వైస్ ప్రెసిడెంట్'గా రికార్డ్ సృష్టించింది. ఎంఎస్‌ఎంఇ ఫైనాన్సింగ్, క్రాస్-బార్డర్ సప్లై చైన్ ఫైనాన్సింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్‌లు మన దేశంలో 'కీ గ్రోత్ ఏరియా'లు అవుతాయని అంటుంది సీతామహాలక్ష్మి నారాయణ్. నలభై ఏళ్లు నిండకముందే సొంతంగా ఓ ప్రైవేట్ ఈక్విటీ సంస్థను ప్రారంభించాలనుకుంటోంది.



**అజింక్యా ధారియా (28)**
క్లీన్ ఎనర్జీ అండ్ క్లైమెట్ చేంజ్

పుణె సమీపంలోని ధారియాలో ఒక ల్యాండ్ ఫిల్‌ను చూశాడు అజింక్యా ధారియా. అక్కడ ఒక వ్యక్తి వట్టి చేతులతో, వాడి పారేసిన శానిటరీ న్యాప్‌కిన్స్, డైపర్లను తీసుకెళ్తుండటాన్ని చూశాడు. ఒళ్లు జలదరించినట్లు అనిపించింది. 'ఈ సమస్యకు ఒక పరిష్కారం కనుక్కోవాలి' అనుకున్నాడు. ఆ ఆలోచనే 'ప్యాడ్‌కేర్‌ల్యాబ్స్' ప్రారంభించడానికి దారి తీసింది. 'ప్యాడ్‌కేర్‌ల్యాబ్స్' ద్వారా ప్యాడ్‌కేర్ బిన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చాడు. వీటి ద్వారా శానిటరీ న్యాప్‌కిన్‌లు ఎటువంటి వాసన, బాక్టీరియా పెరుగుదల లేకుండా 30 రోజుల వరకు నిల్వ చేయవచ్చు. ఈ ప్యాడ్‌ల నుంచి సేకరించిన వాటిని మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ(ఎంఆర్‌ఎఫ్)కు తీసుకువస్తారు. వీటిని పాడ్‌కేర్ పేటెంట్ టెక్నాలజీ ద్వారా ప్రాసెస్ చేస్తారు.



**అభిషేక్ దురానీ (28) నేత్ర అజ్జంపూర్ (28)**
డిజైన్

డిజైనింగ్ ప్రపంచంలో క్రియేటివిటీ అనేది విజయానికి ప్రథమ ప్రమాణం. ఆర్కిటెక్ట్ ద్వయం అభిషేక్ దురానీ, నేత్ర అజ్జంపూర్‌లు డైనమిక్ డిజైనింగ్‌పై ఉండే అపారమైన పాషన్‌తో 'స్టూడియో సార్డెడ్'కు శ్రీకారం చుట్టారు. డిజైనింగ్‌పై ఆసక్తి ఉన్న యువతరానికి ఈ స్టూడియో సృజనాత్మక స్ఫూర్తిగా నిలిచింది. 'డిజైనింగ్ ప్రపంచంలో వారి పనితీరు అసాధారణమైనది. కొత్తదనాన్ని ప్రతిఫలించేది' అని ఇద్దరు సృజనకారులకు కితాబు ఇచ్చారు మెక్సికన్ ఆర్కిటెక్ట్ గుస్తవో కర్మోన.



**విరాజ్ ఖన్నా (28)**
ఆర్ట్

విరాజ్ ఖన్నా ఆర్టిస్ట్ కావాలని ఎప్పుడూ అనుకోలేదు. కోవిడ్ మహమ్మారి రోజుల్లో అనుకోకుండా చిత్రకళతో ప్రేమలో పడ్డాడు. ఫ్యాషన్ మ్యాగజైన్‌ల నుంచి కొలాజ్‌లను తయారుచేయడం ద్వారా చిత్రకళకు బీజం పడింది. ఆ తరువాత పెయింటింగ్, ఎంబ్రాయిడరీ, శిల్ప కళలో నైపుణ్యం సంపాదించాడు. 'ఆర్ట్ అంటే ఇలా ఉండాలి అనే నిర్వచనాల పరిధిలో తన ఆర్ట్‌ను సృష్టించలేదు. ఎక్కడా గిరిగీసుకోలేదు. ఆర్ట్ విషయంలో తీసుకున్న స్వేచ్ఛ అతడి నిజమైన బలం' అంటున్నాడు కోల్‌కతాలోని 'గ్యాలరీ ఆర్ట్ ఎక్స్‌పోజర్' డైరెక్టర్ సోమక్ మిత్రా.



**అనుష్క రాథోడ్ (25)**
డిజిటల్ కంటెంట్

లాక్‌డౌన్ సమయంలో యువతలో చాలామంది లాగే అనుష్క రాథోడ్ సోషల్ మీడియాలో తలమునకలైపోయింది. ఆ సమయంలోనే 'సోషల్ మీడియాను ఎలా ఉపయోగించుకోవాలి?' అనే విషయంపై దృష్టి పెట్టింది. ట్యాక్సేషన్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసిన అనుష్క ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్‌లలో అనుభవం సంపాదించింది. ఆ అనుభవంతో స్టాక్‌మార్కెట్‌కు సంబంధించిన విషయాలను సోషల్ మీడియా వేదికగా సరళంగా చెప్పడం మొదలు పెట్టింది. కంటెంట్ క్రియేటర్‌గా పెద్ద విజయం సాధించింది.



**రామక్రిష్ణ మెండు (26), చిరాగ్ జైన్ (28)**
ఇండస్ట్రీ అండ్ మాన్యుఫాక్చరింగ్

నిఘా, లాజిస్టిక్ డెలివరీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కౌడ్ కంట్రోల్, వ్యవసాయం, వీడియో మానిటరింగ్... మొదలైన వాటి కోసం సులభంగా ఉపయోగించగలిగే మేడ్ ఇన్ ఇండియా డ్రోన్‌లను సృష్టించారు రామక్రిష్ణ, చిరాగ్‌లు. 'ఎండ్యూర్ ఎయిర్ సిస్టమ్' స్టార్టప్‌తో విజయపథంలో దూసుకుపోతున్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని కఠినమైన భూభాగాల నుంచి ముంబైలోని సముద్ర పరిస్థితులను తట్టుకోవడం వరకు రకరకాల సవాళ్లను ఎదుర్కోవడంలో వీరి డ్రోన్‌లు సామర్థ్యాన్ని చాటుకున్నాయి.



**నవజీత్ కర్కెర (29) జగత్ బిడ్డప్ప (28)**
కన్స్యూమర్ టెక్

యూత్‌కు హెడ్‌ఫోన్స్ క్లోజ్‌ఫ్రెండ్స్. అయితే నవజీత్ కర్కెర, జగత్ బిడ్డప్పలు మాత్రం 'హెడ్‌ఫోన్‌లు ఇంకాస్త మెరుగ్గా ఉంటే ఎలా ఉంటుంది' అని ఆలోచించేవారు. ఆ ఆలోచన నుంచి పుట్టిందే రప్ఫర్ సోనిక్ ల్యాంబ్ హెడ్‌ఫోన్‌లు. 'శ్రోతలకు, సంగీతానికి మధ్య సరియైన వాహికగా పనిచేస్తున్నాం' అంటున్నాడు రప్ఫర్ ఇన్నోవేషన్ ల్యాబ్స్ కో-ఫౌండర్, సీఇవో నవజీత్ కర్కెర. ఈ హెడ్‌ఫోన్‌ల కోసం పేటెంట్ పొందిన హైబ్రిడ్ డ్రైవర్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద అంతర్జాతీయ సౌండ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ హబ్ సౌండ్ హబ్ డెన్మార్క్ 'సౌండ్ టెక్ యాక్సిలరేటర్ ప్రోగ్రాం' కోసం ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన ఏడు స్టార్టప్‌లలో సోనిక్ లాంబ్ ఒకటి. ఈ హెడ్‌ఫోన్‌లలో 60 శాతం అమెరికాలోనే అమ్ముడవుతున్నాయి.

**'ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30-2024 జాబితాలోని మరికొందరు యువతారలు...**

రష్మిక మందన్న, రాధిక మదన్-ఎంటర్‌టైన్‌మెంట్, అంకిత్ అలోక్ బగారియ, అభ గాబ్రీ-అగ్రిటెక్, శ్రేయాన్స్ చోప్రా, స్నేహ బిస్వాస్-బీ2బీ, అనుపమ్ కుమార్, అరవింద్ భరద్వాజ్-క్లీన్ ఎనర్జీ అండ్ క్లైమెట్, క్రిస్టఫర్ రిచర్డ్-డిజైన్, దిగ్విజ్ జాదవ్-డిజిటల్ కంటెంట్, అదిత్ పలిచా, కైవల్య వోహ్రా, వరుణ్ సంఘీ-ఇ కామర్స్ అండ్ రిటైల్, అనుపమ్ పెదర్ల,శశాంక్ రెడ్డి గుజ్జుల-ఎడ్యుకేషన్, పారుల్ చౌధురి, సుమిత్, జ్యోతి యర్రాజీ-స్పోర్ట్స్, హున్ని భాగ్‌చందానీ-సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, అదితి సైగల్-మ్యూజిక్, నదీమ్ అష్మద్, ఆర్యన్ చౌహాన్-హెల్త్‌కేర్, అభిషేక్ అగర్వాల్-ఫుడ్ అండ్ హాస్పిటాలిటీ, విష్ణు ఆచార్య-ఫైనాన్స్, ఉదయ్ కుమార్-ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ.

## యువర్స్

• టుక్... టాక్

### శాంసంగ్ గెలాక్సీ ఎస్ 24 ఆల్ట్రా



డిస్‌ప్లే: 6.8 అంగుళాలు
రిజల్యూషన్: 1440X3120 పిక్సెల్స్
బరువు: 232 గ్రా.
వోయస్: ఆండ్రాయిడ్ 14 మెమరీ: 256జీబి 12జీబి ర్యామ్/512 జీబి 12జీబి ర్యామ్ బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ కనెక్టివిటీ: 5జీ

### హానర్ చాయిస్ వాచ్

డిస్‌ప్లే: 1.95 అంగుళాలు బ్యాటరీ: 300 ఎంఏహెచ్
రిజల్యూషన్: 410X 502 పిక్సెల్స్ • బ్లూటూత్ 5.3 కనెక్టివిటీ
• హెల్త్ అండ్ ఫిట్‌నెస్ ట్రాకర్స్



### లెనోవా ఎల్‌వోక్యూ 15 గేమింగ్ ల్యాప్‌టాప్



డిస్‌ప్లే: 15.6 ఎఫ్‌హెచ్‌డీ • యాంటీ గ్లేర్
కెమెరా: 1080పీ ఎఫ్‌హెచ్‌డీ విత్ డ్యూయల్ మైక్రోఫోన్ అండ్ ప్రైవసీ షట్టర్
వోఎస్: విండోస్ 11 హోమ్ 64
• స్టోరేజ్: 512జీబి




**నథింగ్ టు రైట్ హోమ్ ఎబౌట్**

చెప్పుకోదగ్గ విషయం కాదు, ముఖ్యమైన విషయం కాదు అనుకునే సందర్భంలో వాడే మాట నథింగ్ టు రైట్ హోమ్ ఎబౌట్
**ఉదా:** వుయ్ సా ఏ మూవీ టుడే అండ్ ఇట్ వాజ్ నథింగ్ టు రైట్ హోమ్ ఎబౌట్. ఇట్ వాజ్ జస్ట్ ఏ టిపికల్ యాక్షన్ మూవీ.

**ది గిఫ్ట్ ఆఫ్ ది గ్యాబ్**

ఆకట్టుకునేలా మాట్లాడే వారికి సంబంధించి ఉపయోగించే మాట... ది గిఫ్ట్ ఆఫ్ ది గ్యాబ్
**ఉదా:** ఆల్ గుడ్ సేల్స్‌పీపుల్ హ్యావ్ ది గిఫ్ట్ ఆఫ్ ది గ్యాబ్. సో పీపుల్ ట్రస్ట్ దెమ్ అండ్ బిలీవ్ వాటెవర్ దే సే

## సినిమా


• రణ్‌వీర్ సింగ్

### సెప్టెంబరులో స్టార్ట్

బాలీవుడ్ కొత్త డాన్‌గా రణ్‌వీర్ సింగ్ మారనున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు వచ్చిన హిందీ 'డాన్' ఫ్రాంచైజీ చిత్రాల్లో ముందు 1978లో వచ్చిన 'డాన్'లో అమితాబ్ బచ్చన్, ఆ తర్వాత 2006లో వచ్చిన 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్', 'డాన్ 2'లో షారుక్ ఖాన్ హీరోలుగా నటించారు. అమితాబ్, షారుక్ డాన్లుగా మెప్పించారు. ఇప్పుడు కొత్త తరం డాన్‌గా బాలీవుడ్ తెరపైకి రణ్‌వీర్‌సింగ్ రానున్నారు. 'డాన్ 3'లో రణ్‌వీర్ హీరోగా నటిస్తారని, 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్', 'డాన్ 2' చిత్రాలకు దర్శకత్వం వహించిన ఫర్హాన్ అక్తర్ ఈ సినిమాను తెరకెక్కిస్తారని ఇప్పటికే అధికారిక ప్రకటన వెల్లడైంది. కాగా ఈ సినిమా చిత్రీకరణను సెప్టెంబరులో ప్రారంభించేలా ఫర్హాన్ అక్తర్ ప్లాన్స్ రెడీ చేస్తున్నారని బాలీవుడ్ సమాచారం. ప్రస్తుతం అజయ్ దేవగన్ మెయిన్ లీడ్ చేస్తున్న 'సింగమ్ ఎగైన్' సినిమాలో రణ్‌వీర్ సింగ్ ఓ లీడ్ రోల్ చేస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమాలో తన వంతు చిత్రీకరణను పూర్తి చేసుకున్న తర్వాత 'డాన్ 3' షూటింగ్‌లో పాల్గొంటారట రణ్‌వీర్ సింగ్. ఈ చిత్రం కోసం స్పెషల్‌గా మేకోవర్ కానున్నారు. ఇక 'డాన్ 3' తర్వాత రణ్‌వీర్ సూపర్ హీరో ఫిల్మ్ 'శక్తిమాన్' చిత్రీకరణలో పాల్గొంటారు.


• అల్లు అర్జున్

### బెర్లిన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు అల్లు అర్జున్

జర్మనీ వెళ్లారు హీరో అల్లు అర్జున్. ఈ ఏడాది ఫిబ్రవరి 15 (గురువారం) నుంచి ఫిబ్రవరి 25వరకు జర్మనీలో జరుగుతున్న 74వ బెర్లిన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొంటారు అల్లు అర్జున్. ఈ చిత్రోత్సవాల్లో భారతీయ సినిమా ప్రాముఖ్యత, చరిత్ర గురించిన అంశాలను అల్లు అర్జున్ మాట్లాడనున్నారని తెలిసింది. అంతేకాదు...ఈ ఫెస్టివల్‌లో అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న 'పుష్ప' సినిమాలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' ప్రత్యేక ప్రదర్శన కూడా ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రం ప్రదర్శన అనంతరం అంతర్జాతీయ ఫిల్మ్ మేకర్స్, మార్కెటింగ్ స్ట్రాటజిస్ట్‌లతో అల్లు అర్జున్ మాట్లాడతారట. ఇక బెర్లిన్ ఫెస్టివల్ నుంచి తిరిగొచ్చిన తర్వాత 'పుష్ప' మలి భాగం 'పుష్ప: ది రూల్' షూటింగ్‌లో పాల్గొంటారు అల్లు అర్జున్. రష్మికా మందన్నా, ఫాహద్ ఫాజిల్, సునీల్, అనసూయ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌లు నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.

### యుద్ధానికి పిలుపు


• 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్: ది న్యూ ఎంపైర్' పోస్టర్

అమెరికన్ ఫిల్మ్ 'గాడ్జిల్లా' ఫ్రాంచైజీలో వస్తున్న తాజా చిత్రం 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్: ది న్యూ ఎంపైర్' (2024). రెబెక్కా హాల్, బ్రియాన్ టైరీ హెన్రీ, డన్ స్టీవెన్స్, కైలీ హోట్లీ, అలెక్స్ ఫెర్న్స్, ఫలా చెన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఆడమ్ విన్‌గార్డ్ దర్శకుడు. భారీ బడ్జెట్‌తో లెజెండరీ పిక్చర్స్ నిర్మించిన ఈ సినిమాను వార్నర్ బ్రదర్స్ రిలీజ్ చేస్తున్నారు. 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్: ది న్యూ ఎంపైర్' చిత్రం అంతర్జాతీయంగా మార్చి 27న, యునైటెడ్ స్టేట్స్‌లో మార్చి 29న, జపాన్‌లో ఏప్రిల్ 26న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్: ది న్యూ ఎంపైర్' నుంచి లేటెస్ట్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 'మేము ఓ సిగ్నల్‌ని కనుగొన్నాం', 'ఏదో ఊహించనది జరగబోతోంది', 'అది కేవలం సిగ్నల్ మాత్రమే కాదు.. యుద్ధానికి పిలుపు' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఇక 2021లో వచ్చిన 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్'కి సీక్వెల్‌గా 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్: ది న్యూ ఎంపైర్' చిత్రం తెరకెక్కింది.

### ఆ నమ్మకానికి రుణపడి ఉన్నాం

- సందీప్ కిషన్


• కావ్య, సందీప్ కిషన్, వర్ష

''ఊరు పేరు భైరవకోన' సినిమాకి దాదాపు వంద ప్రీమియర్ షోలు పడ్డాయి. థియేటర్స్‌కి వచ్చిన ప్రతి ప్రేక్షకుడికి థ్యాంక్స్. మా మూవీ పాటలు, ట్రైలర్, ప్రీమియర్‌కు మీరు (ప్రేక్షకులు) ఇచ్చిన స్పందన, మా మీద మీరు పెట్టుకున్న నమ్మకానికి రుణపడి ఉన్నాం'' అన్నారు సందీప్ కిషన్. వీఐ ఆనంద్ దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా, కావ్యా థాపర్, వర్ష బొల్లమ్మ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించారు. ఈ సినిమా నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన బ్లాక్ బస్టర్ ప్రీమియర్స్ సక్సెస్ ప్రెస్‌మీట్‌లో అనిల్ సుంకర మాట్లాడుతూ–''మా సినిమా ప్రీమియర్స్‌కే కోటి రూపాయల వసూళ్లు సాధించడం ఆనందాన్నిచ్చింది'' అన్నారు. ''ఈ రోజు రిలీజవుతున్న మా సినిమాని అందరూ చూడాలి'' అన్నారు వీఐ ఆనంద్, రాజేశ్ దండా.

### ఆలోచింపజేసే సుందరం మాస్టర్

''నేను ఇండస్ట్రీకి వచ్చి పదేళ్లవుతోంది. ప్రతీ సారి ఏదో కొత్తగా చేయాలని ప్రయత్నిస్తుంటాను. సుందరం మాస్టర్ పాత్రను చూస్తే మనలో ఒకరిని చూసినట్టుగానే అనిపిస్తుంది. 'సుందరం మాస్టర్'లో కామెడీతో పాటు డ్రామా ఉంటుంది. ఇది అందర్నీ ఆలోచింపజేసే చిత్రమవుతుంది'' అని హర్ష చెముడు అన్నారు. హాస్య నటుడిగా ప్రేక్షకులను అలరిస్తున్న హర్ష చెముడు హీరోగా నటించిన చిత్రం 'సుందరం మాస్టర్'. కల్యాణ్ సంతోష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దివ్య శ్రీపాద హీరోయిన్. హీరో రవితేజ, సుధీర్ కుమార్ కుర్రు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న రిలీజ్ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ని హీరో చిరంజీవి విడుదల చేసి, సినిమా విజయం సాధించాలన్నారు. ''ఓ గిరిజన గ్రామంలో అందరూ స్పష్టంగా ఇంగ్లిష్ ఎలా మాట్లాడతారనే దానికి గల కారణం మా సినిమా చూస్తే తెలుస్తుంది'' అన్నారు కల్యాణ్ సంతోష్. ''సినిమా చాలా బాగా వచ్చింది'' అన్నారు సుధీర్ కుమార్ కుర్రు.



• హర్ష, దివ్య శ్రీపాద


• రుక్మిణీ వసంత్
• శివ కార్తికేయన్

### యాక్షన్ ఎంటర్‌టైనర్ షురూ


శివ కార్తికేయన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఓ సినిమా షురూ అయింది. శ్రీ లక్ష్మీ మూవీస్ బ్యానర్‌పై తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఈ మూవీలో కన్నడ నటి రుక్మిణీ వసంత్ కథానాయిక. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న చిత్రమిది. మురుగదాస్‌గారు తన పాపులర్ స్టోరీ టెల్లింగ్ స్టయిల్‌లో ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. వరుస బ్లాక్‌బస్టర్‌లను అందుకుంటున్న శివకార్తికేయన్ కెరీర్‌లో ఈ మూవీ బిగ్గెస్ట్, గ్రాండియస్ట్ చిత్రం కానుంది. గత సినిమాల్లో చూసినట్లు కాకుండా ఈ సినిమాలో పూర్తిగా ప్రత్యేకమైన, స్టైలిష్ లుక్‌లో కనిపిస్తారు శివ కార్తికేయన్. ఈ చిత్రం ప్రేక్షకులకు హై యాక్షన్-ప్యాక్డ్ అనుభూతిని అందిస్తుంది. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే తెలియజేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, కెమెరా: సుదీప్ ఎలామన్.

### గ్రామీణ ప్రేమకథ


• రక్షిత్, కోమలి

గ్రామీణ ప్రేమకథగా రూపొందిన చిత్రం 'శశివదనే'. రక్షిత్ అట్లూరి, కోమలి హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాకు సాయి మోహన్ ఉబ్బన దర్శకుడు. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోదాల నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాను ఏప్రిల్ 5న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు. 'మనసులో పుట్టే ప్రేమ మచ్చలేనిదైతే ఆ ప్రేమకు మరణం కూడా మనతోనే' అనే డైలాగ్ విడుదలైన పోస్టర్‌పై ఉంది.

### గూఢచారితో...


• ఇమ్రాన్ హష్మీ

బాలీవుడ్‌లో రొమాంటిక్ హీరోగా పేరొందిన ఇమ్రాన్ హష్మీ తాజాగా తెలుగులో 'జీ 2'లో నటించడానికి పచ్చజెండా ఊపారు. అడివి శేష్ నటించిన హిట్ మూవీ 'గూఢచారి' (2018)కి సీక్వెల్‌గా 'జీ 2 '(గూఢచారి 2) రూపొందుతోంది. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇమ్రాన్ హష్మీ పోస్టర్‌ని 'ఎక్స్'లో షేర్ చేసిన అడివి శేష్.. 'జీ 2' యూనివర్స్‌లోకి బ్రిలియంట్ యాక్టర్ ఇమ్రాన్ హష్మీ సార్‌కి స్వాగతం'' అని పోస్ట్ చేశారు. దీనికి ఇమ్రాన్ హష్మీ రిప్లయ్ ఇస్తూ.. 'సార్ అని ఫార్మాలిటీస్ అవసరం లేదు.. ఇమ్రాన్ అని పిలువు. మీ సినిమాలో భాగం అయినందుకు హ్యాపీగా ఉంది'' అని పోస్ట్ చేసారు.

### సెంథిల్ కుమార్ సతీమణి ఇకలేరు


• రూహి

ప్రముఖ కెమెరామేన్ సెంథిల్ కుమార్ (ఛత్రపతి, మగధీర, బాహుబలి, ఆర్ఆర్ఆర్) ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన సతీమణి రూహి మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఆమె తుదిశ్వాస విడిచారు. వృత్తి రీత్యా యోగా శిక్షకురాలు అయిన రూహి చాలా కాలం పాటు హీరోయిన్ అనుష్క శెట్టితో కలిసి యోగా క్లాసులు నిర్వహించారు. సెంథిల్ కుమార్-రూహిలకు 2009లో వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. రూహి మరణం పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

### స్వచ్ఛమైన ప్రేమ

ప్రవీణ్ రాజ్‌కుమార్ హీరోగా శశికా టిక్కో, ఆషు రెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పద్మ వ్యూహంలో చక్రధారి'. సంజయ్ రెడ్డి బంగారపు దర్శకత్వంలో కె.ఓ. రామరాజు నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన టైటిల్ లాంచ్ వేడుకలో దర్శకులు శ్రీరామ్ ఆదిత్య, కృష్ణ చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ''రాయలసీమ ప్రాంతం అంటే ఇన్నాళ్లు గొడవలు, ఫ్యాక్షన్.. ఇవే చూశారు. ఆ ప్రాంతంలో ఉన్న స్వచ్ఛమైన ప్రేమని మా సినిమాలో చూపించబోతున్నాం'' అన్నారు సంజయ్‌రెడ్డి బంగారపు. ''లవ్, ఎమోషనల్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రమిది'' అన్నారు ప్రవీణ్ రాజ్‌కుమార్.


• ప్రవీణ్, ఆషురెడ్డి

సాక్షి బిజినెస్
శుక్రవారం
16-2-2024

**స్టాక్ మార్కెట్లు**

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|
| 288 | 71 |
| 72,050 | 21,911 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

**విదేశీ సూచీలు** (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 15,859 | ▲ | 1 |
| డోజోన్స్ | 38,626 | ▲ | 202 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,598 | ▲ | 29 |
| డాక్స్ | 17,047 | ▲ | 101 |
| షాంఘై (శుక్రవారం ముగింపు) | 2,866 | ▲ | 36 |
| నికాయ్ | 38,158 | ▲ | 455 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** రూ.లలో

ముంబై

| | | | |
|---|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 61,508 | ▼ | 82 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 61,262 | ▼ | 82 |
| వెండి (కిలో) | 70,203 | ▲ | 1,053 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 82.60 | 83.62 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 103.17 | 105.73 |
| € | యూరో | ఎస్‌బీఐ | 87.99 | 90.34 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 54.68 | 55.92 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 52.94 | 54.88 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 59.31 | 63.00 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.24 | 22.81 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 21.71 | 23.51 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.42 | 12.50 |

# టాటా ప్లేలో రిలయన్స్‌కు వాటా!

**30 శాతం డిస్నీ వాటాపై కన్ను**




**ముంబై:** శాటిలైట్ టీవీ ప్రసారాల సంస్థ టాటా ప్లేలో వాటా కొనుగోలుకి ముకేశ్ అంబానీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం టాటా ప్లేలో టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌కు 50.2 శాతం వాటా ఉంది. మీడియా దిగ్గజం వాల్ట్ డిస్నీ కంపెనీ 29.8 శాతం వాటాను కలిగి ఉంది. అంతేకాకుండా సింగపూర్ ఫండ్ టిమాసెక్ చేతిలో మిగిలిన వాటా(20 శాతం) ఉంది. కాగా.. వాల్ట్ డిస్నీ వాటా కొనుగోలుకి ఆర్ఐఎల్ చర్చలు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తద్వారా దేశీయంగా టీవీ ప్రసారాలు, పంపిణీ విభాగంలో ఆర్ఐఎల్ మరింత పట్టుసాధించే వ్యూహంతో ఉన్నట్లు తెలియజేశాయి. ఒకవేళ చర్చలు సఫలమైతే తొలిసారి ఒక భాగస్వామ్య సంస్థ(జేవీ)లో టాటా గ్రూప్, ముకేశ్ అంబానీ గ్రూప్ భాగస్వాములయ్యే అవకాశముంది. ఇది టాటా ప్లే ప్లాట్‌ఫామ్ ద్వారా జియో సినిమా ప్రసారాలు మరింత విస్తరించేందుకు దోహదం చేస్తుంది. టాటా ప్లే పబ్లిక్ ఇష్యూలో భాగంగా ఇంతక్రితం వాటాను విక్రయించాలని డిస్నీ భావించింది. అయితే లిస్టింగ్ ప్రణాళికలు వాయిదాపడటంతో వాటా విక్రయానికి ఇతర అవకాశాలను అన్వేషిస్తోంది. టాటా ప్లే, ఆర్ఐఎల్, డిస్నీ ప్రతినిధులెవరూ ఈ అంశంపై స్పందించకపోవడం గమనార్హం! కాగా.. బిలియన్ డాలర్ల విలువలో టాటా ప్లేలో 20 శాతం వాటా అమ్మకానికి గతేడాది టిమాసెక్ సైతం టాటా గ్రూప్‌తో చర్చలకు తెరతీసింది. అయితే ఎలాంటి ఒప్పందమూ కుదరలేదు. డిస్నీ వాటా ఆర్ఐఎల్ సొంతమైతే మొత్తం జియోసినిమా కంటెంట్ బకెట్‌ను టాటా ప్లే కస్టమర్లకు ఆఫర్ చేసే వీలున్నట్లు పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

## స్పోర్ట్స్ హాస్పిటాలిటీ వ్యాపారంలోకి ఓయో

**12 నగరాల్లో 100 హోటల్స్ షార్ట్‌లిస్ట్**

**న్యూఢిల్లీ:** ఆతిథ్య రంగ టెక్ సంస్థ ఓయో తాజాగా స్పోర్ట్స్ హాస్పిటాలిటీ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. భారీ స్థాయి క్రీడల పోటీల నిర్వహణకు సంబంధించి ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, పుణె సహా 12 కీలక నగరాల్లో 100 హోటల్స్‌ను షార్ట్‌లిస్ట్ చేసింది. వివిధ స్పోర్ట్స్ ఈవెంట్లలో పాల్గొనే క్రీడాకారులు, అధికారులకు వసతి సదుపాయం కల్పించేందుకు ఇవి ఉపయోగపడగలవని సంస్థ తెలిపింది. స్పోర్ట్స్ టీమ్‌లు, పెద్ద బృందాల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ప్యాకేజీలు, గ్రూప్ బుకింగ్ ఆప్షన్స్ ఇస్తామని ఓయో వివరించింది. అలాగే క్రీడాకారులు, ఈవెంట్లను వీక్షించేందుకు వచ్చే వారి ఆహార, రవాణా అవసరాలను తీర్చే థర్డ్–పార్టీ ఏజెన్సీల సేవలను కూడా అందుబాటులో ఉంచుతామని పేర్కొంది.




# రెడ్ సీ సవాళ్లున్నా.. ఎగుమతులు రయ్!

- జనవరిలో 3.12 శాతం పురోగతి
- విలువ 37 బిలియన్ డాలర్లు
- మూడు నెలల గరిష్ట స్థాయి
- తొమ్మిది నెలల కనిష్టానికి వాణిజ్యలోటు



**న్యూఢిల్లీ:** ఎర్ర సముద్రం ప్రాంతంలో అలాగే అంతర్జాతీయంగా నెలకొన్న సంక్షోభ పరిస్థితులను జనవరిలో భారత్ వస్తు ఎగుమతులు అధిగమించాయి. 2023 జనవరిలో పోల్చితే 2024 జనవరిలో భారత్ ఎగుమతులు 3.12 శాతం పెరిగాయి. విలువలో 36.92 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇక రెండు నెలల క్షీణత అనంతరం జనవరిలో వస్తు దిగుమతులు 3 శాతం పెరిగి 54.41 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వెరసి ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్యలోటు 17.49 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. గడచిన తొమ్మిది నెలల్లో ఇంత తక్కువ స్థాయి వాణిజ్యలోటు ఇదే తొలిసారి. ఎర్ర సముద్రం సంక్షోభం ఎగుమతిదారులపై ప్రభావం చూపుతోంది. వారు తమ వస్తువులను యూరప్– ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలకు రవాణా చేయడానికి – ఆఫ్రికాను చుడుతూ కేప్ ఆఫ్ గాడ్ హోప్ మార్గాన్ని ఎంచుకోవాల్సి వస్తోంది. దీనితో రవాణా వ్యయం తడిసి మోపెడవుతోంది. సరకు రవాణాలో 14 రోజుల ఆలస్యంతోపాటు బీమా వ్యయాలు కూడా పెరిగాయి. యెమెన్‌కు చెందిన హౌతీ మిలిటెంట్ల దాడుల కారణంగా ఎర్ర సముద్రం– మధ్యధరా సముద్రాన్ని హిందూ మహాసముద్రానికి కలిపే కీలకమైన షిప్పింగ్ మార్గం బాబ్–ఎల్–మండేబ్ జల సంధి చుట్టూ పరిస్థితి తీవ్రరూపం దాల్చింది.

**ముఖ్యాంశాలు...**

- సమీక్షా నెల జనవరిలో క్రూడ్ ఆయిల్ దిగుమతులు 4.33 శాతం పెరిగి 16.56 బిలియన్ డాలర్లకు ఎగశాయి.
- పసిడి దిగుమతులు ఏకంగా 174 శాతం పెరిగి 1.9 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

**10 నెలల్లో క్షీణత**

కాగా, ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి వరకూ 10 నెలల కాలంలో ఎగుమతుల విలువ 4.89% క్షీణించి 353.92 బిలియన్ డాలర్లకు పడ్డాయి. దిగుమతులు కూడా 6.71% పడిపోయి 561.12 బిలియన్ డాలర్లకు చేరాయి. వెరసి వాణిజ్యలోటు 207.2 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. మొత్తం దిగుమతుల విలువలో క్రూడ్ ఆయిల్ విలువ 15.91% పడిపోయి 146.75 బిలియన్ డాలర్లుగా నమోదైంది. పసిడి దిగుమతులు 301.7% పెరిగి 38 బిలియన్ డాలర్లకు చేరాయి.

**సేవలు..ఓకే**

ఇదిలాఉండగా, భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో మెజారిటీ వాటా కలిగిన సేవల రంగం జనవరిలో 32.8 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు జరిపింది. 2023లో ఈ విలువ 28 బిలియన్ డాలర్లు. ఇక ఏప్రిల్ నుంచి జనవరి మధ్య ఈ విలువ 267.5 బిలియన్ డాలర్ల నుంచి 284.45 బిలియన్ డాలర్లకు ఎగసింది.

## హయత్ హోటల్స్ ఐపీవో 21నుంచి

**ధరల శ్రేణి షేరుకి రూ.342–360**



**న్యూఢిల్లీ:** ఆతిథ్య రంగ దిగ్గజం జూనిపర్ హోటల్స్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు షేరుకి రూ.342–360 చొప్పున ధరల శ్రేణిని ప్రకటించింది. హయత్ బ్రాండ్‌తో హోటళ్లను నిర్వహించే కంపెనీ ఇష్యూ ఈ నెల 21న ప్రారంభమై 23న ముగియనుంది. దీనిలో భాగంగా మొత్తం రూ. 1,800 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. వెరసి రూ. 1,800 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 40 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. జూనిపర్ హోటల్స్‌ను సరఫ్ హోటల్స్‌తోపాటు.. అనుబంధ సంస్థ జూనిపర్ ఇన్వెస్ట్‌మెంట్స్, టూ సీస్ హోల్డింగ్స్ ప్రమోట్ చేశాయి. ఆతిథ్య రంగ గ్లోబల్ కంపెనీ హయత్ హోటల్స్ కార్పొరేషన్‌కు పరోక్ష అనుబంధ సంస్థ ఇది. కాగా.. జూనిపర్ హోటల్స్ ఏడు హోటళ్లు, సర్వీస్‌డ్ అపార్ట్‌మెంట్లను నిర్వహిస్తోంది. 2023 సెప్టెంబర్‌కల్లా మొత్తం 1,836 గదులను కలిగి ఉంది.

# మళ్లీ 72 వేలపైకి సెన్సెక్స్

- 71 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల సానుకూలతలు
- సూచీలకు మూడో రోజూ లాభాలు




**ముంబై:** అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, మహీంద్రాఅండ్‌మహీంద్రా షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు మూడో రోజూ లాభపడ్డాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లోని సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. సెన్సెక్స్ 228 పాయింట్లు పెరిగి 72వేల స్థాయిపైన 72,050 వద్ద నిలిచింది. నిఫ్టీ 71 పాయింట్లు బలపడి 21,911 వద్ద స్థిరపడింది. అమెరికా, ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ప్రథమార్థపు ట్రేడింగ్‌లో స్తబ్ధుగా కదలాడిన సూచీలు మిడ్ సెషన్‌లో యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభంతో జోరు పెంచాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 71,644 వద్ద కనిష్టాన్ని, 72,165 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 21,795 – 21,954 శ్రేణిలో ట్రేడైంది. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆయిల్అండ్‌గ్యాస్, విద్యుత్, ఆటో, ఐటీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫార్మా, ఎఫ్ఎంసీజీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈలో స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 1.24%, 0.93 % చొప్పున రాణించాయి. రంగాల వారీగా బీఎస్ఈ ఆయిల్అండ్‌గ్యాస్ 2.61%, యుటిలిటీస్ 2.59%, పవర్ 2%, ఆటో 1.41%, టెలికం 1.26% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ. 3,064 కోట్ల షేర్లను విక్రయించగా..., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,277 కోట్ల షేర్లు కొన్నారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- డిసెంబర్ క్వార్టర్ నికర లాభం 61% వృద్ధి నమోదుతో మహీంద్రాఅండ్‌మహీంద్రా షేరు దూసుకెళ్లింది. బీఎస్ఈలో ఆరున్నరశాతం పెరిగి రూ.1766 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 8% ర్యాలీ చేసి రూ.1784 ఆల్‌టైం హైని నమోదు చేసింది. సెన్సెక్స్,
- ఫెమా నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి తన అనుబంధ సంస్థ పీపీబీఎల్ అధికారులపై ఈడీ విచారణ కొనసాగుతుండంతో పేటీఎం షేరు బీఎస్ఈలో 5% లోయర్ సర్క్యూట్‌తో రూ.325 వద్ద లాకైంది.
- ప్రభుత్వరంగ ఎన్ఎండీసీ షేరు 5% లాభపడి రూ.246 వద్ద ముగిసింది. క్యూ3లో నికర లాభం జోరుతో ట్రేడింగ్‌లో 7% ఎగసి రూ.253 వద్ద కొత్త జీవితకాల గరిష్టాన్ని తాకింది.
- బ్లాక్‌డీల్ ద్వారా రెండుశాతానికిపైగా వాటాకు సమానమైన రూ.2,600 కోట్ల విలువైన షేర్లు చేతులు మారినట్లు వార్తలు వెలుగులోకి రావడంతో వేదాంత షేరు 4% నష్టపోయి రూ.268 వద్ద ముగిసింది.

## వీసాపై ఆర్‌బీఐ ఆంక్షలు!




**ముంబై:** కార్డు చెల్లింపులను స్వీకరించని సంస్థలకు మధ్యవర్తుల ద్వారా చెల్లింపులు జరపడాన్ని నిలిపివేయాలంటూ కార్డు నెట్‌వర్క్ సంస్థ వీసాను ఆర్‌బీఐ ఆదేశించినట్లు సమాచారం. ఇలాంటి లావాదేవీల ద్వారా పెద్ద మొత్తంలో నిధులు చట్టవిరుద్ధంగా బదిలీ అవుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది. 'కార్డు ద్వారా చెల్లింపులను స్వీకరించని సంస్థలకు నిర్దిష్ట మధ్యవర్తుల ద్వారా చెల్లింపులు జరిగేలా ఒక కార్డ్ నెట్‌వర్క్ సంస్థ ఒప్పందం చేసుకున్నట్లు మా దృష్టికి వచ్చింది' అంటూ వీసా పేరును ప్రస్తావించకుండా రిజర్వ్ బ్యాంక్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ వ్యవహారంపై చేపట్టిన అధ్యయనం పూర్తయ్యే వరకు అటువంటి ఒప్పందాలను నిలిపివేయాలని కార్డు కంపెనీకి సూచించినట్లు వివరించింది. అయితే, క్రెడిట్ కార్డుల సాధారణ వినియోగంపై ఎలాంటి ఆంక్షలు లేవని పేర్కొంది. ఆర్‌బీఐ ప్రత్యేకంగా పేరు ప్రస్తావించనప్పటికీ సదరు కార్డు నెట్‌వర్క్ సంస్థ వీసానే అని సంబంధిత వర్గాలు తెలిపాయి. నిబంధనల ప్రకారం ఇది కూడా ఒక తరహా చెల్లింపు విధానం కిందకే వస్తుందని, అధికారికంగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని ఆర్‌బీఐ పేర్కొంది.

## సోనాలికా నుంచి 10 కొత్త ట్రాక్టర్లు




**న్యూఢిల్లీ:** అత్యంత అధునాతన సాంకేతిక సామర్థ్యం కలిగిన టైగర్ సిరీస్ నుంచి పది ట్రాక్టర్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసినట్లు సోనాలిక ట్రాక్టర్స్ ప్రకటించింది. యూరప్‌లో తయారైన ఈ ట్రాక్టర్లను 40 – 75 హెచ్‌పీ సామర్థ్యంతో రూపొందించినట్లు తెలిపింది. భారతీయ రైతులకు, ఇక్కడి వాతావరణ పరిస్థితులకు తగ్గినట్లు తయారీ చేసిన వీటిలో 5 అత్యంత శక్తివంతమైన మోడళ్లు కాగా, మరో ఐదు మల్టీ–స్పీడ్ ట్రాన్స్‌మిషన్ మోడళ్లని పేర్కొంది. అయిదు హైడ్రాలిక్స్ కలిగిన ఈ ట్రాక్టర్లు 2,000–2,500 కేజీల సరుకును అవలీలగా తీసుకెళ్తాయని వివరించింది. ''ఈ ట్రాక్టర్లతో రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయి. దేశీయ ట్రాక్టర్ల విపణిలో మరింత వాటాను పెంచుకోవాలనే లక్ష్యంతోనే పలు మోడళ్లను ప్రవేశపెట్టాము'' అని కంపెనీ వైస్ చైర్మన్ అమృత్ సాగర్ మిట్టల్ తెలిపారు.





**భారత్‌కు తొలి పరాజయం**

ప్రొ హాకీ లీగ్ టోర్నీలో భారత పురుషుల జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. ఆస్ట్రేలియాతో గురువారం భువనేశ్వర్‌లో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 4–6 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ (12వ, 20వ ని.లో) రెండు గోల్స్ చేయగా... సుఖ్‌జీత్ (18వ ని.లో), మందీప్ (29వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఆస్ట్రేలియా తరఫున బ్లేక్ గోవర్స్ (2వ ని.లో) రెండు గోల్స్ చేయగా... జలెవ్‌స్కీ (40వ ని.లో), షార్ప్ (52వ ని.లో), అండర్సన్ (55వ ని.లో), జాక్ వెల్చ్ (58వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో భారత్ ఆడుతుంది.

**సెమీస్‌లో సాకేత్–రామ్‌కుమార్ జోడీ**

బెంగళూరు ఓపెన్ టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాకేత్ – రామ్‌కుమార్ (భారత్) ద్వయం 6–4, 6–4తో ష్నయిటర్–వాల్నర్ (జర్మనీ) జోడీపై గెలిచి సెమీఫైనల్ చేరింది. సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సుమిత్ నగాల్ (భారత్) 6–2, 7–5తో కోల్మన్ వాంగ్ (హాంకాంగ్)పై గెలిచాడు.

# శతకాలతో శుభారంభం



జడేజా

**రోహిత్, జడేజా సెంచరీలు • భారత్ 326/5**

**అరంగేట్రంలోనే అర్ధ సెంచరీతో అదరగొట్టిన సర్ఫరాజ్**

బ్యాటింగ్‌కు బాగా అనుకూలమైన పిచ్‌పై టాస్ గెలిచిన భారత్ ఒక దశలో 33/3 స్కోరు వద్ద నిలిచింది. ఈ స్థితిలో రోహిత్, జడేజా 204 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. అయితే గురువారం ఆటలో అందరి దృష్టినీ ఆకర్షించిన ఆటగాడు మాత్రం సర్ఫరాజ్ ఖాన్. సుదీర్ఘ కాలంగా దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తూ తన అవకాశం కోసం ఎదురు చూస్తున్న అతను ఎట్టకేలకు భావోద్వేగాల నడుమ భారత క్రికెటర్‌గా అరంగేట్రం చేశాడు. అంచనాలకు తగినట్లుగా చూడచక్కటి షాట్లతో అలవోకగా అర్ధ సెంచరీని అందుకున్నాడు. జోరు మీదున్న దశలో దురదృష్టవశాత్తూ రనౌట్‌గా వెనుదిరిగినా...తానేంటో అతను నిరూపించుకున్నాడు. ఇక మిగిలిన ఐదు వికెట్లతో రెండో రోజు భారత్ ఇంకా ఎన్ని పరుగులు జోడిస్తుందనేది ఆసక్తికరం.

**రాజ్‌కోట్:** ఇంగ్లండ్‌తో మూడో టెస్టులో భారత్‌కు శుభారంభం లభించింది. గురువారం ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 326 పరుగులు చేసింది. రోహిత్ శర్మ (196 బంతుల్లో 131; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (212 బంతుల్లో 110 బ్యాటింగ్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలు సాధించగా... సర్ఫరాజ్ ఖాన్ (66 బంతుల్లో 62; 9 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో మార్క్ వుడ్‌కు 3 వికెట్లు దక్కాయి.

**ద్విశతక భాగస్వామ్యం...**

అండర్సన్ వేసిన మ్యాచ్ తొలి బంతిని యశస్వి (10) ఫోర్‌గా మలచడంలో భారత్ ఇన్నింగ్స్ ప్రారంభమైంది. అయితే వుడ్ జోరులో భారత్ రెండు పరుగుల తేడాతో యశస్వి, గిల్ (0) వికెట్లు కోల్పోయింది. హార్ట్లీ బంతిని ఆడలేక రజత్ పటిదార్ (5) కూడా సునాయాస క్యాచ్ ఇచ్చాడు. ఈ దశలో సర్ఫరాజ్ వస్తే ఒత్తిడిలో మరో వికెట్ పోయేదేమో! కానీ జట్టు వ్యూహాత్మకంగా కుడి, ఎడమ కాంబినేషన్ కోసం ఐదో స్థానంలో జడేజాను పంపించడం అద్భుతంగా పని చేసింది. రోహిత్, జడేజా కలిసి జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను నిర్మించారు. 29 పరుగుల వద్ద స్లిప్‌లో రూట్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన రోహిత్ లంచ్‌కు ముందు 71 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. విరామం తర్వాత పూర్తిగా భారత్ హవా సాగింది. ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా రోహిత్, జడేజా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. ఈ క్రమంలో భాగస్వామ్యం వంద పరుగులు దాటింది. 97 బంతుల్లో జడేజా అర్ధ సెంచరీ పూర్తయింది. ఈ సెషన్‌లో భారత్ 27 ఓవర్లలో 92 పరుగులు చేసింది. ఈ జోడీని విడదీయలేక ఇంగ్లండ్ తీవ్రంగా ఇబ్బంది పడింది. ఈ సిరీస్‌లో ఒక్క వికెట్ కూడా పడని తొలి సెషన్ ఇదే కావడం విశేషం. టీ తర్వాత తొలి ఓవర్లోనే రోహిత్ 157 బంతుల్లో తన కెరీర్‌లో 11వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. పార్ట్‌నర్‌షిప్ 200 పరుగులు దాటాక ఎట్టకేలకు ఇంగ్లండ్‌కు వికెట్ దక్కింది. షార్ట్ బంతులకు వరుసగా పరుగులు రాబట్టిన రోహిత్ చివరకు అదే షాట్‌కు ప్రయత్నించి వెనుదిరిగాడు.



రోహిత్

**సర్ఫరాజ్ రనౌట్...**

కొత్త ఆటగాడు సర్ఫరాజ్, జడేజా భాగస్వామ్యం జట్టును నడిపించింది. ముఖ్యంగా తన కెరీర్ తొలి ఇన్నింగ్స్‌లో సర్ఫరాజ్ ఇంగ్లండ్ స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్వీప్, లాఫ్టెడ్ షాట్లతో వేగంగా పరుగులు రాబట్టాడు. సర్ఫరాజ్ క్రీజ్‌లోకి వచ్చినప్పుడు జడేజా స్కోరు 84 కాగా... సర్ఫరాజ్ వెనుదిరిగే సమయానికి 99 మాత్రమే! 77 పరుగుల ఈ ఐదో వికెట్ భాగస్వామ్యంలో జడేజా 15 పరుగులు చేయగా, సర్ఫరాజ్ 62 పరుగులు చేశాడంటేనే అతని జోరు అర్థమవుతుంది. 93 పరుగుల వద్ద హార్ట్లీ బంతి జడేజా ప్యాడ్‌ను ముందుగా తగిలినా... ఇంగ్లండ్ బలంగా అప్పీల్ చేయలేదు. రీప్లేలో అతను అవుటయ్యేవాడని తేలింది! ధాటిగా ఆడిన సర్ఫరాజ్ 48 బంతుల్లోనే హాఫ్ సెంచరీని చేరుకున్నాడు. అయితే దురదృష్టవశాత్తూ జడేజాతో సమన్వయ లోపం అతని ఆటను ముగించింది. జడేజా 99 వద్ద అండర్సన్ బౌలింగ్‌లో సింగిల్ కోసం ముందుకు వచ్చి మళ్లీ వెనక్కి తగ్గాడు. అప్పటికే ముందుకు వెళ్లిన సర్ఫరాజ్ వెనక్కి వచ్చేలోగా వుడ్ డైరెక్ట్ హిట్ వికెట్లను తాకింది. తర్వాతి బంతికే సింగిల్‌తో జడేజా టెస్టుల్లో నాలుగో సెంచరీ పూర్తయింది.



సర్ఫరాజ్

**స్కోరు వివరాలు**

**భారత్ తొలి ఇన్నింగ్స్:** యశస్వి (సి) రూట్ (బి) వుడ్ 10; రోహిత్ (సి) స్టోక్స్ (బి) వుడ్ 131; గిల్ (సి) ఫోక్స్ (బి) వుడ్ 0; పటిదార్ (సి) డకెట్ (బి) హార్ట్లీ 5; జడేజా (బ్యాటింగ్) 110; సర్ఫరాజ్ (రనౌట్) 62; కుల్దీప్ (బ్యాటింగ్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (86 ఓవర్లలో 5 వికెట్లకు) 326. వికెట్ల పతనం:** 1–22, 2–24, 3–33, 4–237, 5–314. **బౌలింగ్:** అండర్సన్ 19–5–51–0, వుడ్ 17–2–69–3, హార్ట్లీ 23–3–81–1, రూట్ 13–1–68–0, రేహన్ 14–0–53–0.

## భావోద్వేగ క్షణాలు...



సర్ఫరాజ్
ధ్రువ్ జురేల్

రాజ్‌కోట్ టెస్టు ద్వారా ఇద్దరు ఆటగాళ్లు సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురేల్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టారు. సర్ఫరాజ్‌కు అనిల్ కుంబ్లే, జురేల్‌కు దినేశ్ కార్తీక్ టెస్టు క్యాప్‌లు అందించారు. రెండేళ్ల వ్యవధిలో 15 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల తర్వాత అవకాశం లభించిన వికెట్ కీపర్ జురేల్‌తో పోలిస్తే సర్ఫరాజ్ ప్రస్థానం భావోద్వేగభరితమైంది. అందుకే మ్యాచ్‌కు ముందు మైదానంలో అలాంటి దృశ్యాలు కనిపించాయి. ఎనిమిదేళ్ల ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో దేశవాళీలో 70 సగటుతో భారీగా పరుగులు సాధించిన సర్ఫరాజ్ భారత్ తరఫున ఆడేందుకు ఎంతో కాలంగా ఎదురు చూశాడు. పలుమార్లు అవకాశం వచ్చినట్లే వచ్చి చేజారింది. అందుకే అరంగేట్రం ఖాయమైన క్షణాన కోచ్, మెంటార్ అయిన తండ్రి నౌషాద్ ఖాన్ తన కన్నీళ్లను ఆపుకోలేకపోయాడు. చిన్నప్పటినుంచి అన్నీ తానే అయి సర్ఫరాజ్‌ను క్రికెటర్‌గా తీర్చిదిద్దిన ఆయన టెస్టు క్యాప్‌ను ముద్దాడి తన కొడుకును హత్తుకున్నాడు. సర్ఫరాజ్ అర్ధసెంచరీ పూర్తయినప్పుడు అన్ని వైపుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. జడేజా కూడా ఆట ముగిసిన తర్వాత రనౌట్‌లో తనదే తప్పంటూ బాధపడుతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు!





## చైనా చేతిలో భారత్ ఓటమి

**షా ఆలమ్ (మలేసియా):** ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భాగంగా చైనాతో జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 2–3తో పరాజయం పాలైంది. తొలి మ్యాచ్‌లో ప్రణయ్ 6–21, 21–18, 21–19తో వెంగ్ హంగ్ యంగ్‌పై గెలిచాడు. రెండో మ్యాచ్‌లో అర్జున్–ధ్రువ్ కపిల జోడీ 15–21, 21–19, 19–21తో చెన్ బొ యంగ్–లియు యి చేతిలో ఓడింది. మూడో మ్యాచ్‌లో లక్ష్య సేన్ 21–11, 21–16తో లీ లాన్‌పై నెగ్గాడు. నాలుగో మ్యాచ్‌లో సూరజ్–పృథ్వీ జంట 13–21, 9–21తో జియాంగ్ యు–జి హావో ద్వయం చేతిలో ఓడింది. ఐదో మ్యాచ్‌లో చిరాగ్ సేన్ 15–21, 16–21తో వాంగ్ జెంగ్ జింగ్ చేతిలో ఓడిపోవడంతో భారత్ 2–3తో పరాజయం చవిచూసింది. మహిళల విభాగం క్వార్టర్ ఫైనల్లో హాంకాంగ్‌తో భారత్; పురుషుల విభాగం క్వార్టర్ ఫైనల్లో జపాన్‌తో భారత్ ఆడతాయి. గెలిచిన జట్లకు కనీసం కాంస్య పతకాలు ఖాయమవుతాయి.



లక్ష్య సేన్

## న్యూజిలాండ్ లక్ష్యం 267

**హామిల్టన్:** దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో విజయానికి న్యూజిలాండ్ మరో 227 పరుగుల దూరంలో నిలిచింది. 267 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 13.5 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 40 పరుగులు చేసింది. అంతకుముందు దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 69.5 ఓవర్లలో 235 పరుగులకు ఆలౌటైంది. డేవిడ్ బెడింగమ్ (110; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. న్యూజిలాండ్ బౌలర్ విలియమ్ ఒరూర్కీ ఐదు వికెట్లు పడగొట్టాడు.

## టి20 ప్రపంచకప్ వరకు రాహుల్ ద్రవిడే కోచ్: జై షా

**రాజ్‌కోట్:** టి20 ప్రపంచకప్ ముగిసేవరకు భారత జట్టు హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ కొనసాగుతాడని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. ద్రవిడ్ పదవీ కాలం గతేడాది వన్డే ప్రపంచకప్‌తోనే ముగిసింది. అనంతరం నిర్దిష్ట వ్యవధి అని లేకుండా దక్షిణాఫ్రికా పర్యటనకు అతన్ని కొనసాగించారు. 'ప్రపంచకప్ తర్వాత వెంటనే సఫారీ టూర్‌కు వెళ్లడంతో ద్రవిడ్‌తో మాట్లాడటం కుదరకే నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడు టి20 ప్రపంచకప్ వరకు అందుబాటులో ఉంటానని చెప్పడంతో ద్రవిడ్‌నే కొనసాగించాలని నిర్ణయించాం' అని జై షా అన్నారు.

## క్లుప్తంగా...

### అవరోహణ పద్ధతిలో ఉద్యోగ నియామకాలు

**సీఎస్‌కు ఆర్.కృష్ణయ్య వినతి**



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ నియామకాల ప్రక్రియ ఇష్టానుసారంగా చేపడుతున్నారని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పైస్థాయి పోస్టులను ముందుగా భర్తీ చేయాలని, తర్వాత వరుస క్రమంలో నియామకాలుండాలని తెలిపారు. అవరోహణ పద్ధతిని పాటిస్తూ చేపట్టాల్సిన నియామకాల ప్రక్రియను అధికారులు ఇష్టానుసారంగా చేపట్టడంతో ఉద్యోగ ఖాళీలు బ్యాక్‌లాగ్ కేటగిరీలోకి చేరే ప్రమాదం ఉందన్నారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని కలిసి లేఖ సమర్పించారు. అనంతరం సచివాలయంలోని మీడియా సెంటర్లో ఆయన మాట్లాడుతూ, గురుకుల బోర్డు ముందుగా డిగ్రీ లెక్చరర్, ఆ తర్వాత జూనియర్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, ఆ తర్వాత పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు భర్తీ చేస్తే పూర్తిస్థాయిలో ఉద్యోగాలు భర్తీ అవుతాయన్నారు. కానీ అలా కాకుండా పీజీటీ నియామకాలు ముందుగా చేపట్టడంతో డీఎల్, జేఎల్ కేటగిరీల్లో ఉద్యోగాల భర్తీ సమయంలో పీజీటీలో ఖాళీలు ఏర్పడతాయని, దీంతో నిరుద్యోగులకు నష్టం జరుగుతుందన్నారు. క్రమపద్ధతిలో నియామకాలు చేపట్టకుంటే ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

### కింగ్స్ గ్రూప్ కంపెనీల్లో ఈడీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఆరోపణలపై కింగ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఈనెల 13న హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో కలిపి ఏడు చోట్ల సోదాలు చేపట్టారు. హవాలా, విదేశాలకు అక్రమంగా నిధుల మళ్లింపు, ఫెమా చట్టం ఉల్లంఘనలపై నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఈ సోదాలు చేపట్టినట్టు ఈడీ అధికారులు తెలిపారు. సోదాల్లో రూ.76.5 లక్షల నగదు, రూ.1.5 లక్షల విలువైన విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. కింగ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీలకు చెందిన మహ్మద్ షానవాజ్, మహ్మద్ జుబేరుద్దీన్ మరికొందరితో కలసి నిబంధనలకు విరుద్ధంగా ఇంగ్లండ్, యూఏఈ సహా వివిధ దేశాలకు నిధులు తరలించినట్టు వచ్చిన ఆరోపణలపై ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.

### సిమ్స్‌లో ముగ్గురు మెడికోల సస్పెన్షన్



యాంటీ ర్యాగింగ్ కమిటీ విచారణ

కోల్‌సిటీ(రామగుండం): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని సిమ్స్ మెడికల్ కళాశాలలో ఇటీవల జరిగిన ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన యాంటీ ర్యాగింగ్ కమిటీ వైద్య కళాశాలలో గురువారం విచారణ జరిపింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ విద్యార్థులు, వారితో వచ్చిన తల్లిదండ్రులతో ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ నేతృత్వంలో కమిటీ ప్రతినిధులు మాట్లాడారు. ముగ్గురు విద్యార్థులను సస్పెండ్ చేయడంతోపాటు మరో విద్యార్థిని హాస్టల్ నుంచి తొలగించాలని కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఇందులో ఒక విద్యార్థిని 6 నెలలపాటు, మరో విద్యార్థిని 4 నెలలు, ఇంకో విద్యార్థిని 2 నెలలపాటు సస్పెండ్ చేశారన్నారు. మరో విద్యార్థిని హాస్టల్ నుంచి తొలగించినట్లు వెల్లడించారు.

### యువతి ఫిర్యాదు పట్టించుకోలేదనడం అవాస్తవం

**కరీంనగర్ టూటౌన్ సీఐ వెంకటేశ్**

కరీంనగర్ క్రైం: ఓ యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వంగ రమ్య అనే యువతి చెప్పడం అవాస్తవమని కరీంనగర్ టూటౌన్ సీఐ వెంకటేశ్ పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రమ్య ఇటీవలే హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన హైకోర్టు యువతి ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదో వివరణ ఇవ్వాలని పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీఐ వెంకటేశ్ గురువారం స్పందించారు. 12న హైకోర్టును ఆశ్రయించిన రమ్య.. 13న సాయంత్రం కుతాడి వికాస్ అనే యువకుడిపై ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు. విచారణ అనంతరం 14వ తేదీన ఎఫ్ఐఆర్ నంబర్ 136/2024 ద్వారా వికాస్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

### సవరణ

ఈ నెల 15న 'సాక్షి'లో 'జడ్జి కుమారుడిపై ఫిర్యాదు తీసుకోరా?' శీర్షికన ప్రచురితమైన వార్తలో సెకండ్ అడిషనల్ జిల్లా జడ్జి అని రావాల్సింది.. పొరపాటున ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి అని వచ్చింది. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం.

# ప్రతి కేటగిరీలో 33.3%

## మహిళలకు రిజర్వేషన్లలో హారిజాంటల్ పద్ధతి అమలుపై సర్కారు స్పష్టత

- ఓపెన్ కాంపిటీషన్‌తో పాటు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, తదితర అన్ని కేటగిరీల్లో అవకాశం
- ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు విద్యా సంస్థలు, స్థానిక సంస్థల్లో అమలు.. ఉత్తర్వులు జారీ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో మహిళలకు హారిజాంటల్ (సమాంతర) పద్ధతిలో 33 1/3 శాతం (33.333%) రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, ఆ మేరకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ తాజాగా ఉత్తర్వులు జారీ (జీఓ.ఎంఎస్.3) చేశారు. వీటి ప్రకారం మహిళలకు ఓపెన్ కాంపిటీషన్ (ఓసీ)తో పాటు ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ–ఏ, బీసీ–బీ, బీసీ–సీ, బీసీ–డీ, బీసీ–ఈ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్, క్రీడాకారుల కోటాలో హారిజాంటల్ పద్ధతి (రోస్టర్ పట్టికలో ప్రత్యేకంగా ఎలాంటి మార్కింగ్ లేకుండా)లో 33 1/3 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. ఇప్పటివరకు వర్టికల్ పద్ధతి (పట్టికలోని పోస్టుల్లో కొన్నిటిని ప్రత్యేకంగా మహిళలకంటూ మార్కింగ్ ఇచ్చేవారు)లో ఉద్యోగ నియామకాలు చేయగా.. ఇకపై ఎలాంటి మార్కింగ్ చేయకుండా 33 1/3శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం సూచించిన మెథడాలజీ ప్రకారం అమలు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మహిళలకు 33 1/3 శాతం రిజర్వేషన్ల అమలుకు గతంలో ఇచ్చిన జీవో నం.41/1996, జీవో నం. 56/1996 ఉత్తర్వులు రద్దు చేసింది. ఈ పద్ధతిని ప్రస్తుతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో అమలు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వరంగ సంస్థలు, రాజ్యాంగ నియామక సంస్థలు, ఎయిడెడ్ విద్యాసంస్థలు, స్థానిక సంస్థల్లో మహిళలకు సమాంతర రిజర్వేషన్ల నిబంధనలు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ ప్రత్యేకంగా జీవో జారీ చేయనుందని తాజా ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

**మెమోకు అనుగుణంగా ఉత్తర్వులు**

మహిళలకు హారిజాంటల్ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సాధారణ పరిపాలన శాఖ తరపున ఒక మెమో జారీ చేసిన సంగతి తెలిసిందే. కాగా ఈ మెమోను అన్ని నియామక సంస్థలకు పంపించారు. ఈ విషయంలో న్యాయ వివాదాలు తలెత్తకుండా మహిళా శిశు సంక్షేమశాఖ 33 1/3 శాతం రిజర్వేషన్ల అమలు కోసం 1996లో జారీ చేసిన జీవో నం.41కు, రాష్ట్ర సబార్డినేట్ సర్వీసు నిబంధనలు రూల్.22కు సవరణలు చేయాలని పేర్కొంటూ టీఎస్‌పీఎస్సీ ఈనెల 8న మహిళా శిశు సంక్షేమ శాఖకు లేఖ రాసింది. ఈ నేపథ్యంలో ఆ శాఖ మహిళలకు రోస్టర్ పాయింట్ లేకుండా హారిజాంటల్ రిజర్వేషన్ల అమలుపై ఉత్తర్వులు జారీ చేసింది.

## గచ్చిబౌలి భూలావాదేవీలపై విజి'లెన్స్'

**రెవెన్యూ, ఇరిగేషన్, రిజిస్ట్రేషన్ అధికారుల పాత్రపై ఆరా**

సాక్షి, రంగారెడ్డి జిల్లా: శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలో సర్వే నంబర్ 46లో మూడెకరాల సీలింగ్ భూమి.. ప్రైవేటు వ్యక్తుల పేరు మీద రిజిస్టర్ కావడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ భూమి విలువ రూ.300 కోట్లు కావడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఇప్పటికే రంగంలోకి దిగిన ఆ శాఖ అధికారులు భూ మార్పిడి వెనుక ఉన్న వ్యక్తులు, వారికి సహకరించిన అధికారులపై ఆరా తీస్తున్నారు. గచ్చిబౌలిలో సర్వే నంబర్ 46లోని మూడెకరాల భూమి నిషేధిత జాబితా(22–ఏ)లో ఉంది. రెవెన్యూ అధికారులు చాలా ఏళ్ల క్రితమే దీన్ని అర్బన్ సీలింగ్ భూమిగా నమోదు చేశారు. ధరణి పోర్టల్‌లోనూ ఇదే జాబితాలో నమోదై ఉంది. విలువైన ఈ భూమి తమదేనని, దీనిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ కొందరు ప్రైవేటు వ్యక్తులు చక్రం తిప్పారు. దీంతో సీసీఎల్ఏ నుంచి ఆదేశాలు వచ్చాయి. వెంటనే తహసీల్దార్, ఆర్డీఓలు రంగంలోకి దిగి, క్షేత్రస్థాయి పరిశీలన పేరుతో అప్పటి వరకున్న అభ్యంతరాలన్నింటినీ ఉపసంహరించుకున్నారు. ప్రైవేటు రియల్టర్లకు అనుకూలంగా నివేదికలు ఇచ్చారు. కిందిస్థాయి అధికారులు ఇచ్చిన నివేదికలను ఆధారం చేసుకుని అప్పటి కలెక్టర్ నిషేధిత జాబితా నుంచి ఆ భూములను తొలగించేశారు. ఆ తర్వాత స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ 2023 సెప్టెంబర్ 23న జిల్లా రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. దీంతో సీలింగ్ భూములను పట్టా భూములుగా మార్చేశారు. నలుగురు వ్యక్తుల పేరున రిజిస్ట్రేషన్ చేసేశారు. ఆ వెంటనే వారు పొజిషన్‌లోకి వెళ్లిపోయారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం దృష్టి సారించడంతో రెవెన్యూ, ఇరిగేషన్, రిజిస్ట్రేషన్ అధికారుల పాత్రపై విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టారు.

## గురుకుల డిగ్రీ లెక్చరర్ ఫలితాలు విడుదల

- నేడు కంప్యూటర్‌సైన్స్ అభ్యర్థుల లిస్ట్!

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీల్లో 21 కేటగిరీల్లోని డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాల కోసం నిర్వహించిన అర్హత పరీక్షకు సంబంధించిన ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) విడుదల చేసింది. 22 కేటగిరీల్లోని 793 ఉద్యోగాలకుగాను 99 (కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు) ఉద్యోగాలకు మినహా మిగతా సబ్జెక్టులకు సంబంధించి 1:2 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. కంప్యూటర్ సైన్స్ అభ్యర్థుల జాబితాను శుక్రవారం మధ్యాహ్నానికి సిద్ధం చేయనుంది. కాగా, ఎంపికైన అభ్యర్థులకు 19, 20 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన, డెమో పరీక్ష నిర్వహించనున్నట్లు బోర్డు కన్వీనర్ మల్లయ్య భట్టు వెల్లడించారు.

## తెలుగులోనే తొలి తీర్పు

- ఇసుక అక్రమ రవాణా కేసు కొట్టివేత
- నిందితులను నిరపరాధులుగా పేర్కొంటూ.. ఆసిఫాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అనంత లక్ష్మి తీర్పు

సాక్షి, ఆసిఫాబాద్: ఇసుక దొంగతనం చేసి అక్రమంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలపై 2021లో ఆసిఫాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జక్కుల అనంతలక్ష్మి గురువారం తీర్పునిచ్చారు. నిందితులకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలను పోలీసులు చూపకపోవడంతో వారిని నిరపరాధులుగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించారు. ఈ తీర్పు సారాంశం మొత్తం జడ్జి అనంతలక్ష్మి తెలుగులో ఇచ్చారు.

**అసలు కేసు ఏమిటంటే..:** 2021 ఫిబ్రవరి 2న ఆసిఫాబాద్ చిర్రకుంట ఎక్స్‌రోడ్‌లో పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా జైనూరుకు చెందిన షేక్ అజీజ్, షేక్ అబ్బాస్ ఐచర్ వాహనంలో ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డారు. ఇసుక దొంగతనం, అక్రమ రవాణా కింద వారిపై పోలీసులు సెక్షన్ 379 కింద కేసు నమోదు చేయగా.. ఈ కేసు విచారించిన జడ్జి అనంతలక్ష్మి వారిని నిరపరాధులుగా పేర్కొంటూ తీర్పునిచ్చారు. సికింద్రాబాద్‌లోని తెలంగాణ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ మంగారి రాజేందర్ జింబో నేతృత్వంలో శిక్షణ పొందిన అనంతలక్ష్మి ఇటీవల ఆసిఫాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. ఆమె బాధ్యతలు తీసుకున్నాక వెలువరించిన తొలి తీర్పు ఇది కావడం విశేషం.

## 18న అగ్నిమాపకశాఖ కేంద్ర కార్యాలయం ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అగ్నిమాపకశాఖ కార్యాలయ హెడ్‌క్వార్టర్స్, ఫైర్ కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనాన్ని ఈనెల 18న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు. నానక్‌రామ్‌గూడలోని వెయ్యి చదరపు మీటర్ల స్థలంలో రూ.17 కోట్ల ఖర్చుతో 4 అంతస్తుల్లో ఈ భవనాన్ని నిర్మించారు. 2022 సెప్టెంబర్‌లో ప్రారంభమైన భవన నిర్మాణం ఇటీవల పూర్తయింది. మొత్తం నాలుగు అంతస్తుల్లో మొదటి ఫైర్ స్టేషన్, రెండో అంతస్తులో కమాండ్ కంట్రోల్ సెంటర్, రీజనల్ ఫైర్ ఆఫీసర్ కార్యాలయం, మూడో అంతస్తులో అడిషనల్ డైరెక్టర్ల కార్యాలయాలు, నాలుగో అంతస్తులో అగ్నిమాపకశాఖ డీజీ కార్యాలయం, బోర్డు రూం ఏర్పాటు చేశారు.

## సింహం ముందు తొడగొట్టాడు..



**ప్రాణాలు పోగొట్టుకున్నాడు..**

- తిరుపతి జూపార్క్‌లో దుర్ఘటన
- సింహాల ఎన్‌క్లోజర్‌లోకి దూకిన రాజస్తాన్ వాసి..
- చంపేసిన సింహం

తిరుపతి (మంగళం): సింహం ముందు తొడగొట్టిన వ్యక్తి చివరకు దానికి ఆహారంగా మారిన దుర్ఘటన తిరుపతి జూపార్క్‌లో గురువారం చోటుచేసుకుంది. ఈ ఘటన సందర్శకుల్ని భయభ్రాంతులకు గురిచేసింది. సందర్శకులు, జూ అధికారుల కథనం ప్రకారం.. రాజస్తాన్‌కు చెందిన ప్రహ్లాద గుర్జర్ (38) అనే వ్యక్తి గురువారం హైదరాబాద్ నుంచి తిరుపతి వచ్చాడు. ఇక్కడి జంతు ప్రదర్శనశాలను సందర్శించేందుకు వెళ్లాడు. సందర్శకులతో కలిసి పులులు, ఇతర జంతువులను చూసుకుని సింహాలు ఉండే ఎన్‌క్లోజర్‌కు చేరుకున్నాడు. సింహాలు ఉండే ఎన్‌క్లోజర్ మొదటి గేటు ఎక్కి లోనికి ప్రవేశించాడు. బోనులో ఉండే సింహాల ఇనుప ప్రహరీని ఎక్కి ఎన్‌క్లోజర్‌లోకి దూకేశాడు. వంద మీటర్ల దూరంలో ఉన్న సింహాన్ని చూసి గట్టిగా అరిచాడు. సింహం తనవైపు చూడగానే తొడగొట్టి పిలిచాడు. సింహం అతడివైపు రావడంతో పక్కనే ఉన్న చెట్టెక్కే ప్రయత్నంలో కాలుజారి కిందపడ్డాడు. వెంటనే సింహం గుర్జర్ మెడను నోటితో పట్టుకుని వంద మీటర్లకుపైగా దూరం లాక్కెళ్లి చంపేసింది. సమాచారం అందుకున్న జూ క్యూరేటర్ సెల్వం, చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్, తిరుపతి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అతడు చనిపోవడానికే ఎన్‌క్లోజర్‌లోకి దూకి ఉంటాడని భావిస్తున్నారు.

## దేశాభివృద్ధిలో రైల్వేది కీలక పాత్ర

- అన్ని ప్రాంతాలకూ రైల్వే కనెక్టివిటీ పెరిగింది: మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్
- ఆర్‌ఆర్‌ఆర్ చుట్టూ రైల్వే లైన్ ఏర్పాటు: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



కొమురవెల్లి హాల్ట్ రైల్వే స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న మోహన్ యాదవ్, కిషన్‌రెడ్డి

సాక్షి, సిద్దిపేట: దేశ ఆర్థికాభివృద్ధిలో రైల్వే కీలక పాత్ర పోషిస్తోందని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అన్నారు. దేశంలో తూర్పు–పడమర–ఉత్తర–దక్షిణం ఇలా అన్ని ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ పెరిగిందని చెప్పారు. గురువారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి హాల్ట్ రైల్వేస్టేషన్‌కు కేంద్ర పర్యాటక మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మోహన్ యాదవ్ మాట్లాడుతూ వసుధైక కుటుంబం అనే గొప్ప సూక్తికి మోదీ నాయకత్వమే ఉదాహరణ అని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్‌ను నడుపుతున్నామన్నారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకోవడంతో తన ఇంటికి వచ్చినట్లుగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

**తెలంగాణకు సముచిత స్థానం: కిషన్‌రెడ్డి**

మోదీ పాలనలో తెలంగాణకు సముచిత స్థానం కల్పించారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. 2014లో తెలంగాణకు రైల్వే కేటాయింపులు రూ.251 కోట్లు ఉంటే ఇప్పుడు రూ.6 వేల కోట్లకు పెంచామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో రైల్వే అభివృద్ధి కోసం రూ.30వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. రీజనల్ రింగ్ రోడ్ కోసం రూ.26 వేలకోట్ల నిధులు కేటాయించామని, ఆర్‌ఆర్‌ఆర్ చుట్టూ రింగ్ రైలు ఏర్పాటు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

## జడ్జీలను మేనేజ్ చేస్తానంటూ..

- లాయర్ వేదుల వెంకటరమణ రూ.6 కోట్లు స్వాహా చేశారు
- తిరిగి అడిగితే.. న్యాయవాది, ఎమ్మెల్యే అహ్మద్ బలాల అనుచరులు బెదిరింపులకు దిగారు..
- ఐఎస్‌సదన్ ఠాణాలో బాధితుడి ఫిర్యాదు.. కేసు నమోదు... సీసీఎస్‌కు బదిలీ

సాక్షి, హైదరాబాద్: భూవివాద కేసులో జడ్జీలను మేనేజ్ చేస్తానంటూ రూ.7 కోట్లు తీసుకున్న హైకోర్టు న్యాయవాది వేదుల వెంకటరమణతోపాటు బెదిరింపులకు పాల్పడిన మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలపై ఇటీవల ఐఎస్‌సదన్ ఠాణాలో కేసు నమోదైంది. దర్యాప్తు నిమిత్తం ఈ కేసును హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌కు బదిలీ చేశారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చింతల్‌లోని వాణీనగర్‌కు చెందిన డాక్టర్ చింతల యాదగిరి సామాజిక కార్యకర్త. ఈయన తండ్రి మల్లయ్య తన కులానికి చెందిన వారి కోసం ఓ సంఘం ఏర్పాటు చేశారు. ఆయన మరణించిన తర్వాత యాదగిరి దీనిని పర్యవేక్షిస్తున్నారు. సంఘం కోసం 1982లో బౌరంపేట గ్రామంలో 10 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. పట్టాదారుడికి నగదు చెల్లించి ప్రైవేట్ సేల్ డీడ్ ద్వారా స్థలం పొందారు. 2005లో కొందరి కన్ను ఈ స్థలంపై పడింది. దీనిపై సంఘానికి చెందిన వారు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసి, సివిల్ దావాలు దాఖలు చేశారు. ఇవి ఫలితాలు ఇవ్వకపోవడంతో యాదగిరి నేతృత్వంలోని కులపెద్దలు సైదాబాద్‌లో ఉండే న్యాయవాది వేదుల వెంకటరమణను సంప్రదించగా, హైకోర్టు కేసు నడుస్తోంది. సాంకేతిక, అనివార్య కారణాల నేపథ్యంలో దాదాపు 18 ఏళ్లు కేసు మూలనపడింది.

**మాట్లాడదాం రమ్మని చెప్పి....**

కేసు విషయమై మాట్లాడటానికి యాదగిరిని కులపెద్దలతో కలిసి తన కార్యాలయానికి రమ్మని న్యాయవాది వెంకటరమణ చెప్పాడు. దీంతో యాదగిరి 10 మందితో వెళ్లి చర్చించారు. తీర్పు వేగంగా, అనుకూలంగా తెచ్చుకోవడానికి బెంచ్‌లో ఉన్న జడ్జీలను మేనేజ్ చేయాల్సి ఉంటుందని చెప్పి, దీని కోసం వెంకటరమణ రూ.10 కోట్లు అడిగాడు. రూ.7 కోట్లు చెల్లించడానికి అంగీకరించారు. రెండవిడతల్లో ఈ మొత్తాన్ని వారంతా నగదుగా అందజేశారు. కోర్టు ఉత్తర్వులు కూడా వీరికి అనుకూలంగా లేకపోవడంతో భూమిని కోల్పోయారు. వెంకటరమణ తమ ప్రతివాదులతో కుమ్మక్కు అయ్యి, వారి నుంచి 25 కోట్లు తీసుకున్నాడని యాదగిరి, కుల పెద్దలకు తెలిసింది. దీనికి న్యాయవాది వెంకటరమణ వైఖరే కారణమని భావించిన బాధితులు తమ వద్ద తీసుకున్న మొత్తం నగదు తిరిగి ఇవ్వాలని, నష్టపరిహారంగా అంతే మొత్తం అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒత్తిడి చేయగా, రూ.కోటి మాత్రమే వెంకటరమణ తిరిగి చెల్లించారు. మిగిలిన మొత్తం చెల్లించకపోగా, వెంకటరమణతోపాటు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అనుచరుడు జైకుమార్‌తో పాటు పాతబస్తీకి చెందిన రౌడీలతో బెదిరింపులకు దిగారంటూ యాదగిరి ఐఎస్‌సదన్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీంతో ఐపీసీతోపాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచార (నిరోధక) చట్టంలోని సెక్షన్ల కింద వెంకటరమణ, అహ్మద్ బలాల, జైకుమార్ తదితరులపై కేసు నమోదై సీసీఎస్‌కు బదిలీ అయ్యింది.

## మహాదేవమణికి 'ఉషశ్రీ సంస్కృతి సత్కారం'



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ అవధాన పండితుడు ధూళిపాళ మహాదేవమణిని ఉషశ్రీ సంస్కృతి సత్కారానికి ఎంపిక చేసినట్టు ఉషశ్రీ మిషన్ తెలిపింది. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఒక ప్రకటనలో వెల్లడించింది. రాజమహేంద్రవరానికి చెందిన మహాదేవమణి, అవధానవిద్యలో ఘటికుడు. అంతకుమించి అవధాన సంచాలకునిగా ప్రఖ్యాతి చెందారు. మాడుగుల నాగఫణి శర్మ చేసిన ద్విశతావధానానికి ఆయన తొలుత సంచాలకత్వం వహించారు. ప్రస్తుతం ఆయన అవధాన విద్యలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఆయన దగ్గర శిక్షితులైన వారిలో బులుసు అపర్ణ, తాతా సందీపశర్మ, ఉదయ చంద్రిక, తదితరులున్నారు. ధర్మసందేహాలు కార్యక్రమంతో విజయవాడ ఆకాశవాణి కేంద్రం ద్వారా సుపరిచితులైన ఉషశ్రీ పేరిట ఆయన కుటుంబ సభ్యులు ఉషశ్రీ సంస్కృతి సత్కార పురస్కారాన్ని ఏటా అందిస్తున్నారు. ఇంతవరకు దాశరథి రంగాచార్య, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, మాడుగుల నాగఫణి శర్మ, బేతవోలు రామబ్రహ్మం, రాళ్లబండి కవిత ప్రసాద్, గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, పుల్లెల శ్రీరామచంద్రుడు, తాతా సందీప శర్మ, అనంతలక్ష్మి, గరికపాటి నరసింహారావు, సామవేదం షణ్ముఖ శర్మ, కుప్ప విశ్వనాథ శర్మలను ఉషశ్రీ మిషన్ సత్కరించింది.

## క్లిక్ చేయ్.. ఏం తినాలో తెలుసుకో!

**న్యూట్రిఎయిడ్ యాప్ ఆవిష్కరణ**

సాక్షి, హైదరాబాద్: నిద్రలేవగానే ఏం తినాలి.. మన ఎత్తు, బరువు మేరకు ఎన్ని కేలరీలు అవసరం. ఉదయం ఫలహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం.. ఇలా ఎప్పుడు ఏం తినాలి. ఇడ్లీ.. నాన్ వెజ్.. వెజ్.. ఏ తరహా ఆహారం తింటే ఎన్ని కేలరీలు వస్తాయి. మన శరీరానికి ఎప్పుడు ఎన్ని కేలరీలు అవసరం.. ఇలాంటి వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ, ఓ ఆరోగ్యకరమైన ఆహార విధానాన్ని ప్రోత్సహించే యాప్.. 'న్యూట్రిఎయిడ్'. ఉరుకులు, పరుగుల పట్టణ జీవితంలో ప్రజల ఆహార విధానాన్ని జాగృతం చేస్తుంది. ఇందులోని ఏఐ ఆధారిత ఫొటో రికగ్నిషన్ టూల్ ద్వారా మనం ఏం తింటే ఎన్ని కేలరీలు వస్తాయో తెలుసుకోవచ్చు. తినాలనుకుంటున్న ఆహారం ఫొటోను క్లిక్ చేస్తే తినాలా? వద్దా? అన్నది చెబుతుంది. ఐసీఎంఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ డైరెక్టర్ డాక్టర్ హేమలత, జర్మనీలోని ఆగ్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో అర్బన్ క్లైమేట్ రెసిలెన్స్ చైర్మన్ ప్రొఫెసర్ మార్కస్ గురువారం ఈ యాప్‌ను ప్రారంభించారు. రెండేళ్లుగా ఈ యాప్‌ను అభివృద్ధి చేసి, విజయవంతంగా పరీక్షించిన తర్వాత ఆవిష్కరించారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఈ యాప్‌ను హైదరాబాద్‌లో 720 మందిపై అమలు చేయగా సత్ఫలితాలు ఇచ్చిందని రూపకర్తలు చెప్పారు.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. 